తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-3-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 58 పేజీలు: 10+4 వెల: 6.50

పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్
పుతిన్ లగ్జరీ కారులో భారీ పేలుడు
5

## గ్రూప్-1 టాప్-10లో ఆరుగురు మహిళలే




### 550 మార్కులతో టాపర్‌గా మహిళ

### జిఆర్‌ఎల్‌ను ప్రకటించిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్‌లో మహిళా అభ్యర్థి టాపర్‌గా నిలిచింది. 900 మార్కులకి గానూ.. 550 మార్కులను సాధించిన మహిళ టాపర్‌గా నిలిచింది. అంతేకాకుండా టాప్-10లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం. గ్రూప్-1 మెయిన్స్‌కి సంబంధించిన ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఉగాది పండుగ(ఆదివారం) రోజును ప్రకటించింది. ఈ నెల 10న గ్రూప్-1 మెయిన్స్‌కి సంబంధించిన ప్రొవిజినల్ మార్కులను విడుదలచేయగా.. అందుకు సంబంధించిన అభ్యంతరాలను, రీకౌంటింగ్ పనులను ముగించుకున్న తరువాత టిజిపిఎస్‌సి ఆదివారం ఫలితాలను ప్రకటించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖ్లో ఖాళీగా ఉన్న 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. మెయిన్స్ పరీక్షలకు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారి ప్రొవిజనల్ మార్కులను ఈ నెల 10న జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్స్‌తోపాటు మెయిన్స్ పరీక్షల మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ప్రకటించింది. అభ్యర్థులు రాసిన >>2



ఆదివారం హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణి ప్రారంభించిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్ కుమార్, సీతక్క, కోమటిరెడ్డి తదితరులు

# పేదలకు వరం సన్నబియ్యం

### భారమైనా వెనక్కి తగ్గేది లేదు..

### హుజూర్‌నగర్‌కు వ్యవసాయ కళాశాల

### వరి సాగులో నల్లగొండ అగ్రస్థానం

### సన్నబియ్యం పంపిణి ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** దేశంలో ఏరాష్ట్రంలో అమలు చేయడం లేదు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు పట్టెడు అన్నం పెట్టడమే ప్రభుత్వ లక్ష్యం. దొడ్డు బియ్యం తినలేక పస్తులు ఉంటున్నారు. రేషన్‌షాపుల ద్వారా దొడ్డు బియ్యం కొనుగోలు చేసుకుని బయట వ్యక్తులకు, మధ్య దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వము కోట్ల రూపాయలు వెచ్చించి పిడిఎస్ పథకాన్ని అమలు చేసిన ప్రయోజనం కలగడం లేదు. ఈ పథకం మిల్లర్లకు, అక్రమార్కులకు మాఫియాగా మారింది. ప్రభుత్వము చేస్తున్న ఖర్చు నిరుపయోగమవుతుంది. ఈ నేపథ్యంలోనే మంచి సంకల్పంతో పేద ప్రజల ఆకలిని తీర్చాలని ఉద్దేశంతో సన్న బియ్యం పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో సన్న బియ్యం పథకాన్ని ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అశేష జన వాహిని చూసి ముఖ్యమంత్రి భావోద్వేగానికి గురయ్యారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని పార్టీ శ్రేణులు సైనికులుగా ఉన్నారనేది పార్టీకి అండగా ఉంటున్నారనేది >>2

## నేడే రంజాన్

### పాతబస్తీలో భారీ భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), మార్చి 30 ప్రభాతవార్త:** ఆకాశంలో నెలవంక కనిపి ంచటంతో ముస్లింలు ఈ నెల 31వ తేదీ సోమవారం ఈదుల్ ఫితర్ (రంజాన్ పండుగ)ను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకోనున్నారు. మార్చి నెల రెండవ తేదీన పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అయ్యింది. ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు నిర్వహించారు. రంజాన్ మాసం సందర్భంగా పాతనగరంలోని మార్కెట్లు కొనుగోలు దారులతో కిక్కిరిసి పోయాయి. ఆదివారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించటంతో ముస్లింలు సోమవారం ఈదుల్ ఫితర్ >>2



బీజాపూర్ ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

## 50 మంది మావోయిస్టుల లొంగుబాటు

### వరస ఎన్‌కౌంటర్లు.. లొంగుబాట్లతో సతమతం

### మావోయిస్టు ఉద్యమానికి భారీ నష్టం..

**చర్ల, మార్చి 30, ప్రభాతవార్త:** రెండు దశాబ్దాల పాటు బస్తర్ దండకారణ్యాన్ని ఎదురు లేకుండా తమ కనుసన్నల్లో పాలించిన మావోయిస్టు పార్టీ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. వరుస ఎన్‌కౌంటర్లు లొంగుబాట్లతో వందల మంది పార్టీసభ్యులను మీలీషియా సభ్యులను గ్రామ కమిటీలను కోల్పోతుంది. ఇటువంటి పరిస్థితి లో ఉద్యమాన్ని దండకారణ్యం నుండి నడిపించాలా లేక ఇతర ప్రాంతాలకు వలస(సేఫ్‌జోన్)కి కొంతకాలం తలదాచుకోవాలి అన్న ఆలోచనలో మావోయిస్టు పార్టీ ఇన్నట్లు తెలుస్తుంది. వలస వెళ్లడమా ఇక్కడే ఉండి ఉద్యమాన్ని ఎదుర్కోవడమా మావోల దారెడు అన్న ఆలోచన సానుభూతిపరుల్లో అభిమానుల్లో అలోచన రేకెక్తిస్తుంది. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమం తగ్గుముఖం పట్టే సంకేతాల మధ్య ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. 50 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి భద్రతా దళాలకు లొంగిపోయిన ఘటన సంచలనంగా మారింది. వీరిలో ప్రధానంగా ఏరియా కమిటీ సభ్యులు శిలిబితి (పిపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) శిలిబితి బెటాలియన్ 01! కంపెనీ 02,07 సభ్యులు. నేషనల్ పార్క్ ఏరియా కమిటీకి చెందిన తిదిలీ స్థాయి నాయకులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై 68 లక్షల రివార్డు ఉంది. లొంగుబాటుకు ప్రధాన కారణాలను చూస్తే భద్రతా దళాల ఒత్తిడి ఒకవైపు, కొత్త పోలీసు శిబిరాల >>2

## 'ఫ్యూచర్ సిటీ'లో లక్షల మందికి ఉపాధి

### దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రం తెలంగాణ: సిఎం రేవంత్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 30 ప్రభాతవార్త:** ఒక గొప్ప నమూనా నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మించి, తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కేవలం జనావాసయోగ్యమైన నగరంగా కాకుండా వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చి, అన్ని వర్గాల యువతకు లక్షలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన వేడుకలో పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ముఖ్య అతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొనగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక చండీగఢ్ తప్ప ఒక సంపూర్ణమైన నగర నిర్మాణం దేశంలో ఎక్కడా జరగలేదు. ఉన్న నగరాలే కాస్త విస్తరించబడ్డాయి. నగరాల విస్తరణ >>2





ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పాతబస్తీలోని మక్కా మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

# నేడే రంజాన్

>>(రంజాన్ పండుగ)ను జరుపుకోనున్నారు. చార్మినార్, గుల్జారాహౌస్, చార్‌కమాన్, లాడ్‌బజార్, ఖిల్వత్, మొగల్‌పుర ప్రాంతాలలో ఆదివారం విపరీత మైన రద్దీ ఏర్పడింది. ముస్లింలు ఒకరికి ఒకరూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాతబస్తీలోని మీరాలం చారిత్రక ఈద్గా, చార్మినార్ సమీపంలోని మక్కామసీదులో సోమవారం ఉదయం ముస్లింలు సోదరులు సామూహిక ప్రార్ధనలు నిర్వహించనున్నారు. చారిత్రక మీరాలం ఈద్గాలో వేలాది మంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్ధనలు చేయటానికి వస్తున్నందున వక్ఫ్‌బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్, జిహెచ్‌ఎంసి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాతనగరంలోని అన్ని ప్రాంతాలలో దక్షిణమండలం పోలీసులు పటిష్టమైన భద్రగా ఏర్పాట్లు చేశారు. చారిత్రక మీరాలం ఈద్గాలో వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్దనలు నిర్వహించటానికి రానున్నందున సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పాతబస్తీలోని అన్ని ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా చారిత్రక మక్కామసీదు, మీరాలం ఈద్గాలలో సోమవారం సామూహిక ప్రార్దనలు జరగనున్నందును ట్రాఫిక్‌ను వేరే ప్రాంతాలు మీదుగా మళ్లించనున్నారు.

# 'ఫ్యూచర్ సిటీ'లో లక్షల మందికి ఉపాధి

>>అస్తవ్యస్తంగా మారడం వల్ల ప్రపంచంలో వెనుకబడిన దేశంగా ఉండిపోయింది. దేశంలో కొత్త నగరాల నిర్మాణం జరగాల్సిన అవసరం ఉన్నదన్నారు. తెలంగాణ రైజింగ్ దేశానికి ఆదర్శంగా నిలబెట్టే, ప్రజలకు ఆదర్శంగా ఉండే విధంగా, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తేవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దాంట్లో భాగంగానే మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టులతో పాటు నగరానికి ఒక కొత్త ఫ్యూచర్ సిటీని నిర్మించాలని తలపెట్టాం అని అన్నారు. వేద పండుతులు పంచాంగ పఠనం విన్నప్పుడు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ గుర్తొచ్చిందని, బడ్జెట్ కూడా షడ్రుచులతో కూడుకుని ఉంది. బడ్జెట్ లో కొన్ని నియంత్రణలు పాటించారు. చాలా అంశాల్లో ఉదారంగా ముందుకొచ్చారు. ఉప ముఖ్యమంత్రితో కలిసి జోడెద్దుల్లా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపించడానికి నిరంతరం ప్రయత్నం



ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

చేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులు పండించిన పంటకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ గిట్టుబాట ధరలతో వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, పేదలకు వైద్యం అందించాలని, నిరుపేదలకు విద్యను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఆ రంగాలకు అధిక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులు రావాలి. శాంతి భద్రతలు పూర్తి స్థాయిలో అమలు కావాలి. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ దిశగా నిరంతరం ప్రయత్నం జరుగుతూనే ఉంటుందన్నారు. ఒకప్పుడు పేదవాడు పండుగ పూట మాత్రమే తెల్లన్నం తినే వారు, మొట్టమొదట కోట్ల విజయ భాస్కర్ రెడ్డి, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 1.90 లకే కిలో బియ్యం పథకాన్ని, ఆ తర్వాత ఎన్టీ రామారావు ం రూ. 2 లకే కిలోబియ్యం పథకం, ఆ తర్వాత దేశంలో ఆహార భద్రతా చట్టం తేవడం వంటి కార్యక్రమాలతో పేదవారి ఆకలిని దూరం చేసే దిశగా ప్రయాణం జరుగుతున్నాయన్నారు. శ్రీమంతులు తిన్నట్టుగా నిరుపేదలు సన్నబియ్యం తినాలి. తెలంగాణలో సన్నబియ్యం అత్యధికంగా పండించే దిశగా ప్రభుత్వం గిట్టుబాటు ధరలతో పాటు బోనస్ ఇవ్వడం ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నాం. గతేడాది దేశంలోనే అత్యధికంగా వరి ధాన్యం ఉత్పత్తి సాధించుకున్నాం. ఈ సీజన్ లో కూడా అత్యధికంగా పండిస్తున్నారన్నారు. రైతులు పండించిన సన్న బియ్యాన్ని పేదలకు పంచాలన్న ఒక గొప్ప లక్ష్యంతో, ఈ ఉగాది పండుగ పేదవారి ఇళ్లల్లో సంతోషాన్ని తెచ్చిపెట్టాలని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. తెలంగాణకు మంచి భవిష్యత్తు ఉన్నదని వేద పండితులు చెప్పినట్టుగా రాష్ట్రాభివృద్ధికి మంచి నిర్ణయాలు తీసుకుంటూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగబద్ధమైన సంస్థలతో మంచి వాతావరణంలో అందరి సహకారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాం. మా సంకల్పంలో, ఆలోచనల్లో స్పష్టత ఉంది. సంకల్ప బలం ఉంటే దేవుడు కూడా కరుణిస్తారు. తెలంగాణ రైజింగ్ 2050" ప్రణాళికతో దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా ఒక అద్భుతమైన అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీసుకెళ్లాలని సంకల్పించాం. అందరి ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడుతాం" అని ముఖ్యమంత్రి గారు చెబుతూ ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మల్‌రంగారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రదేవదాయ ధార్మాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, తెలంగాణ సాంస్కృతసారధి వెన్నెల గద్దర్, ఇతర ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క మాట్లాడుతూ మంచి సంకల్పం, పరిపాలనతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఉగాది పచ్చడి లాగా షడ్రుచులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. పంచాంగ్రశ్రవణం చేసిన పండితులు బాచంపల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ "రియల్ ఎస్టేట్ రంగం తెలంగాణలో ఈ ఏడాది పరుగులు పెడుతుంది. తెలంగాణ రాష్ట్రం మిధున రాశి, పునర్వసు నక్షత్రంలో ఆవిర్భవించింది. పాలకుల మధ్య పోటీతత్వం పెరుగుతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పాలకులు పోటీపడి పరుగులు పెట్టి పాలిస్తారు. ప్రజలకు డబ్బు బాగానే సిద్ధిస్తుంది. ఈ ఏడాది ప్రజలు అత్యంత సంతోషంగా ఉంటారు. రాష్ట్రానికి రావాల్సిన డబ్బు రాకపోవడంతో కొంత ఇబ్బంది ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. విద్య, వైద్యంపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. అనుకోని ఇబ్బందుల వల్ల అన్ని కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇవ్వకపోవచ్చు. పాలకులు ప్రజాహిత కార్యక్రమాలకు ప్రజాధనాన్ని వెచ్చిస్తారు. విదేశీ పెట్టుబడులు ఎక్కువగా తెచ్చే ప్రయత్నం చేస్తారు. రాష్ట్ర ఆదాయం బయటకు పోకుండా కాపాడే ప్రయత్నం చేస్తారు. ఈ సంవత్సరం వర్షం బాగా పడుతుంది.. కానీ పంటలు కాపాడుకోవాలి" అని సంతోష్‌కుమార్ వ్యాఖ్యానించారు.

### గ్రూప్-1 టాప్-10లో

# ఆరుగురు మహిళలే

>> క్వాలిఫైయింగ్ టెస్ట్(ఇంగ్లీష్)తోపాటు మిగిలిన 6 పేపర్లలో సాధించిన మొత్తం మార్కులతో కూడిన మరో జాబితాను ప్రత్యేకంగా విడుదల చేసింది. మార్కుల మెమోలను ఏప్రిల్ 5 వరకు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్‌కి అందుబాటులో ఉంటాయని కమిషన్ ప్రకటించింది. మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అభ్యర్థులు తమ పర్సనల్ లాగిన్‌లలో టిజిపిఎస్‌సి ఐడా, హాల్ టికెట్ నంబర్‌తోపాటు పుట్టిన తేదిని ఎంటర్ చేయాలి.. దీంతో తన మొబైల్‌కి ఓటిపి వస్తుంది.. ఓటిపిని ఎంటర్ చేస్తే మెమో డౌన్‌లోడ్ అవుతుంది. టిజిపిఎస్‌సి ప్రకటించిన జిఆర్‌ఎల్ ఏప్రిల్ 28 వరకు అందుబాటులో ఉంటుందని ప్రకటించింది. జిఆర్‌ఎల్ ఆధారంగానే అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పిలుస్తామని కమిషన్ ప్రకటించింది. అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ విషయాన్ని కమిషన్ స్వయంగా పంపించనుంది. ఏదైనా సమస్య ఎదురైతే అభ్యర్థులు కమిషన్ హెల్ప్ డెస్క్ నంబర్లు.. 040-23542185, 040- 23542187 లో సంప్రదించాలని పేర్కొంది.

**టాప్-10 ర్యాంకర్ల మార్కుల వివరాలు..**

మొదటి ర్యాంకర్‌కి రెండో ర్యాంకర్‌కి 14.5 మార్కుల తేడాఉంది. మొత్తం 900 మార్కులకి గానూమొదటి ర్యాంకర్‌కి 550 మార్కులు రాగా.. రెండో ర్యాంకర్‌కి 535.500 మార్కులు వచ్చాయి. రెండో ర్యాంక్‌ను పురుష అభ్యర్థి సాధించాడు. మూడో ర్యాంక్ కూడా535.500 మార్కులతో పురుష అభ్యర్థి సాధించాడు. నాలుగో ర్యాంక్‌ను మహిళా అభ్యర్థి532.500 మార్కులతో, 5వ ర్యాంక్‌ను మహిళా అభ్యర్థి 532 మార్కులతో సొంతం చేసుకుంది. 6వ ర్యాంక్‌ను 525.500 మార్కులతో పురుష అభ్యర్థి సొంతం చేసుకోగా.. 7వ ర్యాంక్‌ను 524 మార్కులతో మహిళ, 8వ ర్యాంక్‌ను 521 మార్కులతో మహిళ, 9వ ర్యాంక్‌ను కూడా 521 మార్కులతో మహిళ సొంతం చేసుకుంది. 10వ ర్యాంక్‌ను 519 మార్కులతో పురుష అభ్యర్థి సొంతం చేసుకున్నాడు.

## వారం - వర్జ్యం

తేది : 31-03-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల విదియ ఉ.9.12, తదియ తె.5.42
అశ్వని మ.1.46
వర్జ్యం రా.10.19-రా.11.45
దు.ము.12.37-1.26, 2) మ.3.04-3.53
శుభసమయం : ఉ.9.15-10.10
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ఎంతో సన్నిహితంగా ఉన్నవారు మీకు విరుద్ధంగా మారి మిమ్మల్ని నిందారోపణలకు గురి చేస్తారు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంక్రిమెంట్లు లభిస్తాయి.

**మిథునం:** పిల్లల క్షేమం కోసం, మీ భవిష్యత్తు కోసం ఎక్కువ యోచిస్తారు. విదేశీ పర్యటనలు.

**కర్కాటకం:** చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు.

**సింహం:** స్థిరాస్తి వృద్ధి చెందుతుంది. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వస్త్రలాభం.

**కన్య :** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. షేర్ల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన ఒకానొక విషయంలో ఏ నిర్ణయం తెలుసుకోలేని సందిగ్ధావస్థను ఈ రోజు ఎదుర్కొంటారు.

**ధనుస్సు:** శరీర ఆరోగ్యం గురించి తగిన జాగ్రత్తలు ముందుగానే తీసుకోవలసి వుంటుంది.

**మకరం:** ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదాపడకుండా చూడండి. శుభవార్తలు అందుకొంటారు.

**కుంభం:** అకాల భోజనం, శారీరక శ్రమ ఈ రోజు అనివార్యం. సోదరుల కలయిక.

**మీనం:** వ్యాపార లావాదేవీలలో ముఖ్యంగా అమ్మకాలలో నష్టం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.


- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పేదలకు వరం సన్న బియ్యం

>> స్పష్టమవుతుందన్నారు. నల్లగొండ జిల్లాలో కార్యకర్తలే కాంగ్రెస్కు అండ అన్నారు. నల్లగొండ జిల్లా పోరాటాలకు నిలయమన్నారు. చాకలి ఐలమ్మ దొడ్డి కొమరయ్య మల్లు స్వరాజ్యం రావి నారాయణరెడ్డి భీమిరెడ్డి నరసింహారెడ్డి ధర్మబిక్షం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వంటి పోరాట యోధులు ఉద్యమాలు నడిపిన జిల్లా నల్లగొండ జిల్లా అని అన్నారు. వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటికీ నల్లగొండ జిల్లా ప్రజలు చైతన్యవంతంగా ముందుకు సాగుతున్నారు అన్నారు. రావి నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపిన ఘనత నల్లగొండ జిల్లాకు దక్కుతుందన్నారు. అదేవిధంగా ఐదు లక్షల 65 వేల మెజార్టీతో కుందూరు రఘువీర్ రెడ్డిని పార్లమెంటుకు పంపించి దక్షి ణ భారతదేశము నుండి రికార్డ్ సృష్టించడానికి కారకులు నల్లగొండ ప్రజలని అన్నారు. కొమరం భీం జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడినట్లుగానే భూమికోసం భుక్తి కోసం పేదవాడి విముక్తి కోసం పోరాడిన పోరాట యోధులు ఉన్న నల్లగొండ జిల్లా ఉద్యమాలకు మారుపేరుగా పేర్కొన్నారు. హుజూర్నగర్, కోదాడ ప్రాంత ప్రజలు ఎంతో చైతన్యవంతమైన వారిని మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిని ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా అదేవిధంగా పద్మావతి రెడ్డిని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి పార్టీ ఆధిక్యతను నిలిపారన్నారు. ఈ రెండు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేస్తున్నారని పార్టీకి అండగా నిలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఆనందాన్ని కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా నిలిపారన్నారు. సన్న బియ్యం పథకం హుజూర్నగర్ లో ప్రారంభించుకోవడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పకడ్బందీగా సన్న బియ్యం పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పది సంవత్సరాలు పరిపాలన చేసిన భారత రాష్ట్ర సమితి సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టకపోవటము అన్యాయం అన్నారు. కెసిఆర్ ఫామ్ హౌస్ లో వరి సాగు చేసుకుని క్వింటాకు 4000 రూపాయలు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. వరి సాగు చేస్తే ఉరి వేసుకున్నట్లే అని ప్రకటించిన కేసీఆర్ ఫామ్ హౌస్ లో వరి ఎందుకు సాగు చేశారని ప్రశ్నించారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం నిర్మాణం చేసి మూడు సంవత్సరాల్లోనే కూలిపోయేలా చేశారని ఆరోపించారు. ఎస్ ఎల్ బి సి టన్నల్ నిర్మాణ విషయంలో కూడా గత ప్రభుత్వము నిరక్ష ్యం చేసిందన్నారు. ఫలితంగా మూడు లక్షల అరవై వేల ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎస్ ఎల్ బి సి టన్నల్ నిర్మాణ విషయంలో చొరవ తీసుకున్నారన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎత్తిపోతల పథకాలను నిర్మించిన ఘనత కూడా కాంగ్రెస్కే దక్కిందన్నారు. ఒక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి వృధా ఖర్చు చేసి కూలిపోయేలా చేశారని తీవ్రస్థాయిలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 2006లో జెడ్పిటిసి గా గెలిచిన తాను క్రమక్రమంగా ఎదుగుతూ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడిగా పనిచేసే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ముఖ్యమంత్రిగా ఎన్నిక కావటానికి సహకరించిన ఆశీర్వదించిన ప్రజలందరికీ ఎప్పుడు రుణపడి ఉంటానని రేవంత్ రెడ్డి అన్నారు. సన్నబియ్యానికి బోనస్ ఇప్పటివరకు 1200 కోట్లు అందజేసినట్టు తెలిపారు. సన్నాల సాగు నల్లగొండ జిల్లాలో పెరిగిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే సన్నాల్ల సాగు నల్లగొండ జిల్లాలోని అధిక ఎకరాల్లో చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి 15 నెలల కాలంలో దాదాపు హామీలన్నీ అమలు చేస్తూ వచ్చామన్నారు. రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు అందజేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. హుజూర్నగర్ కు వ్యవసాయ కళాశాలను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ, దేవరకొండకు కూడా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంపై పలు సామెతలు వేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు హాజరైన వారిని నవ్వించారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోడల్ కాలనీలో నిర్మించిన 2,160 గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సన్మానించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 85 శాతం మంది పేదలకు సన్నబియము అందుతుందన్నారు. కొత్తగా రేషన్ కార్డులు కూడా అర్హులందరికీ అందజేస్తామన్నారు. రేషన్ కార్డులు మంజూరు నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. సోనియాగాంధీ కన్న కలలను నెరవేరుస్తున్నామన్నారు. కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎంతో నష్టానికి గురయ్యారని ప్రస్తుతము కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పెట్టిన వారిని ఎవరిని వదలమన్నారు. తన కుటుంబమంతా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అని ఉత్తం పేర్కొన్నారు. గత ప్రభుత్వము రేషన్ కార్డులను మంజూరు చేయడంలో విఫలమైందన్నారు. 12,717 సమ భావన సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. ధారావత్ బుజ్జి, మాలోతు రంగా, రాధా, లక్ష్మి ్మ, రెహమాన్, కారెమ్మ, లక్ష్మి ్మ, గురువమ్మ, సుశీల, పుష్పాలకు సన్న బియ్యాన్ని ముఖ్యమంత్రి పంపిణీ చేసి ప్రారంభించారు. హుజూర్నగర్ లో సీతారామ స్వామి పుట్ట వద్ద గృహ నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వి.పి గౌతమ్ పరిశీలించారు. 135 బ్లాకులు చేపట్టి 21 60 ఇళ్లను నిర్మించారు. రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ గృహాలను నిర్మించిన ఘనత హుజూర్నగర్ కు దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించడం అదృష్టం అన్నారు. ముఖ్యమంత్రి హుజూర్నగర్ చేరుకోగానే సన్నాయి మేళంతో స్వాగతం పలికారు. డప్పు కళాకారులు బిందెలతో బంజారా కళాకారులు స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మె ల్యేలు పద్మావతి రెడ్డి, సామేలు, వీరేశం, బాలు నాయక్, అనిల్ కుమార్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీ మల్లు రవి, వేణుగోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, నరసింహ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల లొంగుబాటు

>> ఏర్పాటు మరో వైపు. అభివృద్ధి కార్యక్రమాలు రోడ్లు, విద్యుత్, సంక్షేమ పథకాలుమావోయిస్టు పార్టీలో విభేదాలు అవిశ్వాసం పెరుగుతున్న కారణాలు ప్రధానం గా మావోయిస్టు పార్టీ కి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ప్రధానంగా పోలీసులు ఆదివాసి గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిస్థితి ప్రోగ్రాం లాంటి నిర్వహించడమే కాకుండా మావోయిస్టులకు సహకరించొద్దని జనజీవన స్రవంతిలో మావోయిస్టు కలవాలని ఇంటికి వెను తిరగాలని ప్రచారం రూపొందుకోవడం ప్రధానంగా ఈ లొంగుబాటులకు కారణంగా కనిపిస్తుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ అధికార గణాంకాల ప్రకారం 2024 సంవత్సరం నుండి ఇప్పటి వరకు 656 మంది మావోయిస్టులు అరెస్టు కాగా346 మంది లొంగుబాట్లు జరిగాయి. 141 ఎదురు కాల్పుల్లో మృతి చెందారు. ఈ ఏడాది 2025 (జనవరిమార్చి) వరకు 153 మంది అరెస్టు 157మంది లొంగిపోయారు. 83 ఎదురు కాల్పుల్లో మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మావోలొంగుపొయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో బస్తర్ ఐజి సుందర్ రాజ్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వ పునర్వాస విధానం మరియు భద్రతా దళాల విజయమని చెప్పారు. మావోయిస్టుల లొంగుబాటుతో ఆ ప్రాంతంలో శాంతి నెలకొనటానికి ఇది మంచి సూచన అని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని భవిష్యత్తులో వీరికి మరిన్ని పునరావాస పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. భద్రతా వ్యూహాలు భవిష్యత్ ప్రణాళికలు చూస్తే ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేస్తూ కొత్త పోలీస్ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించేందుకు, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టింది. కాగా మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.. ఇటీవల మావోయిస్టు పార్టీ ఛత్తీస్గఢ్ కమిటీ కేంద్ర కమిటీ. జగన్ లో పేరుతో వరుస లేఖలు.. అలాగే పోలీసు వాహనాలు ముఖ్యంగా బీజాపూర్ జిల్లా గొర్ల అడవి ప్రాంతంలో పోలీసు వాహనంపై ఐడి దాడి సంచలనంగా మారింది మరోవైపు లేఖలో మైనర్లు సైతం మావోయిస్టు పార్టీ వైపు చూస్తున్నారని. నవరత్నం మావోయిస్టు పార్టీకి అవసరమని అలాగే రిక్రూట్మెంట్లు సంబంధించి.. ముఖ్యంగా ట్రైనింగ్ చేస్తున్న మావోయిస్టుల వీడియో అంతర్జాలంలో వైరల్ గా మారటం మావోయిస్టు పార్టీ వ్యూహం ఏంటనేది కొంత అనుమానాలు దారి తీస్తుంది అయితే మావోల వ్యూహాలకు ప్రతి వ్యూహాలు రచిస్తూ దండకారణ్యంలోకి భద్రతా బలగాలు దూసుకెళ్తున్నాయి. భద్రత బలగాలు 2026 మార్చి 30 కల్లా మావోయిస్టు పార్టీ రూపురేఖలు లేకుండా చేస్తామని మావోయిస్టు రహిత దేశంగా మారుస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటనతో భద్రత బలగాలు అడవుల్లో భారీగా సోదాలు నిర్వహిస్తున్నాయి.. ఐతే ఐదు ఆరువేల మందికి పైగా అడుగడుగున అడవిని జలవబడుతున్నాయి అంటే భద్రతా బలగాలు ఏ రీతిలో మావోయిస్టులపై విరుసుకు పడుతున్నాయంటే అర్దం అవుతుంది. అందుకు ఈ మధ్యకాలంలో జరిగిన వరస ఎన్ కౌంటర్లే ఉదాహరణ. ఏదైనాప్పటికీ వరుస ఎన్కౌంటర్లు వరుస లొంగుబాట్లు వరుస అరెస్టుల తో మావోయిస్టు పార్టీ కి భారీ నష్టం వాటిల్లుతుందని చెప్పవచ్చు.



ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయిన సిఎం రేవంత్

# 3న కేబినెట్ విస్తరణ ఉన్నట్లేనా?

### గవర్నర్‌తో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి30:** రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఆయనను శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసిన సందర్భంగా ప్రధానంగా మంత్రివర్గ విస్తరణపైనే చర్చ కొనసాగినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 3వ తేదీన మంత్రివర్గ విస్తరణ, మంత్రుల ప్రమాణ స్వీకారం, వారికి శాఖల కేటాయింపులు కూడా ఉండే అవకాశం ఉంటుందని సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 12 మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరుగురికి కేబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో మరో నలుగురికి మాత్రమే చోటు కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరో ఇద్దరికి కొద్దికాలం తర్వాతనే అవకాశం లభించనున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. గవర్నర్ భేటీ సుమారు గంటన్నర పాటు కొనసాగింది. అన్నీ అనుకూలిస్తే ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని అంటున్నారు. ఆ రోజున మంచి ముహూర్తం ఉందని చెబుతున్నారు. ఇక మంత్రివర్గంలోకి ఎవరికి తీసుకోవాలన్నది హైకమాండ్ వద్దనే లిస్ట్ ఫైనలైజ్ అయింది అని అంటున్నారు. తగిన సమయంలో వారికి ఫోన్లు వస్తాయని మంత్రులుగా వారు ప్రమాణం చేయడమే తరువాయి అని అంటున్నారు. అయితే మీడియాలో వచ్చిన పేర్లు కాకుండా అనూహ్యంగా కొంతమందికి మంత్రి చాన్స్ ఉండొచ్చు అని కూడా అంటున్నారు.

## సంక్షేమ పథకాలు.. చిరస్థాయిగా నా గుండెలో నిలిచిపోతాయి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి30:** హుజూర్‌నగర్‌లో రేషన్‌షాప్‌ల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. అనంతరం ట్వీట్ చేశారు. 'ప్రభుత్వాధినేతగా.. రాష్ట్ర అభివృద్ధి కోసం.. ప్రజల సంక్షేమం కోసం..నిత్యం అనేక నిర్ణయాలు తీసుకుంటాను..వాటిలో కొన్ని నిర్ణయాలు, కొన్ని సంక్షేమ పథకాలు.. చిరస్థాయిగా నా గుండెల్లో నిలిచిపోతాయి.. శాశ్వతంగా మదిలో ఉండిపోతాయి.. నాయకుడిగా నాకు.. అత్యధిక సంతృప్తిని ఇస్తాయి. అటువంటిదే.. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సన్నబియ్యంతో బువ్వ పెట్టే పథకం. పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఈ పథకంతో నిజం చేయాలన్నదే నా సంకల్పం అని పేర్కొన్నారు.

## రాష్ట్రంపై అల్లా దువా ఉండాలి: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్, మార్చి30:** రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఇంటిల్లి పాది సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకిక వాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథంఖురాన్ నుంచిఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని సిఎం ఆకాంక్షించారు.

## టోంగా దీవుల్లో తీవ్రస్థాయి భూకంపం

### రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో భూప్రకంపనలు

**నుకువాలోఫా(టోంగా), మార్చి 30:** పసిఫిక్ మహాసముద్రంలోఉ నన టోంగా దీవుల్లో ఆదివారం తీవ్రస్థాయి భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేలుపై 7.1 తీవ్రతతో కూడిన భూకంపం వచ్చిందని యుఎస్ స్టేట్ జియోలాజికల్‌సర్వే తెలిపింది. ఈ భూకంపం పంగై గ్రామానికి ఆగ్నేయంగా 90 కిలోమీటర్ల దూరంలో సంభవించింది. దీనిప్రభావం నియు ద్వీపదేశంవరకూ విస్తరించిందని హెచ్చరికలుజారీచేసారు. అమెరికా సునామీ హెచ్చరిక కేంద్రం సునామి వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. నియు, టోంగా తీరాల్లో అలల స్థాయి 0.3మీటర్లనుంచి ఒక మీటర్లవరకూ పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. తొలుత భూకంప కేంద్రంనుంచి 300 కిలోమీటర్లపరిధిలో ప్రమాదకరమైన సునామి అలలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. తీరప్రాంతాలకు దూరంగా ఉండాలని టోంగా అధికారులు ప్రజలకు సూచించారు. లోతట్టుప్రాంతాల్లో నివసించేప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు లేదా తీరప్రాంతానికి దూరంగా వెళ్లాలని టోంగానేషనల్ డిజాస్టర్ రిస్క్‌మేనేజ్‌మెంట్ కార్యాలయం ఫేస్‌బుక్‌లో తెలిపింది. టోంగాలో భూకంపాలు సాధారణం. ఇవి తక్కువ ఎత్తులో ఉన్న ద్వీప సమూహం. ఈప్రాంతంలో సుమారు లక్షమంది నివసిస్తున్నారు. ఇది ఆగ్నేయాసియా మీదుగా పసిఫిక్ బేసిన్‌వరకూ విస్తరించి ఉన్న తీవ్రమైన టక్టోనిక్ కార్యకలాపాలప్రాంతం అయిన రింగ్‌ఆఫ్ ఫైర్‌లో ఉంది.

## పేలవంగా రోహిత్‌శర్మ ఫాం

### కొత్వాల్ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు

### గౌరవంగా రిటైరయితే మంచిదని సలహా

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** ఐపిఎల్‌లో భాగంగా శనివారం ముంబయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ ఆటగాడు రోహిత్‌శర్మ కేవలం ఎనిమిది పరుగులు మాత్రమే చేసి అవుట్ అవడంపై సిటీకొత్వాల్, అండర్ 19 మాజీ భారత క్రికెటర్ సివి ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోహిత్‌శర్మ ఎప్పుడో కానీ పరుగులు చేస్తే ఎలా, అప్పుడప్పుడు మాత్రమే పరుగులు చేస్తుంటే గౌరవం దక్కుతుందా.. ఆయన ప్రశ్నించారు.

రోహిత్‌శర్మ తన స్థాయికి దగ్గ ప్రదర్శన చేయలేకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశ పరుస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో కెరీర్‌ను కొనసాగించే బదులు, గౌరవంగా రిటైర్ అవడం మేలని ఆనంద్ తెలిపారు. ఛాంపియన్ ట్రోఫి ఫైనల్‌వంటి అరుదైన సందర్భాల్లోనే రోహిత్ పరుగులు చేస్తే సరిపోతుందా? ఇతర మ్యాచ్‌ల సంగతి ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. అనుకోకుండా తాను ముంబయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను చూడడం జరిగిందని, ఈ సమ యంలో రోహిత్‌శర్మ అవుట్ అవడం చూశానని, అతను అవుటైన విధానం తనకు జాలి కలిగించిందని, దీనికి సంబంధించిన విడియోను ఆనంద్ షేర్ చేశారు. కొత్వాల్ ఆనంద్ షేర్‌చేసిన విడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఇక రాజకీయ నేతల విచారణ

### కొత్త మలుపు తిరగనున్న ఫోన్‌ట్యాపింగ్ కేసు

### శ్రవణ్‌రావు తర్వాత నేతలకు నోటీలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మలిదఫాగా రాజకీయ నేతలను పోలీసులు విచారించే అవకాశాలు కనిపి స్తున్నాయి. ఈ కేసులో ఏడాది తరువాత శనవారం నాడు పోలీసుల విచారణకు హాజరైన మీడియా అధినేత శ్రవణ్ రావు నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా ఈ గోల్‌మాల్‌లో పాలుపంచుకున్న నేతలను విచారంచేందుకు పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. శ్రవణ్ రావును ఏప్రిల్ రెండవ తేదీన మరోసారి విచారించనుండడం తో ఇది పూర్తయిన తరువాత ఫోన్ ట్యాపింగ్‌కు కారకులైన రాజకీయ నేతలు, ఇందులో ప్రమేయం వున్న నాయకులను వరుసగా విచారించే అవకాశాలున్నాయి. దీని తరువాత ఫోన్ ట్యాపింగ్ కొత్త మలుపు తిరిగే వీలుంది.

రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపి, పోలీసు శాఖను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎనిమిది నెలల తరువాత మళ్లీ కదలిక వచ్చింది. గత ఏడాది మార్చి నెలలో వెలుగు చూసిన ఈ కేసులో నాటి సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు డిసిపి తిరుపతన్న, భూపాలపల్లి అదనపు ఎస్‌పి భుజంగరావు, ఎస్‌ఐబి డిఎస్‌పి ప్రణీత్ రా వు, సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులను సిట్ అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించగా వీరంతా పది నెలల తరువాత బెయిలుపై విడుదలవడం తె లిసిందే. కాగా ఈ కేసు వెలుగు చూడడానికి ముందే అమెరికాకు పారిపోయిన ఆరవ ముద్దాయి శ్రవణ్ రావు సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వుల తరువాత శనివారం నాడు పోలీసుల విచారణకు హాజరవడం విదితమే. ఆయనను ఆరు గంటలకు పైగా పోలీసులు విచారించి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కీలక సమాచారం రాబట్టారు. అయితే ఆయన నుంచి మరింత సమాచారం కోసం ఏప్రిల్ రెండవ తేదీన మరోసారి విచారణకు రావలని ఆదేశించారు. ఆయనను రెండవసారి కూడా విచారించిన తరు వాత ఈ కేసులో వెలుగుచూసే సమాచారం ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాజకీయ నేతలను విచారించేందుకు పోలీసులు రెడీ అవుతున్నారు.

వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ వెలుగుచూసిన మొదట్లోనే రాజకీయ నేతల పేర్లు వెలుగు చూడడం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన నలుగురు నాటి మంత్రులతో పాటు కొందరు నే తల ఒత్తిడి మేరకు, వారి ప్రయోజనాల కోసమే ఇదంతా చేసినట్లు వాంగ్మూలం ఇవ్వడం విదితమే. దీంతో పాటు ఈ గోల్‌మాల్‌లో నాటి ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావుల పాత్ర వుందని వారు చెప్పడం మరింత సంచలనం రేపింది. దీంతో ఆ సమయంలోనే ఆరోపణలు వచ్చిన నాయకులను విచారించేం దుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే న్యాయ నిపుణుల సూచనల మేరకు ఈ కేసులో కీలక నిందితులుగా వున్న మొదటి ముద్దాయి ప్రభాకర్ రావు, ఆరవ ముద్దా యి శ్రవణ్ రావులను అరెస్టు చేసి విచారణ చేశాక వెలుగుచూసే సమాచారం ఆధారంగా నేతలను విచారించాలని పోలీసులు నిర్ణయించారు. ఇద్దరు కీలక నిందితుల్లో శ్రవణ్‌రావును అరెస్టు చేయకుండా సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయనను కేవలం విచారణకే పరిమితం చేసి కీలక సమాచారం రాబట్టారు. ఆయన ను ఇంకోసారి విచారించిన తరువాత మరింత సమాచారం రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. దీనిని బట్టి ఫోన్ ట్యాపింగ్‌లో నేతల పాత్ర ఏ మేరకు వుంది...? వీ రితో నాటి ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్ రావుకు వున్న లింకులేమిటి...? ఇతర పోలీసులకు వున్న సంబంధం ఏమిటీ...? అనే వివరాలు వెల్లడయ్యే వీలుందని పోలీసులు భావిస్తున్నారు. దీని తరువాత నేతలను విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ఇక ఈ కేసులో అమెరికాలోనే వున్న ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ హైకోర్టులో విచారణలో వుంది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు సర్కారు రెండు వారాల గడువు కోరడం తెలిసిందే. ఒకవేళ ప్రభాకర్ రావుకు కూడా ముందస్తు బెయిల్ లభిస్తే ఆయన కూడా అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల విచారణకు హాజరయ్యే వీలుంది.

# ఇందిరమ్మ ఇంటి పథకానికి కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఇళ్లు లేకుండా జీవనం సాగిస్తున్న పేదవాళ్లు ఏ ఒక్కరు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతిపేదవానికి ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తోంది. అంతేకాకుండా ఇందిరమ్మ ఇంటి పథకంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికి ఈ పథకాన్ని జనవరి 26, రిపబ్లిక్‌డే ఉత్సవాలను పురస్కరించుకుని ప్రారంభించింది. అంతేకాకుండా అదేరోజున ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేసుకుని వారికి మంజూరు పత్రాలను అందిం చింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా పలు ఇళ్ల నిర్మాణాలను ఇప్పటికే బొగ్గు పోసి ప్రారంభించారు. మరికొద్దిరోజుల్లో బేస్‌మెంట్ స్థాయిని పూర్తి చేసుకోబోతున్నాయి. ఇందులో భాగంగా కొద్దిరోజులు క్రితం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలను విడుదలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హత కలిగిన వారి నుంచి ప్రజాపాలన, గ్రామ సభల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది.

జిల్లాల వారీగా అర్హులను జాబితాను సిద్ధంచేసి మొదటి విడుతలో సోంత జాగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో భాగగంగా మొదటి విడుతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 72,045 మంది లబ్ధిదారులకు ఇండ్లను మంజరు చేశారు. ప్రస్తుతం అర్హుల లిస్టును ప్రకటించిన గ్రామాలను మినహాయించి మిగిలిన అన్ని గ్రామాల్లో అర్హుల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు మొదటి విడుతలో ఇండ్లు కుట్టకోవాలనుకునే పేదలకు ప్రాధాన్యం ఇచ్చారు. పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపికయిన లబ్దిదారులు ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించారు.

అయితే ఇందిరమ్మ ఇళ్ళపథకంలో భాగంగా ఇల్లు నిర్మించుకున్న లబ్దిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఇంటి నిర్మాణానికి ప్రారంభంలో ( ఫౌండేషన్) రూ.1 లక్ష, బేస్‌మెంట్ లెవల్లో రూ.1.25 లక్షలు, ఇతర నిర్మాణాలు పూర్తవుతుంటే రూ.1లక్ష ఇస్తామని లబ్దిదారుల ఖాతాలోనే నేరుగా నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటిచింది. అయితే తాజగా ఇందిరమ్మ పథకాకిని సంబంధించి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటి ప్రకారమే నిర్మాణాలు జరగాలని సూచించారు.

ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్మాణాలు జరగాలని సూచించారు. లేదంటే బిల్లులు నిలిపివేస్తామని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 26న మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతున్నాయి.. అయితే రాష్ట్రవ్యాప్తంగా 10000 ఇళ్ళ నిర్మాణాలు బేస్‌మెంట్ లెవల్‌కు రాగానే మొదటి దశలో బిల్లులు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని సరిపడా నిధులు సిద్దంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలూ పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు వారు చెబుతున్నారు.

**కొత్త మార్గదర్శకాలు ఇవే..**

ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసిన తర్వాత బేస్‌మెంట్ పనులు ప్రారంభించే ముందు స్థలం ఫోటో తీయాలి.

ఆ ఫోటోను ఇందిరమ్మ యాప్‌లో మొబైల్ ఫోన్ ద్వారా జియోకో ఆర్డినేట్స్‌లో నమోదు చేయాలి.

ఇంటి నిర్మాణ వైశాల్యం 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఉండాలి.

రెండు గదులు, ఒక వంట గది, బాత్‌రూమ్ ఉండేలా ఇంటి నిర్మాణం చేపట్టాలి.

ప్రతి దశలోనూ ఫోటోలు తీసి మొబైల్ ద్వారా ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

వాటి ఆధారంగానే లబ్దిదారులకు చెల్లింపులు ఉంటాయి.

పాత ఇంటిని ఆనుకొని గాని, ఇప్పటికే ఉన్న ఇంటికి అదనపు గదులుగా కానీ, కొంత వరకు కూల్చివేసిన వాటికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మాణం చేయకూడదు.

గతంలో నిర్మాణం ప్రారంభించి కొంత మేరకు నిర్మించిన ఇళ్లకు ఎట్టి పరిస్థితుల్లో ఇందిరమ్మ పథకం మంజూరు చేయవద్దు.

ఇళ్లను కలిపి కట్టుకోవడానికి అనుమతి లేదు.

ఒక కుటుంబంలోని ఒక సభ్యుడికి ఒక ఇల్లు మాత్రమే ఇవ్వాలి.



## ఈ యేడాది బిఆర్‌ఎస్‌కే అనుకూలం

### మళ్లీ సిఎంగా కెసిఆర్

### తెలంగాణ భవన్ ఉగాది వేడుకల

### పంచాంగ పఠనంలో రాజేశ్వర సిద్ధాంతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 30:** ఈ యేడాది రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీఆర్‌ఎస్‌దే విజయమని పంచాంగకర్త శ్రీ రాజేశ్వర సిద్ధాంతి తెలిపారు. కేసీఆర్‌కు ఈ ఏడాది సానుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్ ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజేశ్వర సిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు.'కుజుడు నీచ స్థానంలో ఉన్నాడు కాబట్టి ఈ ఏడాది రైతులను పట్టించుకునే స్థితి ఉండదు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు నామమాత్రంగానే ముందుకు వెళ్లడానికి అవకాశం ఉంది. కుజుడు వ్యయ స్థానంలో స్తంభింపడి ఉన్నాడో.. కొద్దిరోజుల తర్వాత పోలీసు వ్యవస్థకు అధికారాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది చివరి వరకు కూడా ప్రభుత్వం చెప్పుచేతుల్లోనే అధికార దుర్వినయోగం అవుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జాగ్రత్తగా ఉండాలి.. కొత్త పెట్టుబడులు పెట్టకూడదు. సంవత్సరాంతంలో కొంత మెరుగుపడే అవకాశం ఉంటుంది.' అని రాజేశ్వర సిద్ధాంతి తెలిపారు.బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ది కర్కాటక రాశి అని రాజేశ్వర సిద్ధాంతి తెలిపారు. ఈ రాశికి ఆదాయం 8, వ్యయం 2, రాజపూజ్యం 7, అవమానం 3 ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీది ధనుస్సు రాశి అని చెప్పారు. ఈ ఏడాది పార్టీపై మీడియా దుష్ప్రచారం చేసే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బృహస్పతి సప్తమి స్థితిలో ఉన్నాడు కాబట్టి.. వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి వరకు ఏ ఎన్నికలు జరిగినా బీఆర్‌ఎస్ పార్టీదే విజయమని స్పష్టం చేశారు. కోర్టులు ముందుకొచ్చి మొట్టికాయలు వేస్తేనే ఎన్నికలు పెట్టే పరిస్థితి వస్తుందని చెప్పారు. కాబట్టి ఈ ఏడాదిలో వీలైనంత ఎక్కువగా ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిది కన్యా రాశి అని చెప్పారు. ఈ రాశికి ఆదాయం 14, వ్యయం 2 రాజపూజ్యం 6, అవమానం 6గా ఉంటుందని తెలిపారు. అయితే ఇన్ని రోజులు మంచి స్థితిలో ఉన్న బృహస్పతి మే 14 రోజున స్థాన చలనం చెందుతాడని చెప్పారు. అప్పటి నుంచి పదవీగండాలు ఎక్కువయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. పంచాంగ శ్రవణం ప్రకారం ఈశాన్య రాష్ట్రాల్లో భూకంపాలు వస్తాయని, దేశంలో సంపూర్ణ వర్షాలు పడతాయని చెప్పారు. రాష్ట్రంలోని ప్రస్తుత ప్రభుత్వం పాలన చేయడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయని, కేంద్రం నుంచే వచ్చే సహకారం రాష్ట్రం తీసుకోవడం సంపూర్ణంగా ఉండదని తెలిపారు. అధికార దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. పత్తిపంటలకు మంచి అవకాశం ఉందన్నారు. ఎర్ర నేలలో వేసే పంటకు మంచి అవకాశం ఉందని, వస్త్ర పరిశ్రమలు కొత్తగా వెలుస్తాయని,అభివృద్ధి బాగుంటుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఏ విధమైన ప్రజాపాలన కోరుకుంటున్నారో... తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రిగా పట్టం కట్టడానికి అవకాశం ఉన్న సంవత్సరంగా ఇదని చొప్పుకొచ్చారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఉగాది వేడుకలకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంపీ కెఆర్ సురేశ్‌రెడ్డి, శాసన మండలిలో విపక్ష నేత మధుసూదనచారి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్,బొల్లం మల్లయ్య యాదవ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుంచి జూనియర్ కాలేజీలకు 2 నెలలపాటు వేసవి సెలవులు

### అధికారికంగా ప్రకటించని ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఏప్రిల్ 2 నుంచి వేసవి సెలవులు కొనసాగనున్నాయి. తిరిగి జూనియర్ కాలేజీలు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే ఇంటర్ బోర్డు మాత్రం అధికారికంగా వేసవి సెలవులను ప్రకటించ లేదు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏడాది కూడా రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పూర్తయిన మరుసటి రోజు నుంచే వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. రెండు మూడు సంవత్సరాలుగా ఇదే విధానం కొనసాగుతోంది. వేసవి సెలవులు ముగిసిన తరువాత జూన్ 1న జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం అవుతాయి. జూన్ 1న ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం కానుండగా.. మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లన ప్రక్రియ షెడ్యూల్‌ను బట్టి క్లాసులు ప్రారంభం అవుతాయి. రాష్ట్రంలో మార్చి 25తో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ముగిశాయి.

మార్చి 30 ఉగాది, 31 రంజాన్ కావడంతో అధికారికంగా సెలవు దినాలు. రంజాన్ మరుసటి రోజైన ఏప్రిల్1 కూడా సెలవుదినంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఏప్రిల్ 2 నుంచి రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు అధికారికంగా వేసవి సెలవులుగా కొనసాగనున్నాయి. అయితే ఇంటర్‌బోర్డు మాత్రం దీనిపై స్పష్ట త ఇవ్వలేదు. ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యను ఇదే విషయమై ఫోన్ మెసేజ్ ద్వారా సంప్రదించగా.. సెక్రటరీ నుంచి సమాధానం రాలేదు. వేస వి సెలవుల అనంతరం జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం కానున్నాయి.

## అతివేగంతో చెట్టును ఢీకొన్న బైకు.. ఇద్దరు దుర్మరణం

**చిల్పూర్, మార్చి 30 ప్రభాతవార్త :** ఉగాది పండుగవేళ వారి కుటుంబంలో విషాదాన్ని నింపింది. బైకు చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన ఆదివారంరాత్రి నెలకొంది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిల్పూరు మండలం చిన్నపెండ్యాల గ్రామ ప్రభుత్వ పాఠశాల ముందు తరిగొప్పులకు వెళ్లే రోడ్డులోని టర్నింగ్ వద్ద అతివేగంతో బైక్ చెట్టును ఢీకొంది. ఈసంఘటనలో ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన ఎర్ర దిలీప్(25), స్టేషన్‌ఘన్‌పూర్ మండలకేంద్రానికి చెందిన చింత క్రాంతికుమార్(24) తీవ్రంగా గాయపడ్డారు. ఘటన సమా చారం తెలుసుకున్న ఎస్ఐ నవీన్‌కుమార్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంలో గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను ఆస్పత్రికి చికిత్సకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఇద్దరు మృతిచెందినట్లు తెలిపారు.

# 25 ఏజెన్సీలు.. 700 మంది సిబ్బంది



### ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో నిరంతరంగా సహాయక చర్యలు

### ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 30, ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిరంతరంగా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రైవేటు సంస్థలన్నీ కలిపి 25 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటునట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం 700 మంది సిబ్బంది ఈ ఆపరేషన్ లో నిమగ్నమైనట్లు చెప్పారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తూ.. ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నారు.

**పండుగవేళ కొనసాగిన సహాయక చర్యలు..**

ఆదివారం ఎస్‌ఎల్‌బిసి, టన్నెల్ ఆఫీసులో సహాయక బృందాల ఉన్నత అధికారులతో ఎస్ ఎల్ బి సి, టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయక బృందాలకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ రోజు సహితం కుటుంబాలకు దూరంగా ఉంటూ సహాయక చర్యలలో పాల్గొంటున్న సహాయక సిబ్బందినీ ప్రత్యేకంగా అభినందించారు. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి ప్రభుత్వము, జిల్లా యం త్రాంగం ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా వివిధ రకాల నిష్ణాతులైన సిబ్బందిని, సాంకేతికతను ఉపయోగించు కుంటున్నట్లు, మొదటి రోజు నుంచే టన్నెల్ లోపల రెస్క్యూ ఆపరేషన్ చేయగల ఆర్మీ సిబ్బంది, ఎన్.డి ఆర్ ఎఫ్, ఎస్ డి.ఆర్.ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జి.ఎస్.ఐ., ఎన్ జి.ఆర్.ఐ., ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన క్యాడవర్ డాగ్స్, రోబోటిక్ సహా అన్ని రకాల నిష్ణాతులను, సాంకేతికతను ఉపయోగించుకుంటూ టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని, ప్రతి రోజూ నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయక చర్యలపై సమీక్షలు నిర్వహిస్తూ,పలు సూచనలు,సలహాలు అందజేస్తూ సహాయక పనులను వేగవంతం చేస్తున్నామని వివరించారు. నిర్విరామంగా డీ వాటరింగ్ ప్రక్రియలను చేపడుతూ, సహాయక పనులకు ఆటంకంగా వున్న సిల్ట్‌ను తొలగిస్తూ లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ బయటికి తరలిస్తున్నారు.

## కామారెడ్డిలో తీవ్ర విషాదం.. ఒకే కుటుంబంలో నలుగురు మృతి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం వెలుగు చూసింది. ఉగాది పండగకు ఒక్క రోజు ముందు ఒకే కుటుంబంలో నలుగురు ప్రా ణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మౌనిక తన ముగ్గురు పిల్లలు మైథిలి (10), అక్షర (9), వినయ్ (7)లతో కలిసి శనివారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లింది. పొలం పనులు పూర్తయ్యాక సాయంత్రం ఐదు గంటల సమయంలో చెరువు గట్టు వద్ద మౌనిక బట్టలు ఉతుకుతు ండగా ముగ్గురు పిల్లలు స్నానం చేసేందుకు చెరువులో దిగారు. అయితే వీరికి ఈత రాకపోవడం, ఆ ప్రాంతంలో గుంత వుండడంతో ముగ్గురు ఒకరి తరువాత ఒకరు నీటిలో మునిగి పోయారు. ఈ సమయంలో పిల్లలు కేకలు వేయడంతో గమనించిన మౌనిక పిల్లలను కాపాడేందుకు నీటిలో దిగగా ఆమెకు కూడా ఈత రాక పోవడం తో మునిగి పోయింది. అయితే ఆరు గంటలు దాటి న తరువాత కూడా మౌనిక ఆమె పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు గట్టు వద్దకు వచ్చి చూడగా బట్టలు కనిపించాయి. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించి చెరువులో గాలించగా మొదట రాత్రి ఎనిమిది గంటల సమయంలో వినయ్ మృతదేహం తేలింది. ఆ తరువాత గంటకు మిగతా ముగ్గురి మృతదేహాలు కూడా లభ్యమయ్యాయి.

# ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులకు సవాల్‌గా రిమోట్ బాంబులు



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ వద్ద రహదారిపై నక్సల్స్ అమర్చిన రిమోట్ బాంబును పేల్చివేసిన పోలీసులు.

### మహబూబాబాద్‌లో కలకలం రేపుతున్న వరుస పేలుళ్లు

### భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలి: నిఘా వర్గాల హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** నక్సల్స్ ఖిల్లా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై పైచేయి సాధించి దూసుకుపోతున్న భద్రతా బలగాలకు ఇప్పుడు కొత్త సవాల్ ఎదురవుతోంది. ఇప్పటి వరకు వున్న మందు పాతరలకు భిన్నంగా అర కిలోమీటర్ నుంచి కిలోమీటర్ దూరం నుంచి రిమోట్‌లతో పేల్చగల కొత్త తరహా మందు పాతర (ఆర్‌సిఐఈడీ)లను నక్సల్స్ తయారు చేసి వాటిని భారీ సంఖ్యలో రహదారులపై అమర్చినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఆర్‌సిఐఈడి బాంబుల వల్ల ఇ ప్పటి వరకు 15 మంది పోలీసులతో పాటు మరో నలుగురు పౌరులు మరణించగా పది మంది వరకు గాయపడ్డారు. ఛత్తీస్‌ఘడ్‌లో అబూజ్‌మడ్‌ను కూల్చి వేసేందుకు వరుసగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్న భద్రతా బలగాలను నివారించేందుకు నక్సలైట్లు అమర్చిన ఆర్‌సిఐఈడీలను గుర్తించిన నిఘా వర్గాలు దీనిపై అప్రమత్తంగా వుండాలని పోలీసులను ఆదేశించాయి. ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలోని మహబూబాబాద్‌లోని పలుచోట్ల ఆర్‌సిఐఇడి బాంబులు పేలడం కలకలం రేపుతున్నాయి. నక్సల్స్ అమర్చిన ఆర్‌సిఐఈడిలలో కొన్నింటిని భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేయడంతో పాటు వాటిని పేల్చి వేస్తున్నారు.

వచ్చే ఏడాది (2026) మార్చి నాటికి దేశంలో నక్సలైట్ల ఏరివేత పూర్తిగా జరగాలని, మావోయిస్టు రహిత భారత్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే. ఇందులో ఆపరేషన్ కగార్ చేబట్టడం విదితమే. ఇందులో భాగంగా వేల సంఖ్యలో పారా మిలటరీ బలగాలను నక్సల్స్ స్థావరాలున్న చోట మొహరించడం, వ రుసగా కూం బింగ్ జరుగుతోంది. ఈ క్రమంలో వరుసగా జరుగుతున్న ఎదురు కాల్పుల్లో నక్సల్స్ తరపున భారీగా ప్రాణ నష్టం వాటిల్లుతోంది. గడచిన 100 రోజుల్లో 140 మంది నక్సలైట్లు పోలీసు ఎన్‌కౌంటర్లో మరణించారు. అయితే మావోయిస్టులపై పోరులో దూసుకుపోతున్న భద్రతా బలగాలకు ఇప్పుడు నక్సలైట్లు కొత్తగా రూపొందించిన ఆర్ సిఐఈడీలు సవాల్ విసురుతున్నాయి. సాధారణ మందు పాతరలకు భిన్నంగా అర కిలోమీటర్ నుంచి కిలోమీటర్ దూరం నుంచి కూడా రిమోట్‌లతో పేల్చగల ఆర్‌సిఐఈడీలను నక్సల్స్ వందల సంఖ్యలో భద్రతా బలగాలు రాకపోకలు సాగించే రహదారులు, ఇతర మార్గాలలో అమర్చడం పోలీసులను కలవర పరుస్తో ంది. రెండు నెలల క్రితం పది మంది పోలీసులను బలిగొన్నది ఆర్‌సిఐఈడీ కావడం గమనార్హం. దీని తరువాత ఆర్‌సిఐఈడీలపై భద్రతా బలగాలు ఆరా తీస్తున్న క్రమ ంలో వరుసగా పోలీసులతో పాటు సామాన్యులు వీటికి బలవడం లేదా గాయపడడం జరుగుతోంది. తాజాగా శనివారం నాడు బీజాపూర్‌లో ఇదే బాంబు కారణంగా ఇ ద్దరు చిన్నారులు చనిపోగా వారి తల్లి తీవ్రంగా గాయపడింది. ఆర్‌సిఐఈడీల విషయంలో అప్రమత్తంగా వుండాలని, నిఘా వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఛత్తీస్‌ఘ డ్‌లో 50 మందు పాతరలు పేలిన ఘటనలు జరిగాయి. ఇందులో కొన్ని పోలీసులను బలి తీసుకోగా మరికొన్నింటిని పోలీసులు గుర్తించి పేల్చి వేశారు. మరో 28 మ ందు పాతరలను పోలీసులు గుర్తించి వాటిని నిర్వీర్యం చేశారు. గత ఏడాది విషయం ఇలావుంటే ఈ ఏడాది మూడు నెలల్లోనే వంద వరకు మందు పాతరలను పోలీ సులు గుర్తించగా ఇందులో నాలుగు పేలుళ్లు భద్రతా బలగాలను బలితీసుకున్నాయి. మిగతా వాటిలో కొన్నింటిని నిర్వీర్యం చేయగా ప్ర మాదకరంగా వున్న వాటిని పే ల్చివేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఇంతటి స్థాయిలో రిమోట్ మందు పాతరలు వెలుగు చూడడం ఇదే తొలిసారి. గతంలో మందు పాతరలను నక్సలైట్లు పోలీసుల క్యాంపుల కు మూడు నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వరకు పేల్చేవారు. ఇప్పుడిది రెండు నుంచి మూడు కిలోమీటర్ల వరకు చేరిందని పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. పోలీసు బేస్ క్యాంపులు ఎక్కువవుతుండడంతో నక్సలైట్లు ఎదురు దాడికోసం ఆర్‌సిఐఈడీలను భారీగా వాడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించా యి. పది రోజుల క్రితం ఛత్తీస్‌ఘ డ్ లోని బీజాపూర్‌లో గల సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంపు వద్ద ఐదు కిలోల ఆర్‌సిఐఈడీని నక్సల్స్ అమర్చగా దీనిని పోలీసు జాగిలాలు గు ర్తించడంతో పెద్ద ముప్పు తప్పి ంది. కాగా ఆర్‌సిఐఈడీ బాంబులను ఈ ఏడాది జనవరి నెలలో పోలీసులు గుర్తించారు. ఒకచోట మందు పాతర లభించగా దానికి సంబంధించిన యాంటెన్నా అర కి లోమీటర్ దూరంలో చెట్ల వద్ద వుండడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. ఇటువంటివి మరిన్నింటిని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు తెలంగాణ లోని మహబూబాబాద్ జిల్లాలో ఈ తరహా బాంబుల కారణంగా పలువురు పౌరులు మరణించగా మరికొందరు గాయపడ్డారు. ఇదే జిల్లాలోని కర్రెగుట్టలో ఈ తరహా మందు పాతరలు అనేకం వున్నా యని భద్రతా బలగాలు గుర్తించాయి.

## హెచ్‌సియులో అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి

### ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, నియంతలా వ్యవహారిస్తున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు విమర్శించారు. హెచ్‌సియూలో వేలం వేస్తున్న భూములలో జేసీబీలను, బుల్డోజర్లను వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. హెచ్‌సియూ విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తున్నట్టు తెలిపారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములని కార్పొరేట్ సంస్థలకు వేలం వేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత 10 రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు.విద్యార్థులు తమ యూనివర్సిటీ భూములను కాపాడుకోవటం కోసం ఆందోళన చేస్తుంటే వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని తెలిపారు. నేడు(సోమవారం) రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఆందోళనలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. తక్షణమే అరెస్టు చేసిన విద్యార్థులను బేషరతుగా విడిదల చేయాలని.. లేనిపక్షంలో ముఖ్యమత్రి ఇంటిని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల యూనివర్సిటీ భూములను వేలం ద్వారా అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. యూనివర్సిటీ భూములను రక్షించుకోవడానికి వెళుతున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అడ్డుకొని ఇష్టానుసారంగా వారిని అరెస్ట్ చేయడం సరికాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ ప్రశ్నించారు. యూనివర్సిటీ భూముల రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనవద్ద విద్యశాఖ పెట్టుకుని.. ఇలా యూనివర్సిటీ భూములు అమ్మడం సిగ్గు చేటన్నారు.

వార్త

విచారణకు భయపడిపారిపోయే వ్యక్తి తన నేరాన్ని తనకు తానుగా అంగీకరించినట్లే.

-వైరస్

# భూ ప్రళయం

ఈ అఖిల చరాచర జగత్తుకు భూవిలయాలు కొత్తేమీ కాదు. క్రోధి నామ సంవత్సరంలో అలాంటివి ఎన్నో చూసాం. ప్రపంచంలోని ఎన్నో దేశాలు ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. ఎంతో మంది ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. ఇలాంటి విలయాలకు ఏ దేశానికీ చెప్పుకోదగిన మినహాయింపేమీ లేదు. చివరి ఎత్తుగడగా మరో రెండు రోజుల్లో విశ్వవసు నామ సంవత్సరంలో ప్రవేశిస్తామనగా ప్రకృతి తన విశ్వరూపాన్ని చూపించి ప్రపంచవ్యాప్తంగా ఆరేడు దేశాల్లో సంభవించిన భూకంపాలుజనాన్ని అతలాకుతలం చేశాయి. బ్యాంకాక్, మయన్మార్, థాయిలాండ్ దేశాల్లో భూప్రకంపనలు మొదలయ్యాయి. కేవలం 12 నిమిషాల్లో మూడుసార్లు భూమి కంపించింది. రెండుభూకంప కేంద్రాలు కారణంగా భారీఎత్తున విలయం సంభవించింది. భూమి పొరల్లోపల ఫలకాలు స్థానభ్రంశమై ఎన్నో భవనాలు కూలిపోయాయి. భూకంప కేంద్రం భూమ్యుపరితలం నుంచి లెక్కిస్తే భూమి లోపలికి 15 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లునమోదు. ఇలాంటి విలయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపగలిగే శక్తి ఏ మానవ మాత్రుడికీ ఉండదు.దాదాపు వెయ్యి మందికి పైగానే మృతుల సంఖ్యచేరింది. సహాయ కార్యక్రమాల అనంతరం ఈ సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని అంచనా. భూకంప స్థలిలో ఈసన్నివేశాలు చూసేవారు పరుగులు తీశారు. సహాయ చర్యలకు వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వం భవనాల్లోని వారిని నిర్జన ప్రదేశానికి తరలించింది. ఇప్పటికీ ఆయా భవన శిథిలాల కింద ఎన్ని మృతదేహాలు ఉన్నదీ తెలియని పరిస్థితి ఉంది.దాని ఎఫెక్ట్ భారత, లావోస్ చైనా దేశాలమీద కూడా పడింది. ఆ కారణంగా ఆకాశ హర్మ్యాలు ప్రకంపనలకు ఊగిపోయాయి. మయన్మార్‌లో రెండవ అతిపెద్ద నగరం మాండలేలో బహుళ అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అందులో 43 మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. మొత్తం మీద భూవిలయం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఇళ్లల్లో, భవనాల్లో ఉన్నవారంతా భయంతో ఆర్తనాదాలు చేస్తూ బయటకు పరుగులు తీస్తున్నారు. భూకంప ధాటికి భవనాలు ఊగిపోయాయి. చారిత్రక కట్టడాల సైతం కూలిపోయాయి. మాండలేలో ఇర్రవడ్డీ నదిపై ఐకానిక్ బ్రిడ్జిఒక్కసారిగా కూలిపోయింది. థాయిలాండ్‌లో ఆ దేశ ప్రధాని అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. నిజానికి ఈదేశంలో పర్యాటక రంగంగా పేరెన్నికగన్నది. వారానికి 2 లక్షలమంది విదేశీ టూరిస్టులు వస్తుంటారు. ఆ దేశానికివచ్చే ఆదాయం కేవలం టూరిజం మీదనే. అది ఇప్పట్లో కోలుకోవడం కష్టమే మరి. సంవత్సర కాలంగా చూసిన విధ్వంసాల విలయాలతో మయన్మార్‌కు కోలుకోలేని దెబ్బతగిలింది. గత ఏడాది మే 2024 లో మోచా సైక్లోన్ తో 54 మందిమరణించారు. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. 1 లక్షా 8 వేల భవనాలు దెబ్బతిన్నాయి.ఆ వెంటనే జూన్‌నెలలో వరదలు ముంచెత్తి 226 మంది మృతి చెందారు. ఇంత విధ్వంసాన్ని మయన్మార్ గతంలో ఎదుర్కొన్న దాఖలాలులేవు. మయన్మార్‌లో రియాక్టర్ స్కేల్‌పై 7.7,బ్యాంకాక్‌లో 6.8 తీవ్రతతోభూప్రకంపనలు చెలరేగాయి. భారత్‌లో మేఘాలయ,కలకత్తా ,మణిపూర్‌లోను కంపించింది. భూకంపం భయంతో ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీసిన జనం జనం ఇంకా షాక్ గురించి కోలుకోలేదు. ఇంకా భయంగానే ప్రజలు రోడ్లమీదనే ఉన్నారు.పలుప్రాంతాల్లో భవనాలు పేక మేడల్లా కూలిపోవడం చానెల్స్‌లో చూసి బయటి ప్రాంతాల జనం ఆందోళన చెందారు. ఇప్పుడు ఆయా దేశాల పునర్నిర్మాణ ప్రక్రియలో యావత్ ప్రపంచదేశాల సహాయ సహకారాలు అవసరం. భారత దేశం ఇప్పటికే సంఘీభావం ప్రకటించింది. ఆపరేషన్ బ్రహ్మ పేరిట రంగంలోకి దిగింది. ఆగ్నేయాసియా దేశాల్లో భూప్రకంపనల ప్రభావం కనపడింది. భూకంప తీవ్రత ఉండే ప్రాంతాల్లో ఆకాశహర్మ్యాల నిర్మాణానికి సాహసించరు. కానీ బ్యాంకాక్‌లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉంచే ప్రతిపాదనలో భాగంగా చుత్‌చాక్‌లో నిర్మాణంలో ఉన్న 30 అంతస్థుల భవనం పెళపెళ ధ్వనులతో అక్కడికక్కడే నిట్టనిలువుగా కూలిపోయింది. ఇండియన్ టెక్టానిక్ ప్లేటో, బర్మా మైక్రోప్లేటో మధ్య ఉన్న ప్రదేశంలో గతంలోఎన్నో భూకంపాలు సంభవించాయి. గత వందేళ్ల కాలంలో మయన్మార్ ప్రాంతంలోరెక్టర్ స్కేల్‌పై 6 కంటే ఎక్కువస్థాయి నమోదైన 14 భూకంపాలు వచ్చాయని బ్రిటిష్ జియాలాజికల్ సర్వే కేంద్రంశాస్త్రవేత్త బ్రియాగ్ బాప్లె వెల్లడించారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఒక పూర్తి రోజు సమయంలో ఆరు భూకంపాలు నమోదయ్యాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రకటించింది. మయన్మార్,థాయ్‌లాండ్ లకు తక్షణ సాయం అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నడుంకట్టింది. ఎంతో వెలుగు వెలిగిన ఆయా దేశాలు ఇప్పుడు ఎవరు ఆపన్నహస్తం అందించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. గత యేడాది జులై30న కేరళ రాష్ట్రంలోని వయనాడ్ విలయంలో 42మంది మృతిచెందారు. రూ.1200 కోట్లు నష్టం వాటిల్లింది. అక్కడ పునరావాసం పునర్నిర్మాణంలో ఎన్నో ఆపన్నహస్తాలు ఆదుకున్నాయి. అదేమాదిరి ఆగ్నేయాసియా దేశాలు ఇప్పుడు ఎదురుచూస్తున్నాయి. 2004 నాటి సునామీ అనంతరం తుఫానులెదుర్కోవడానికి భూకంప నష్టాలను తట్టుకోవడానికి నిర్మించుకున్న వ్యవస్థలేమీ అక్కరకు రాలేదు. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోగలిగే పరిశోధనలు ముమ్మరం చేయాల్సిన అవశ్యకత ఉంది.

ప్రజల్ని ప్రేమించలేనివాడు ఎన్నటికీ దేశభక్తుడు కాడు, కాలేడు.



ప్రకాశం పంతులు

కోపం తెలివి తక్కువ తనంతో ప్రారంభమై, పశ్చాత్తాపంతో అంతం అవుతుంది.



పైథాగరస్

# చీమల ముందుకే చీమలు పడితే 'న్యాయ' మా?

**ఏ వ్యవస్థపై ఆరోపణలు వచ్చాయో అదే వ్యవస్థకు చెందిన వారితో విచారణ జరిపించడం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు హోదాపరంగా ప్రధాన న్యాయమూర్తి కంటే ఎంతో తక్కువ స్థాయి కలిగిన కేబినెట్ సెక్రటరీతో విచారణ జరిపించడం అంటే ఆ విచారణ ఏవిధంగా వుంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో సుప్రీం కోర్టు సుప్రీమ్ అని ప్రజలందరూ మనస్ఫూర్తిగా భావించి, గౌరవించాలంటే న్యాయవ్యవస్థలో సంపూర్ణంగా సంస్కరణలు అమలు చేయాల్సి వుంటుంది. చేపట్టవలసిన సంస్కరణలపై అన్ని వేదికలపై విస్తృతంగా, లోతుగా చర్చలు జరగాలి. "ధర్మోరక్షి తి రక్షి త:' అన్నట్టు న్యాయవ్యవస్థను కాపాడితే ఆ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని గుర్తుంచుకోవాలి.**



అన్నవరపు బ్రహ్మయ్య

'న్యాయమూర్తులందరూ సచ్ఛీలురని సర్టిఫికెట్ ఇవ్వలేం. అవినీతి పరులు అన్నిరంగాలలో వున్నారు కాకపోతే ఏ రంగంలో యేయే మేరకు అవినీతి వున్నది అనేదే ప్రశ్న' అని జస్టిస్ బి.ఎన్. అగర్వాల్,జస్టిస్ వి.ఎస్. సర్పూర్కర్లతో కూడినసుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇవి. 'న్యాయమూర్తులు అతీతులు గారు.వీరు కూడా అవినీతి మయమైన నేటి సమాజం నుంచి వచ్చిన వారే ఎక్కడో స్వర్గం నుంచి వచ్చినవారు కాదు' అనిసుప్రీం కోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ అగర్వాల్ మరో సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం దేశవ్యాప్తంగా మారోమోగిపోతోంది. గత అనుభవాలను పరిగణలోకి తీసుకుంటే న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు రావడం ఇదే ప్రథమం కాదు.ఇదే చివరిదని కూడా చెప్పలేం.జస్టిస్ వర్మ తొలుత అసలు డబ్బు ఏదీదొరకలేదని ఆ తర్వాత డబ్బుగది తనకు సంబంధించినది కాదని చెబుతున్న అంశాలను బట్టి ఆయన ఎంత నిజాయితీపరుడో అర్థం అవుతోంది. విచారణ కొనసాగుతున్నందున వాస్తవాలు బహిర్గతం కాకతప్పదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు కీలకమైనవి. ఈ మూడు వ్యవస్థలు దేనికదే స్వతంత్రంగా వ్యవహరించినా అనువర్తనంలో మాత్రం 'సుప్రీం కోర్టే సుప్రీమ్' అని అంటారు. ఎందుకంటే చట్టసభలో చట్టాలు చేసినా ఆ చట్టాలు రాజ్యాంగానికి లోబడి ప్రజాహితంగా వున్నాయా? లేదా అని సమీక్షించే అధికారం న్యాయవ్యవస్థకు వుంది. అదే విధంగా చట్టాలను అమలు చేయడంలో కార్యనిర్వాహక వ్యవస్థ చట్టబద్ధంగా వ్యవహరిస్తుందా? లేదా? అని కూడా సమీక్షిస్తుంది. 'చీమల మందుకే చీమలు పట్టినట్టుగా' న్యాయాన్ని పరిరక్షించాల్సిన న్యాయమూర్తులే అవినీతిపరులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మనదేశ న్యాయ వ్యవస్థలో కింది స్థాయిలో వుండే మెజిస్ట్రేట్ కోర్టు మొదలుకొని సుప్రీం కోర్టువరకు అనేక రకాల న్యాయస్థానాలు వున్నాయి.వీటిలో సుప్రీం కోర్టు అత్యున్నతమైనది. అటువంటి ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులుగా పనిచేసినవారిపై కూడా అవినీతి ఆరోపణలు వచ్చాయి. శ్రీమతి ఇందిరా గాంధీ 1984 ఢిల్లీ అల్లర్లలో పాల్గొన్నట్టు ఆరోపణలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ నేతలకు క్లీన్‌చిట్ ఇచ్చిన జస్టిస్ రంగనాథ్‌మిశ్రా, కొబ్బరినూనె దిగుమతి చేసుకోవడంలో నిబంధనలు పాటించని ఒక కంపెనీకి ఎక్సైజ్‌శాఖ విధించిన అయిదు కోట్ల రూపాయల జరిమానాను తగ్గించిన కేసులో జస్టిస్ కమల్ నారాయణ్ సింగ్, 1997లో భోపాల్ గ్యాస్ బాధితులకు సంబంధించిన నష్టపరిహారం విషయంలో జస్టిస్ ఎ.ఎం. అహ్మది, 1998లో కోర్టువెలుపల జరిగిన ఒప్పందాన్ని పరిగణలోకి తీసుకొని కేసును నీరుగార్చిన విషయంలో జస్టిస్ ఎం.ఎం. పుంఛి, జమ్ముకాశ్మీరులో ఒక హోటల్‌కు సంబంధించిన కేసు విషయంలో జస్టిస్ ఎ.ఎస్. ఆనంద్, సీలింగ్ భూముల కేసుల విషయంలో జస్టిస్ వై.కె. సబర్వాలు తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలకు గురైన కర్ణాటక హైకోర్టుకు చెందిన ప్రధాన న్యాయమూర్తిని తొలగించడానికి రాజ్యసభలో ఇంపిచ్మెంట్ తీర్మానం ప్రవేశపెట్టడంతో ఆ న్యాయమూర్తి రాజీనామా చేసి తొలగింపు నుంచి తప్పించుకొన్నారు. ఇటువంటి ఉదాహరణలు చాలానే వున్నాయి. హైకోర్టు లేదా సుప్రీం కోర్టులలో కేసు దాఖలు చేయడం నుంచే అవినీతి ప్రారంభమవుతుందనే ఆరోపణలున్నాయి. హైకోర్టు, సుప్రీం కోర్టులలో కేసులు దాఖలు చేయడానికి



ముందుగా కోర్టు అనుమతి తీసుకోవాలి.కోర్టు అనుమతించిన దావాలకు మాత్రమే కేసు నెంబరును కేటాయిస్తారు. కింది కోర్టులో ఓడిపోయినప్పుడు హైకోర్టు లేదా సుప్రీం కోర్టులో అప్పీల్‌కు వెళ్లడం సహజం. అయితే చాలా సందర్భాలలో న్యాయవాదులను కలిసినప్పుడు అప్పీలును వెంటనే దాఖలు చేయడానికి బదులుగా ఫలానా రోజు ఫలానా జడ్జి బెంచ్‌పైకివస్తారు. ఆ జడ్జి అయితే కొంత ఖర్చు అయినా మనకు తేలికగా కేసును స్వీకరించి నెంబరు ఇస్తారని చెబుతారు.అంటే అప్పీలును ఆమోదించడానికి కేసు పూర్వాపరాల సంగతి ఎలావున్నప్పటికీ, డబ్బు ఖర్చుచేస్తే కేసును అనుమతించి, నెంబరు కేటాయిస్తారు. ఆ తర్వాత కేసుల స్వభావాన్ని బట్టి మధ్యంతర ఉత్తర్వులకి, బెయిల్ మంజూరు, చివరిలో తీర్పు అనుకూలంగా రావడానికి ప్రత్యేకంగా ఖర్చుచేయాల్సి వుంటుంది. 'ప్రస్తుతం ప్రజలు కొంత మంది న్యాయమూర్తులు నిజాయితీపరులని, మరికొంత మంది అవినీతి పరులని కేటగిరీ చేయగలుగుతున్నారు' అని జస్టిస్ అరిజిత్ పసయత్,జస్టిస్ వి.ఎస్. సిరిపుర్కర్, జస్టిస్ జి.ఎస్. సింఘ్వీలతో కూడిన సుప్రీమ్ కోర్టు ధర్మాసనంఒక సందర్భంలో వ్యాఖ్యానించింది. కొన్ని కేసులలో తీర్పులు, బెయిల్ మంజూరు కావడం వంటి అంశాలను గమనించినప్పుడు సీనియర్ న్యాయవాదులు న్యాయమూర్తులతో ఒప్పందం కుదుర్చుకొని అవసరమైనస్థాయిలో కౌంటర్ దాఖలుచేయడం లేదని కూడా బెంచ్ వ్యాఖ్యానించింది. గాలి జనార్దన రెడ్డి బెయిల్ మంజూరులో కూడా ఇంచుమించు ఇదే జరిగినట్టు కనిపిస్తోంది. గాలి జనార్ధన రెడ్డి కేసులో బెయిల్ మంజూరు చేయడానికి 10కోట్ల రూపాయల మేరకు ఒప్పందం జరగడం, దానిపై దేశవ్యాప్తంగా చర్చజరగడం పాఠకులకు గుర్తుండే వుంటుంది. కొన్నికేసుల విషయంలో ముద్దాయి తరపు, ప్రభుత్వం తరపు న్యాయవాదుల మధ్య జరిగే తెరవెనుక లాలూచి పడటంవల్ల కూడా తీర్పులు మారిపోతుంటాయి. ముద్దాయి బెయిల్‌కోసం పిటిషన్ దాఖలు చేసినప్పుడు ప్రభుత్వం తరపు న్యాయవాది కౌంటరు దాఖలు చేయడంలో చూసిచూడకుండా వుండాలి. ఒకవేళ కౌంటరు దాఖలు చేసినా బెయిల్ నిరాకరించడానికి అవసరమైన అంశాలు అందులో ప్రస్తావించకుండా వుండాలి. దాంతో ముద్దాయికి సులభంగా బెయిల్ మంజూరు అవుతుంది. ముద్దాయి తరపు న్యాయవాది, ప్రభుత్వ తరపు న్యాయవాది మధ్య అవగాహనతో ఇది సాధ్యమవుతుంది. ఇదే తరహాలో ముద్దాయి తరపు న్యాయవాది, ప్రభుత్వం తరపు న్యాయవాది మిలాఖత్ కావడం ద్వారా అసలు కేసునే నీరుగార్చవచ్చు. ముద్దాయి తరపు, ప్రభుత్వ తరపు న్యాయవాదుల మధ్య జరిగే తెరవెనుక ఒప్పందాల్లో కేసు ప్రాధాన్యతను బట్టి లక్షలు,కోట్లరూపాయలు కూడా చేతులు మారతాయి.ప్రజాస్వామ్యంలోని ఇతర వ్యవస్థలతో పోల్చుకొన్నప్పుడు న్యాయవ్యవస్థ 'కోర్టు ధిక్కారం' అనే ఇనుప పరదాల మాటున ఉంటోంది.ఈ పరదకారణంగా ఇతర వ్యవస్థలలోని లోటుపాట్లు సమీక్షించినంత సులభంగా న్యాయవ్యవస్థపై సమీక్ష చేసే అవకాశం లేకుండా వుంది. ఇప్పటి వరకు న్యాయవ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు మొక్కుబడిగానే వుంటున్నాయి. ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన 'జ్యుడిషియల్ ఎంక్వయిరీ (అమెండ్మెంట్) బిల్ 2008' ద్వారా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో 'నేషనల్ జ్యుడిషియల్ కౌన్సిల్ ఏర్పాటుచేశారు. ఈ కౌన్సిల్ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై వచ్చే అవినీతి ఆరోపణలపై విచారణ చేస్తుంది. ఒక న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు అదే న్యాయవ్యవస్థకు చెందిన జడ్జీలతో కూడిన ప్యానల్ కమిటీ విచారిస్తుంది.ఇక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రిటైర్డ్ ప్రధాన న్యామూర్తిపైనే ఆరోపణలు వచ్చే పక్షంలో రాష్ట్రపతి ఉత్తర్వులు మేరకు క్యాబినెట్ సెక్రటరీ లేదా పార్లమెంటు విచారణ చేస్తుంది. ఏ వ్యవస్థపై ఆరోపణలు వచ్చాయో అదే వ్యవస్థకు చెందినవారితో విచారణ జరిపించడం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు హోదాపరంగా ప్రధాన న్యాయమూర్తి కంటే ఎంతో తక్కువస్థాయి కలిగిన కేబినెట్ సెక్రటరీతో విచారణ జరిపించడం అంటే ఆ విచారణ ఏవిధంగా వుంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో సుప్రీం కోర్టు సుప్రీమ్ అని ప్రజలందరూ మనస్ఫూర్తిగా భావించి, గౌరవించాలంటే న్యాయవ్యవస్థలో సంపూర్ణంగా సంస్కరణలుఅమలు చేయాల్సివుంటుంది. చేపట్టవలసిన సంస్కరణలపై అన్ని వేదికలపై విస్తృతంగా, లోతుగా చర్చలు జరగాలి. "ధర్మోరక్షి తి రక్షి త:' అన్నట్టు న్యాయవ్యవస్థను కాపాడితే ఆ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని గుర్తుంచుకోవాలి. ●

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ సంకల్పం



శిరందాసు నాగార్జున రావు

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మదిలో మెదిలిన మరో కొత్తఆలోచన జీరో పావర్టీ పీ4విధానం. ఇది మరో విప్లవాత్మక ఆలోచన. ఈ నెల 30వ తేదీ 'విశ్వావసు' తెలుగు సంవత్సరాది నాడు ప్రారంభించే ఈ విధానాన్ని సీఎం గేమ్‌ఛేంజర్‌గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర 2047లో భాగంగా, వచ్చే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేస్తోంది. సామాజిక ఆర్థికాభివృద్ధిలో సరికొత్త మార్పులకు ఈ పీ4(ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజల భాగస్వామ్యం) నాంది పలుకుతుంది. ఇది సమ్మిళిత వృద్ధి ద్వారా సమాజంలోని బలహీన వర్గాలను పైకి లేపడానికి నిరంతరంగా పనిచేసే ఓ ప్రక్రియ. సమాజంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇది పనిచేస్తుంది. ఈ విధాన ప్రధాన లక్ష్యం సమాజంలో ఉన్నతస్థితిలో ఉన్న 10శాతం మంది, అట్టడుగున ఉన్న 20శాతం మంది పేదలను దత్తత తీసుకుని, వారికి అండగా నిలిచి, వారిని పేదరికం నుండి పైకి తీసుకురావడం. వెనుకబడిన కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు 'ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యంతో దీనిని రూపొందించారు. స్వర్ణ ఆంధ్రప్రదేశ్ 2047 'పది సూత్రాల'లో ఒకటైన 'సున్నా పేదరికం' లక్ష్యాన్ని సాధించేందుకు, సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్‌ఎన్ఐలు), ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు భాగస్వాములు



కావడానికి ఈ విధానం దోహదపడుతుంది. ఈ పథకంలో లబ్ధిదారులను 'బంగారు కుటుంబాలు' అని, సహాయం చేసే ఆర్థికంగా బలమైన వారిని 'మార్గదర్శి' అనిపిలుస్తారు. ఈ పేర్లను ప్రజల సూచనల మేరకే ఖరారు చేశారు. ఆర్థికంగా అండగా నిలిచే 'మార్గదర్శి'లు తమకు తోచినవిధంగా నిధులతోపాటు, సమయం ఉన్నవారు ఆర్థిక విషయాల్లో సలహాలు, కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలు, విద్యా ఖర్చులకు సహాయం లేదా వ్యాపారాలకు పెట్టుబడి వంటి సహాయం కూడా అందిస్తారు. ఈ విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సాధికారత సాధిస్తుందని కూటమి ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈవిధానం అమలులో ప్రభుత్వం ఏ రకమైన ఆర్థిక సాయం చేయదు. బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు మధ్య సమన్వయకర్తగా పనిచేస్తుంది. ప్రభుత్వంలోని వివిధ శాఖలు సర్వేల ద్వారా పేద కుటుంబాలను గుర్తిస్తాయి. అర్హులైన కుటుంబాలు ఈ పథకంలో భాగమవుతాయి. ఈ విధానం సమర్థవంతంగా అమలు చేసేందుకు, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రియల్ టైమ్ డేటాని సేకరిస్తారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసే డిజిటల్ వేదికనుంచి మార్గదర్శులు తాముసహాయం అందించేకుటుంబాలను ఎంచుకుంటారు. పీ4లో భాగంగా పేద కుటుంబాలకు విద్య,వైద్యం, ఇళ్లస్థలాలు, ఇళ్లనిర్మాణం,మరుగుదొడ్లు, తాగునీటి కనెక్షన్లు,గ్యాస్ కనెక్షన్లు, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు సౌరవిద్యుత్ ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, హైస్పీడ్ ఇంటర్నెట్‌వంటి సౌకర్యాలను కల్పిస్తారు.ఈ విధానం ద్వారా మొదటి దశలో 20లక్షల కుటుంబాలకు లబ్ధి చేరుకూరుతుందన్న అభిప్రాయంతో ప్రభుత్వంఉంది. 2029 నాటికి పేదరికం నిర్మూలించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ●

# గిట్టుబాటు ధరలేక రైతుల అవస్థలు

డా. యం. సురేష్ బాబు

ఒక పక్క మార్కెట్‌లో బంగారం ధర దగదగ లాడుతోంది. మరోవైపు టమోటా, మిర్చీ, ఉల్లి, మునగ, పత్తి, ఇతర పంటల ధరలు నేలచూపు చూస్తున్నాయి. ముఖ్యంగా పండ్ల మార్కెట్‌లో సపోటా, చీనీ,జామ మార్కెటు లేదు. టమాట రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఆరుగాలం కష్టపడి పండించిన టమాటకు ధర రాక దిగాలు పడే పరిస్థితి నెలకొంది. ఆంధ్రాలో పలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈసారి టమాట పంట ఎక్కువ దిగుబడి ఉంది. అయితే ప్రస్తుతం టమాట రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది.మార్కెట్టుకు తీసుకువచ్చిన టమాటా ధర కిలో రెండు రూపాయలు పడిపోవడంతో అక్కడక్కడ రైతులు రోడ్డుపై పారబోసి, పశువులకు మేతగా వేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రవాణా ఖర్చు విపరీతంగా పెరగడంతో సుదూర ప్రాంతాలల్లో మార్కెట్‌కు సరుకు తరలించలేకపోతున్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ధరల స్థిరీకరణ అనేది లేదు. అనంతపురం చీనీ మార్కెట్ యార్డ్‌లో కమిషన్ వ్యవస్థను రద్దు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. అమ్మకాలను వేలం ద్వారా నిర్వహించాలని పలుమార్లు రైతుసంఘాల విజ్ఞప్తిని పట్టించుకోవడంలేదు.ప్రస్తుత కమిషన్ పదిశాతం నుంచి నాలుగుశాతానికి తగ్గించినప్పుడే రైతు బాగుపడతాడు.మార్కెట్లలో ఈనం వ్యవస్థ (కమీషన్లు) కారణంగా నారింజ రైతులు నష్టపోతున్నా ప్రభుత్వంచోద్యం చూస్తుంది. ఈ వ్యవస్థను రద్దుచేసి, పులివెందుల మార్కెట్ యార్డ్‌లో అనుసరిస్తున్న నమూనా ప్రకారం వేలం ద్వారా అమ్మకాలు నిర్వహించాలి. ప్రస్తుతం చీనీ మార్కెట్లో డబుల్ సూట్ అని ఇరవై శాతం, తరుగు అని కొంత, అన్లోడింగ్ అని కొంత, మార్కెట్లో సెక్యూరిటీకి కొంత, వేబ్రిడ్జి కొంత, వట్టికాయలకు కొంత తీసివేస్తే చివరికి రైతుకు మిగిలేది కొంతే. ఇంకా దుర్మార్గంగా రైతు అవసరాన్ని బట్టి తోటల దగ్గరే ముప్పైశాతం తగ్గించి స్పాట్‌లో డబ్బు ఇచ్చికొంటున్నారు. మార్కెట్లకు తరలించిన రైతులు నిర్ణీత సమయానికి రాలేక, వేలంపాటలు పాడలేకపోతున్నారు. మార్కెట్ యార్డులు దుర్భరంగా ఉండటం, కనీస సౌకర్యాలు లేక తిండి తిప్పలు దేవుడెరుగు. రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లేక ధర పడిపోయిందని రైతులు గగ్గోలు పెడుతుంటే, మార్కెట్లో మాత్రం కొనేపరిస్థితి లేదు. ఎన్నో కష్టాలు పడి టమాట సాగు చేస్తే మార్కెట్లో వ్యాపారులు మాయాజాలం ప్రదర్శించడం సరికాదని వాపోతున్నారు. రైతు నిర్ణయించాల్సిన ధరను వ్యాపారులు నిర్ణయం తీసుకోవడం ఏమిటి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం అని బూటకపు మాటలు మాట్లాడుతున్న ప్రభుత్వాలు రైతుల సంక్షేమం గురించి పట్టించుకోకుండా సంబరాలు జరుపుకుంటున్నారు.ఈ సంవ



త్సరం టమోటాతో పాటు మామిడిపండ్లకు కూడా డిమాండ్ తగ్గిపోయింది. పండ్లతోటల్లో మామిడి పంట చాలా ప్రముఖమైనది. ప్రపంచం మొత్తంలో సగం వరకు మామిడి ఉత్పత్తి మన భారతదేశంలో జరుగుతోంది. మామిడి పంటను చాలా మంది రైతులు ముఖ్యమైన ఉద్యాన వాణిజ్య వంటగా సాగుచేస్తున్నారు. మామిడిని మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా కృష్ణా,ఖమ్మం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి,శ్రీకాకుళం,కరీంనగర్, విశాఖపట్నం, చితూరు,కడప, అదిలాబాదు, నల్గొండ జిల్లాల్లో సాగుచేస్తున్నారు.మామిడిని పండించడానికి అన్నిరకాల నేలలు అనుకూలంగా ఉంటాయి.ఈ సంవత్సరం కాపు సంతృప్తికరంగా ఉన్నా మార్కెట్లో ధర లేకపోవడంతో, అకాల వర్షాలతో పంట దెబ్బతీసింది. రైతుకు పెట్టుబడి రాక చెట్లు తీసివేసే ప్రమాదం ఉంది. గత దశాబ్ద కాలంగా కోల్డ్‌స్టోరేజ్ యూనిట్స్, ధాన్యం నిలువ చేసుకోవడానికి వేర్‌హౌస్‌లు లేక రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. అసమర్థ రవాణా వ్యవస్థ కారణంగా పెద్ద మొత్తంలో కూరగాయలు పొలాలలో కుళ్లిపోతున్నాయి. సరఫరా గొలుసు అనేది ఒక ప్రదేశం నుండి మరొకప్రదేశానికి వస్తువులను రవాణా చేయడం, దాని సంక్లిష్టతలు సాధారణ రవాణాకు మించినవి. రైతు ఆత్మహత్యల సమస్యనిజానికి ఒక విషాదకరమైన సంక్లిష్టమైన సమస్య. ఇది సరఫరా గొలుసుసవాళ్లకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ కారణాలచే ప్రభావితమవుతుంది. అస్థిరమైన మార్కెట్‌ధరలు,అధిక ఇన్‌పుట్ ఖర్చులు, రుణం బీమాకు సరిపడా ప్రాప్యత, నీటికొరత, పంట వైఫల్యాలు పరిమిత మార్కెట్ అవకాశాలు వంటి అనేక సవాళ్లను రైతులు ఎదుర్కొంటున్నారు. ఈసవాళ్లు,ఇతరసామాజిక, ఆర్థిక వ్యక్తిగత అంశాలతో కలిపి రైతు ఆత్మహత్యల బాధాకరమైన పరిస్థితికి దోహదపడతాయి.సరఫరా గొలుసు రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుండగా,రైతు ఆత్మహత్యలు విస్తృత వ్యవస్థాగత సమస్యలు వ్యక్తిగత పరిస్థితుల కలయిక నుండి ఉత్పన్నమవుతున్నాయి. వీటిని గుర్తించడం చాలాముఖ్యం. రైతు ఆత్మహత్యల సమస్యను పరిష్కరించడానికి వ్యవసాయ సంస్కరణలు, సామాజిక మద్దతు వ్యవస్థలు, మానసిక ఆరోగ్య అవగాహన,ఆర్థిక సహాయం స్థిరమైన వ్యవసాయ పద్ధతులతో సహా సమగ్రమైన బహుళ డైమెన్షనల్ విధానాలు అవసరం. రైతు శ్రేయస్సుకోరే ప్రభుత్వాలు తక్షణమే కోల్డ్ స్టోరేజి యూనిట్లు,మార్కెట్‌సౌకర్యం, వేర్‌హౌస్ నిర్మాణంచేపట్టాలి. రైతులు ధాన్యం నిలువ చేసుకోవడానికి గోదాములు గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. రవాణా ఛార్జీలు, ఇతర నష్టాలను కలుపుకుని గతేడాది ఈ సీజన్‌లో కిలోపై ఐదురూపాయలు వ్యయం పెరిగింది. ఈ ఏడాది మాత్రం రవాణాకు రూ.వేలు వెచ్చించి చెబుతూ ధంలు ఏకమొత్తంలో పెంచేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగామారింది. ధరల పెరుగుదలవల్ల నిత్యావసర కూరగాయలుఅందుబాటులో లేకుండాపోయాయి. ఆహార సరఫరా అందుతుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ●

# ప్రజావాక్కు



## న్యాయమేనా?

ఈ మధ్య దేశంలోని న్యాయవ్యవస్థ ఎక్కువగా చర్చల్లోకి వస్తోంది. ప్రజాస్వామ్యంలోని మిగతా మూడు స్తంభాల తీరును శాసించగలిగిన మూల స్థంభం న్యాయ పాలిక. ఆ ప్రాముఖ్యతకు తగ్గట్టే,ప్రజల్లో దానిపై గౌరవం, నమ్మకం, అంచనాలు ఉంటాయి. అలా ఉన్నతమైన స్థానం ప్రజల గుండెల్లో ఉన్నంతవరకూ సమాజం ఆరోగ్యంగా ఉండగలదు. కాబట్టి ఆ స్థానం ఏ మాత్రం సడలకుండా చూడడం కూడా ఎంతో అవసరం. ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, ఔన్నత్యాన్ని పదిలపర్చుకోవడం ఇప్పుడు ఆ వ్యవస్థ పైనున్న పెద్దబాధ్యత. ఈ మధ్యవరసగా జరిగిన రెండు సంఘటనలు అలా ఎదురైన పెద్ద సవాళ్లే. వాటికి అత్యున్నత న్యాయ స్థానం సరిగ్గానే స్పందించినప్పటికీ, మరింత మేధోమథనంతో శాశ్వత పరిష్కారాలు చూడాల్సిన అవసరం ఉంది. వెంటనే సుప్రీం కోర్టు స్పందించి వాటిపై అంతర్గత విచారణ కమిటీ వేయడమే కాకుండా, ఆయన్ని విధులకు దూరం చేసి, వేరే చోటికి బదిలీ చేసింది.ఆహ్వానించ దగ్గ విషయమే.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## చర్యలు తీసుకోవాలి

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం కల్తీ ఆహారం కారణంగా భారత్‌లో యేటా సుమారు పది కోట్ల మంది అనారోగ్యంతోబాధపడుతున్నారు.బాధితుల్లో70వేలమంది ప్రాణాలు కోల్పోతున్నారు.నిత్యం ఆస్పత్రులకు వెళ్తున్న వారిలో 20 శాతం కల్తీ ఆహార బాధితులే ఉంటున్నారనే అంచనా వేయడం జరిగింది.ఈ వాస్తవాలు గుర్తించి పాలకులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

## ధరలను తగ్గించాలి

నేడు ప్రతి వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అన్నింటిపై పన్నుల భారం పెంచుతూనే ఉన్నారు. ఇలా అన్నింటిపై ధరలు పెంచుకుంటూపోతే సామాన్యుడు ఎలా బతకాలో ఎవరూ ఆలోచించడంలేదు. పెరుగుతున్న ధరలను అదుపులో ఉంచడానికి ఏ మార్గాలు లేవా? పాలకులు మేధావులు ఆలోచించాలి. సామాన్యుడు జీవించే పరిస్థితులు కల్పించాలి. ధరలను ఎంత తగ్గిస్తే అంత మంచిది. అందరికి అందుబాటులో ఉండాలి.

- సింగు లక్ష్మీనారాయణ, చింతకుంట, కరీంనగర్

## కేంద్రీయ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోప్రతిజిల్లాలో డైట్‌కళాశాల,కేంద్రీయ, నవోదయవిద్యాసంస్థలు ఉండేలాప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పాత జిల్లా కేంద్రాల్లోని ఉపాధ్యాయ శిక్షణాసంస్థలు డైట్ కాలేజీలు ఉన్నాయి. ప్రతి కొత్త జిల్లా కేంద్రాల్లో డైట్ కాలేజీలు ఉండేలా రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయాలి. అలాగే కేంద్రీయ విద్యాలయాలు,నవోదయ స్కూల్స్ ఉంటే వెనకబడినప్రాంతాల విద్యార్థులకు ఎంతోప్రయోజనం ఉంటుంది. విద్యార్థులకు శిక్షణతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కూడా వస్తాయి. అలాగే ఉపాధ్యాయులకు వివిధ అంశాల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు డైట్ ,నవోదయ,కేంద్రీయ విద్యాలయాలు ఎంతగానో తోడ్పాటునిస్తాయి.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## పెరుగుతున్న చీటింగ్ కేసులు

గ్రామాలలో కొందరు కొంతమంది వ్యక్తుల నుండి డబ్బులు అప్పుగా తీసుకొని బాండ్ పేపర్ పై కాగితం రాసి ఇచ్చి వడ్డీకి తీసుకున్న డబ్బులు తిరిగిఅడగడంతో ఇంటిదగ్గర ఉండకుండా కొన్ని నెలలకొద్ది కనబడకుండా వెళ్తున్నారు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు.డబ్బులు ఇవ్వడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా కూడా పోలీసులకు ఫోన్ ఎత్తడం లేదు రావడం లేదు. ఒక్కొక్కరిపై 10 ఫిర్యాదులున్నాయి. లక్షల కొద్ది రూపాయలను అప్పుగా తీసుకొని దొంగచాటుగా తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకొని అప్పు ఇచ్చిన వారికి తిరిగి ఇప్పించాలి. ఈ విధంగా చీటింగ్ చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న వారు తిరిగి డబ్బులు ఇచ్చే విధంగా కృషి చేయాలి. ఇలాంటి మోసగాళ్లను కఠినంగా శిక్షించాలి.

-రాపాక రవీందర్, జనగాం

## రోడ్లను బాగు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. సంక్షేమ కార్యక్రమాల పేరుతో అప్పులు చేసి తెచ్చినడప్పు కూడుగా డబ్బులు నేరుగా ప్రజల అకౌంట్లోకి వెళ్లిపోవడంవల్ల కెసిఆర్ స్వార్థంకారణంగా కాంగ్రెస్ వారి తెలివి తక్కువఆలోచన కారణంగా విభజించబడినఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిన్న రాష్ట్రంగా మారింది. 13 జిల్లాలు 26 జిల్లాలుగా మారి ఉద్యోగులసంఖ్యను పెంచేసింది. రాజకీయ నాయకుల సంఖ్యను కూడా పెంచేసింది. వారి టిఎ, డిఎలు, జీతాలు అన్ని పెరిగాయి. వారి పోషణ ప్రజలకు చాలాకష్టంగా మారింది.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# వేసవి సెలవులు వృధా చేయొద్దు

## నీటి సంరక్షణను మరింత అలవాటుగా మార్చుకోవాలి

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 30:** వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని, పరీక్షల సమయంలో వాటిగురించి చర్చించానని, త్వరలో వేసవి సెలవులు కూడా వస్తున్నాయని పిల్లలు వాటికోసం వేచి ఉన్నారని, కొత్త అభిరుచులు మెరుగుపరుచుకునేందుకు తగిన సమయం ఇదేనని వేసవి సెలవులకోసం రూపొందించిన మైక్యాలెండర్ చిన్నారులకు ఎంతగానో ఉపకరిస్తుందని ప్రధానిమోడీ అన్నారు. ఆదివారం 120వ ఎపిసోడ్ మన్‌కీబాత్‌లో ప్రధానిమోడీ పలు అంశాలను స్పృశించారు. అంబేద్కర్‌జయంతిరోజు జరిగే పాదయాత్రలో పాల్గొనడం ద్వారా మీరంతా రాజ్యాంగ విలువల గురించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయగలుగుతారని అన్నారు. నీటిని పొదుపు ప్రచారం వేసవిలోనే ముమ్మరంగాజరుగుతుందని, మనకు లభించే సహజవనరులను భావితరానికి అందించడం మనబాధ్యత అన్నారు. ఎడెనిమిదేళ్లలో కొత్తగా నిర్మించిన ట్యాంకులు, చెరువులు ఇతర నీటి నిల్వల నిర్మాణాల ద్వారా నీటిని సంరక్షించారని ఈవిషయంలో అందరూ ఇప్పటి నుంచే ఒక ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. మీ ఇంటిముందు ఒక కుండలో చల్లటినీటిని అందరికీ అందుబాటులోఉంచండి అని మోడీ పిలుపునిచ్చారు. ఖేలో ఇండియ ఆపారాగేమ్స్‌లో ఆటగాళ్లు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారని, ఈసారి ఎక్కువమంది పాల్గొన్నారన్న మోడీ వారందరినీ అభినందించారు. దివ్యాంగ క్రీడాకారులు 18 జాతీయ రికార్డులను కూడా సృష్టించారన్నారు. ఢిల్లీలోజరిగిన ఫిట్ ఇండియా కార్నివాల్‌లో సుమారు 25 వేల మందికిపైగా పాల్గొన్నారని, ఫిట్‌నెస్‌పై అందరికీ అవగాహన కల్పించడం అని అన్నారు. దుస్తుల వ్యర్థాలు సవాల్‌గా మారుతున్నాయని పాతదుస్తులను పారవేసినపుడు వాటిలో ఒకశాతం మాత్రమే రీసైకిల్ అవుతుందన్నారు. ప్రపంచంలో అత్యధిక వస్త్ర వ్యర్థాలు ఉత్పత్తి అయ్యే మూడోదేశం భారత్ అని ఈసవాలు ఎదుర్కొనేందుకు పలు కసరత్తులు జరుగుతున్నాయన్నారు. వివిధ స్టార్టప్‌లు పాతబట్టలు, బూట్లు చెప్పులను రీసైక్లింగ్‌చేసి వినియోగంలోకి తెస్తున్నాయని ప్రధాని ప్రశంసించారు. యోగా దినోత్సవానికి ఇక కొద్దిరోజులుమాత్రమే ఉందని,యోగాను జీవితంలో భాగంగాచేసుకోవాలని ప్రపంచ మానవాళికి భారత్ ఇచ్చిన బహుమతి యోగా అన్నారు. ఇది భవిష్యత్ తరానికి ఉపయోగపడుతుందని, యోగా సాయంతో ప్రపంచాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిద్దామన్నారు. నేడు పెద్దసంఖ్యలో యువ యోగాను అభ్యసిస్తున్నారన్నారు. ఆయుర్వేదం కూడా ఎక్కువమంది వాడుతుండటం పట్ల మోడీ హర్షం ప్రకటించారు.



# పుతిన్ లగ్జరీకారులో భారీ పేలుడు

## హత్యాయత్నంగా అనుమానాలు

**మాస్కో, మార్చి 30:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన అధికారిక కార్లలో అత్యంత లగ్జరీ కారు అయిన లిమోజిన్‌లో భారీ పేలుడు సంభవించింది. మాస్కో నడిబొడ్డునన జరిగిన ఈ ఘటన రష్యా అధ్యక్షుడి భద్రతపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. పుతిన్‌పై హత్యాయత్నం జరిగిందన్న అనుమానాలు పెరిగాయి. ఈ ఘటనతో ప్రపంచ నేతలంతా ఉలిక్కిపడ్డారు. పుతిన్‌కు చెందిన అత్యంత ఖరీదైన కారు లిమోజిన్, లుబియాంకాలోని ఎఫ్ఎస్‌బీ ప్రధాన కార్యాలయం సమీపంలో కాలిపోతూ కనిపించింది. కారు ఇంజిన్‌నుంచి మంటలుప్రారంభం అయి వాహనంలోకి వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అక్కడికి సమీపంలోని రెస్టారెంట్‌లోని సిబ్బంది కారుకు అంటుకున్న మంటలను ఆర్పేందుకు ముందుకువచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన విడియోఫుటేజిలో వాహనంనుంచి దట్టమైన నల్లటి పొగరావడం కారు వెనుకభాగం దెబ్బతినడాన్ని చూడవచ్చు. ఈ పేలుడుకు గల కారణం ఇంకా తెలియరాలేదని ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని రష్యన్‌మీడియా పేర్కొంది. ఈ కారునను ప్రెసిడెన్షియల్‌ఎస్టేట్ డిపార్టుమెంట్ పర్యవేక్షిస్తుంటుందని తెలిపింది. పేలుడుపై దర్యాప్తుచేస్తున్నట్లు ప్రకటన విడుదలచేసారు. ఇదిలా ఉంటే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ ఆరోగ్యం క్షీణిస్తోందని ఆయన త్వరలో చనిపోతారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఇటీవలేప్రకటించారు. ఇపుడు పుతిన్ కారు తగలబడిన ఘటన నేపత్యంలో రష్యా అధ్యక్షుడి మరణాన్ని జెలెన్‌స్కీ ముందే ఊహించారంటూ కథనాలు వెలువడుతున్నాయి.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

## రూ. 33,700 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోడీ

**రాయ్‌పూర్, మార్చి 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఛత్తీస్‌గఢ్‌లో రూ. 33,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. విద్యుత్, చమురు–సహజ వాయువు, రైల్వేలు, రహదారులు వంటి కీలక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు అందులో ఉన్నాయి. బిలాస్‌పూర్‌లో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు దక్కేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో 3 లక్షల మంది పేద ప్రజలకు కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు పడనున్నా యని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. నవరాత్రి తొలిరోజునే బిలాసపూర్‌లో వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. 'నవరాత్రుల తొలిరోజు ఇక్కడ ఉండటం నా అదృ ష్టంగా భావిస్తున్నాను. మాతామాయి సొంత గడ్డ ఇది. కౌసల్యాదేవి పుట్టినిల్లు కూడా ఇదే. శక్తిమాతను ఆరాధించే ఈ తొమ్మిది రోజులు ఛత్తీస్‌గడ్ ప్రజలకు చాలా ప్రత్యేకం. ఈ శుభతరుణంలో ఇక్కడకు రావడం ఆనందంగా ఉంది' అని మోడీ అన్నారు. కొద్ది నిమిషాల క్రితమే రూ. 33,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు మొదలయ్యాయని, వీటిలో పేదలకు ఇళ్లు, స్కూళ్లు, రోడ్లు, రైల్వేలు, విద్యుత్, గ్యాస్‌పైప్‌లైన్‌స వంటి ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఇవన్నీ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉద్దేశించినవని, ఈ గణనీయమైన అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానని అన్నారు.

**ఛత్తీస్‌గఢ్ సిల్వర్ జూబ్లీ ఇయర్:** ఛత్తీస్‌గఢ్ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తవుతున్న 'సిల్వర్ జూబ్లీ ఇయర్' ఇదని మోడీ అన్నారు. ఈ యేడాదే అటల్ బిహారీ వాజ్‌పేయి శతాబ్ది సంవత్సరం కూడా అని గుర్తు చేసుకున్నారు. 2000లో వాజ్‌పేయి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.



# పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

## 11 బోగీల్లోని ప్రయాణీకులకు గాయాలు

**భువనేశ్వర్, మార్చి 30:** కామాఖ్య ఎక్స్‌ప్రెస్‌రైలు పట్టాలు తప్పి తృటిలోపెనుప్రమాదంనుంచి తప్పించుకుంది. 11 బోగీలు పట్టాలు పక్కకు ఒరిగాయి. ఈ ప్రమాదంలో కొందరుప్రయాణీకులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒడిశాలోని కటక్ జిల్లాలో ఈప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 11.54 గంటల సమయంలో కర్ణాటక రాజధాని బెంగళూరునుంచి అస్సాం రాజధాని గౌహతిలోని కామఖ్య స్టేషన్‌కు వెళుతున్న కామాఖ్య ఎక్స్‌ప్రెస్ నిర్గుండి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. 11 కోచ్‌లురైలు పట్టాలు తప్పి ఒరిగిపోయాయి. కాగా ఈ విషయం తెలిసినవెంటనే రైల్వే అధికారులు పోలీసులు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలుచేపట్టారు. ఈ ప్రమాదంలో సుమారు పదిమందిప్రయాణీకులు గాయపడినట్లు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఏడుగురుప్రయాణీకులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు సంఘటనా స్థలానికి సహాయక రైలును పంపించామని ఈస్ట్‌కోస్ట్ సిపిఆర్ఒ అశోక్‌కుమార్ మిశ్రా తెలిపారు. బాధితప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.వీలైనంత త్వరగా రైల్వేలైన్ పునరుద్ధరించడం తమ ప్రాధాన్యత అన్నారు. ధౌలి ఎక్స్‌ప్రెస్, నీలాచల్ ఎక్స్‌ప్రెస్, పురూలియా ఎక్స్‌ప్రెస్‌లను దారిమళ్లించామన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని హెల్ప్ లైన్లను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు సిపిఆర్వో తెలిపారు.



# 12 నిమిషాల వ్యవధిలోనే మైన్మార్ భూప్రళయం

## 334 అణుబాంబులతో సమానమైన శక్తి విడుదల

**బ్యాంకాక్, మార్చి 30:** మైన్మార్‌తోపాటు థాయిలాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే సంభవించిన రెండు భారీభూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ భూకంపం 334 అణుబాంబులతో సమానమైన శక్తిని విడుదలచేసి వినాశనం సృష్టించిందని స్థానిక భూవిజ్ఞాన శాస్త్రవేత్త జెస్ ఫీనిక్స్ అన్నారు. ఈప్రాంతంలో మరిన్ని ప్రకంపనలు వచ్చే ప్రమాదం ఎంతో ఉందని హెచ్చరించారు. భారతటెక్టానిక్ ఫలకాలు యురేషియన్ ప్లేట్స్‌ను వరుసగా ఢీకొంటుండటం వల్ల నెలల తరబడి ఆఫ్టర్‌షాక్స్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. దేశంలో కొనసాగుతున్న అంతర్యుద్ధం కారణంగా మైన్మార్ విపత్తు మరింత తీవ్రం అవుతుందని హెచ్చరించారు. కమ్యూనికేషన్‌లో అంతరాయం వల్ల అక్కడ పూర్తిస్థాయిపరిస్థితులు బాహ్యప్రపంచం గుర్తించేందుకు అవకాశం లేదన్నారు. భూ ఉపరితలానికి పదికిలోమీటర్ల లోతలోనే ప్రకంపనల కేంద్రాలున్నాయని యుఎస్ జియాలాజికల్‌సర్వే వెల్లడించింది. విపత్తుకారణంగా మృతులు 10వేలు దాటే ప్రమాదం ఉందని అమెరికా ముందే హెచ్చ రించింది.ఇప్పటివరకూ 1647 మందికిపైగా మృతిచెందారు. కష్టసమయంలో మైన్మార్‌ను ఆదుకునేందుకు భారత్ ఇప్పటికే ముందుకు వచ్చింది. 40 టన్నుల సహాయ సామగ్రిని పంపించింది. తాత్కాలిక నివాసాలకోసం టెంట్లు, స్లీపింగ్ బ్యాగ్స్, వాటర్ ప్యూరిఫయర్లు, సోలార్‌ల్యాంప్ జనరేటర్లు, అత్యవసర వైద్యపరికరాలను మైన్మార్‌కు పంపించారు. అంతేకాకుండా విపత్తులో ఉన్న దేశానికి సాయం చేసేందుకు 80 మంది ఎన్డీఆర్ఎఫ్‌సిబ్బందిని పంపించింది. అమెరికా ఇండోనేసియా, చైనా ఇతర దేశాలుకూడా అవసరమైన సాయం అందిస్తున్నట్లు ప్రకటించాయి.

# చీఫ్ జస్టిస్ అనుమతి ఉంటేనే వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, మార్చి 30:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతి లేకుండా జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయలేమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. జడ్జి అధికారిక నివాసంలో నోట్లకట్టలు వెలుగుచూసిన వైనంపై యశ్వంత్‌వర్మను సుప్రీం కొల్లిజియం ఆయన స్వస్థలం ఢిల్లీ హైకోర్టుకు బదలిచేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఈ సంఘటనపై ముగ్గురితో కూడిన ప్రత్యేకకమిటీని ఏర్పాటుచేసారు. ముందు ఆకమిటీ నివేదిక రావాలని, ఆ తర్వాత సుప్రీం చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా అనుమతి ఇస్తేనే వర్మపై ఎఫ్ఐఆర్‌నమోదుకు వీలవుతుందని హోంమంత్రిప్రకటించారు. ప్రస్తుత సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ చట్టాల బిల్లును ప్రవేశపెడతామని అన్నారు. ముస్లిం మైనార్టీల నిరసనలు, ఇస్లామిక్ సంస్థల వ్యతిరేకతను పట్టించుకోనవసరం లేదని, జెపిసి నివేదికతోనే పార్లమెంటుకు ఈబిల్లు వస్తుందన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఈ వక్ఫ్‌బిల్లును 2013లో ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించిందని, ఓటుబ్యాంకు బుజ్జగింపు రాజకీయాలకోసం అలాచేసిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో చేసింది కాదన్నారు. జస్టిస్ వర్మకు సంబంధించి సుప్రీం సిజె అనుమతితోనే ఎఫ్ఐఆర్‌నమోదుచేస్తారన్నారు. అంతకుముందు సిజె సంజీవ్‌ఖన్నా మాట్లాడుతూ ఢిల్లీపోలీసులు, ఫైర్‌బ్రిగేడ్ అధికారులు ప్రత్యేకమిటీ ఏ డాక్యుమెంట్లు కోరినా అందిస్తున్నారని అన్నారు. వారు విచారణకమిటీకి ఎంతో సహకరిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై కమిటీ తన నిర్ణయాన్ని అందిస్తుందని, అంతేకాకుండా పబ్లిక్ డొమైన్‌లో కూడా పెడతామన్నారు. కమిటీ నివేదిక వచ్చేంతవరకూ వేచి ఉండాల్సిందేనని అన్నారు. అయితే జస్టిస్‌వర్మ బదలీపై హోంమంత్రి వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు.

# సంక్షోభంలోకి దేశ బ్యాంకింగ్ రంగం

## విపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన



**న్యూఢిల్లీ,మార్చి 30:** కేంద్రంలోని బిజెపి సర్కారు అనుసరిస్తున్న ఆశ్రిత పక్షపాతం, నియంత్రణ వనయవస్థల దుర్వినియోగం వంటి విధానాలు బ్యాంకింగ్ వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఫలితంగాజూనియర్ ఉద్యోగులు పని ఒత్తిడిని ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేసారు. తన బిలియనీర్ మిత్రకోసం కేంద్ర సర్కారు రూ.16లక్షలకోట్ల రుణాలనురద్దుచేయడం వంటి ఆర్థిక అసమర్థ నిర్ణయాలతో నిజాయితీగా పనిచేసే వేలమంది వృత్తినిపుణులు ఇబ్బందులు పడినట్లుగా తెలిపారు. ఐసిఐసిఐబ్యాంకుకు చెందిన మాజీ ఉద్యోగుల ప్రతినిధిబృందం తనను కలిసిన విడియోను రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేసారు. ఆర్థిక విధానాల దుర్వినియోగంతో ఇబ్బందులుపడుతున్న ఇటువంటి శ్రామిక తరగతి నిపుణులకోసం కాంగ్రెస్‌పార్టీ పోరాడుతోందని, పని ప్రదేశంలో వేధింపులు దోపిడీని అంతం చేస్తామని రాసుకొచ్చారు. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఇటువంటి అన్యాయాలు ఎదుర్కొంటున్న మిగిలిన ఉద్యోగులు కూడా తనను సంప్రదించాలని రాహుల్ కోరారు.



# డిజిటైజేషన్‌కాదు సంస్థాగత దోపిడీ

## ఎటిఎం ఛార్జిల బాదుడుపై ఎంకె స్టాలిన్

**చెన్నై, మార్చి 30:** ఎటిఎం నెలవారి పరిమితులు దాటిన విత్‌డ్రాయల్స్‌కు ఛార్జిలు విధించుకోవచ్చని రిజర్వుబ్యాంకు జాతీయ బ్యాంకులకు అనుమతులివ్వడంచూస్తుంటే సంస్థాగత దోపిడీగా కనిపిస్తోందని తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ అన్నారు. ఇది ఎంతమాత్రం డిజిటైజేషన్ కాదని, సంస్థాగత దోపిడీ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరుచుకోవాలని కోరిందని, ఆ తర్వాత పెద్దనోట్ల రద్దు వచ్చిందని, ఇపుడు డిజిటల్ ఇండియా వచ్చిందని గుర్తుచేసారు. తన సోషల్‌మీడియా పోస్టులో డిజిటల్ లావాదేవీలపై ఛార్జిలు వచ్చాయని, తక్కువ నిల్వలకు ఛారజిలు విధిస్తున్నారని, ఇపుడు ఆర్‌బిఐ నేరుగా బ్యాంకులు నెలవారి లిమిట్ దాటితో ఒక్కో విత్‌డ్రాకు రూ.23 చొప్పున ఛార్జిలు విధించుకోవచ్చని అనుమతిస్తోందని విమర్శించారు. పేదలను సమ్మిళిత అభివృద్ధిలోచేర్చడం అంటే ఇదేనా అని మండిపడ్డారు. ఎంఎన్‌రేగా, కెఎంయుటి స్కీంలు ఇపుడు ఈఛార్జిల పెంపునకు లోనవుతున్నాయన్నారు.

అలాగే తమిళనాడుప్రభుత్వం మహిళలక నెలవారీ ఇచ్చే సాయం రూ.1000పైనా ఈ ఛార్జిల మోత ఉంటుందని అన్నారు. ఇది ఎంతమాత్రం డిజిటైజేషన్‌కానేకాదని, సంస్థాగత దోపిడీ అని స్టాలిన్ అన్నారు. నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులంటే ఇదేనా అని ప్రశ్నించారు.

# మయన్మార్‌లో ఇంకా భూప్రకంపనలు

## భయంతో పరుగులు తీసిన ప్రజలు

**నాయ్‌పైథా(మైన్మార్), మార్చి 30:** మైన్మార్‌లోమళ్లీ భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేలుపై దీని తీనరవత 5.1గా నమోదయింది. ఇళ్లనుంచి ప్రజలు భయంతోబయటికి పరుగులుతీసారు. ఆదివారం మైన్మార్‌లోని రెండో అతిపెద్ద నగరం అయిన మాండలే సమీపంలో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించిందని యుఎస్ జియాలజికల్‌సర్వే ప్రకటించింది. సహాయకబృందాలు ప్రభావితప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే శుక్రవారం సభవించిన భారీ భూకంపం వల్ల రోడ్లు వంతెనలుకమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో సహాయక చర్యలక ఆటంకం కలుగుతున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. తొలుత మైన్మార్‌లో 7.7తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. 1647 మంది మృతిచెందగా 3400 మందికిపైగా గల్లంతయ్యారు. శిథిలాలను తొలగించేకొదీనద మృతుల సంఖ్య పెరుగుతోంది. శనివారం ఉదయం 11.53 గంటలసమయంతో 4.3తీవ్రతతోను, మధ్యాహ్నం మళ్లీ 2.30 గంటలకు 3.8 తీవ్రతతోను 20 నిమిషాల వ్యవధిలో 4.7తీవ్రతతో వరుసగా భూప్రకంపనలు వచ్చాయి. మరోసారి ఆదివారం భూకంపం రావడంతోప్రజలు భయాందోళనలకు గురయ్యారు.థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఆకాశహర్మం కుప్పకూలిన ఘటనలో అక్కడ పనిచేస్తున్న వారిలో 78 మంది కార్మికుల జాడ తెలియరాలేదు. భూకంపంవల్ల నగరంలో చని పోయిన మరో 10 మందిని గుర్తించారు. భారీ స్థాయిలో ఉన్నశిథిలాలు తొలగించేందుకు మరింత శక్తివంతమైన యంత్రాలు వినియోగిస్తున్నారు.

# మా జాబితాలో నెక్ట్స్ నువ్వే..

## సమాజ్‌వాదినేతలకు బిష్ణోయ్ గ్యాంగ్ బెదరింపులు



**న్యూఢిల్లీ, మార్చి 30:** లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు బెదిరింపులు వస్తున్నట్లు సమాజ్‌వాది పార్టీ జాతీయ ప్రతినిధి తారిఖ్‌ఖాన్ అన్నారు. గడచిన రెండునెలలుగా బిష్ణోయ్ గ్యాంగ్‌కుచెందిన వ్యక్తి తనకు ఫోన్‌కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నా తాను పట్టించుకోలేదన్నారు. తాజాగా మరోసారి కాల్‌చేసి తాము చంపబోయే వ్యక్తుల జాబితాలో తర్వాత నువ్వే ఉన్నావంటూ బెదిరించారని రెండు రోజులు ఆగితే తాము ఏంచేస్తామో తెలుస్తుందంటున్నారని తెలిపారు. ఈ సమాచారం ఎస్పీకి తమ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కు తెలియజేసానన్నారు. ఎస్‌పి రమానంద్‌ప్రసాద్ మాట్లాడుతూ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిజంగానే బిష్ణోయ్ గ్యాంగ్ వ్యక్తులు ఈకాల్‌చేసారా లేక సైబర్ నేరగాళ్లపనా అనే కోణంలో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎస్పీనేతకు రక్షణ కల్పిస్తామని హామీఇచ్చారు. ఇప్పటికేపలుసార్లు బిష్ణోయ్‌గ్యాంగ్‌నుంచి సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురయ్యాయి. గత ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్టుమెంట్‌వద్ద గానయంగ్‌కు చెందిన వ్యక్తులు కాల్పులుజరిపారు. సల్మాన్‌స్నేహితుడు ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీని వీరు దారుణంగా హత్యచేయడంతో గతంలో వీరిపేరు తెరపైకి వచ్చింది. ఈ గ్యాంగ్‌నాయకుడయిన లారెన్స్ బిష్ణోయ్‌రపస్తుతం జైలులో ఉన్నాడు. బ్యారక్‌ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు వేస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. సిద్ధూమూసేవాలా, బాబా సిద్దిఖీలపై దాడులు ఈవిధంగానే చేసాడని పోలీసులు చెపుతున్నారు.

# స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం..

# చెన్నైలో అత్యవసరంగా ల్యాండింగ్



**చెన్నై, మార్చి 30:** స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో చెన్నైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఆ విమానాన్ని పరిశీలించగా వీల్‌టైర్ పాడైనట్లు గుర్తించారు. ఆదివారం తెల్లవారుజామున జైపూర్ నుంచి చెన్నైకు బయలుదేరిన స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపాన్ని పైలట్లు గుర్తించారు. దీంతో చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. కాగా, ఆదివారం తెల్లవారుజామున 5.46 గంటలకు చెన్నై విమానాశ్రయంలో ఆ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. తర్వాత ఆ విమానాన్ని సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా విమానం టైర్ పగిలి పాడైనట్లు గుర్తించారు. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు స్పైస్‌జెట్ సంస్థ పేర్కొంది. మరోవైపు ఐఎటిఎ ఆపరేషనల్ సేఫ్టీ ఆడిట్ సర్టిఫికేషన్‌ను స్పైస్‌జెట్ ఇటీవల విజయవంతంగా పునరుద్ధరించింది. 2027 మార్చి వరకు ఇది చెల్లుబాటులో ఉంటుందని ప్రకటించింది. ఇది వెల్లడించిన రెండు రోజుల తర్వాత తాజాగా ఈ సంఘటన జరిగింది.

# శ్రీరామనవమిన రామేశ్వరంలో పంబన్ వంతెన ప్రారంభం

## దేశంలోనే మొదటి వర్టికల్‌లిఫ్ట్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

**చెన్నై, మార్చి 30:** శ్రీరామనవమి పర్వదినం రోజు అంటే ఏప్రిల్ ఆరవ తేదీ ప్రధాని నరేంద్రమోడీ తమిళనాడులోని రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన పంబన్ వంతెనను ప్రారంభించ నున్నారు. అంతేకాకుండా రామనాథస్వామి దేవాలయంలో ప్రార్థనలు కూడా నిర్వహిస్తారు. 2.5 కిలోమీటర్ల పొడవైన పంబన్ వంతెన రామేశ్వరం నుంచి తమిళనాడుప్రధాన భూభాగానికి చేరువ చేసే విధంగా నిర్మించారు. కేవలం ఐదునిమిషాల్లోనే ఇపుడు గమ్యస్థానానికి ఈ వంతెనమీదుగా చేరతాయి. ఇప్పటివరకూ బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనపై 25 నుంచి 30 నిమిషాలు తమిళనాడుకు చేరుకునే సమయం పడుతోంది. కొత్తగా రూ.535 కోట్లతో నిర్మించిన పంబన్‌బ్రిడ్జి వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిగా నిర్మించారు. 1914లో నిర్మించిన పాత వంతెన కాలపరిమితి తీరిపోయింది. దీనికితోడు కొంతమేర దెబ్బతినడంతో 2022లోనే ఈ వం తెనపై రాకపోకలు నిలిపివేసారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గత నవంబరులో భారత్‌లోని మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జి అని ఫోటోలు ప్రకటించారు. పాత వం తెన పరంగా సుమారు 105 ఏళ్లపాటు రామేశ్వరాన్ని మెయిన్‌ల్యాండ్‌ను కలుపుతూవచ్చింది. కొత్త పంబన్ బ్రిడ్జితో ఇపుడు కేవలం ఐదు నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరతారు. ఈ బ్రిడ్జిపై గంటకు 75 కిలో మీటర్ల వేగంతో వెళ్ల వచ్చని రైల్వే సేఫ్టీ నిర్ధారించింది. అయి తే వర్టికల్ లిఫ్ట్ పోర్ష న్‌వద్ద మాత్రం స్పీడ్ తగ్గుతుంది. వంతెన డిజైన్ గంటకు 80 కిలో మీటర్ల వేగంగా నిర్మించారు. అయితే అయితే వంతెన మలుపులతో ఉండటంతో వేగం గంటకు 50 కిలో మీటర్లకు మాత్ర మే అనుమతించారు. నౌకలు వచ్చేసమయంలో ఈ వంతెన రెండుగా చీలిపోతుంది. ఒకే ఒక్కరి పర్యవేక్షణలో ఈ లిఫ్ట్‌ను నిర్వహించి నౌక వెళ్లిన తర్వాత మళ్లీ వంతెన యథాతథంగా వస్తుందని రైల్వేశాఖ వెల్లడించారు.



# జీబ్లీ వినియోగం తగ్గించండి: ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్



**వాషింగ్టన్, మార్చి 30:** ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్.. ఇలా ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఓపెన్ చేసినా ఫీడ్ మొత్తం జీబ్లీ ఫొటోలతో నిండిపోతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'జీబ్లీ స్టయిల్' ఇమేజ్ జనరేటర్ ట్రెండ్ అవుతోంది. యూజర్లను ఆకట్టుకునేందుకు ఓపెన్ ఎఐ సంస్థ ఇటీవల చాట్‌జిపిటిలో జీబ్లీ స్టూడియోను ప్రవేశపెట్టింది. దాంతో యూజర్లు తమ ఫొటోలను యానిమేషన్ తరహా చిత్రాలుగా మార్చుకుంటున్నారు. అయితే కొత్త ఒక వింత పాత ఒక రోత అన్నట్లుగా ఈ కొత్త సదుపాయాన్ని యూజరు విపరీతంగా వినియోగిస్తున్నారు. దీనిపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ స్పందించారు. జీబ్లీ వినియోగం ఎక్కువగా ఉందని, ఈ విషయంలో యూజర్లు కాస్త కూల్‌గా ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. 'మా సిబ్బందికి నిద్ర కూడా అవసరం కదా.. దయచేసి జీబ్లీ వినియోగం కాస్తతగ్గించండి.' అని కోరారు. ఓపెన్ ఎఐ సంస్థ ఇటీవల చాట్‌జిపిటిలో జీబ్లీ స్టయిల్ జనరేటర్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఆప్షన్‌ను విపరీతంగా వినియోగిస్తుండటం వల్ల తమ జిపియు వ్యవస్థపై అధికభారం పడుతోందని, అందుకే దీనికి లిమిట్ పెడుతున్నామని ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ ఇటీవల పేర్కొన్నారు. ఇప్పటికే ఉచిత యూజర్లకు ఫొటోల జనరేషన్‌లో రోజుకు మూడు అనే పరిమితి విధించారు. మరోవైపు గ్రోక్‌లో కూడా ఈ ఫొటో జనరేషన్ ఆప్షన్‌ను యూజర్లు విరివిగా ఉపయోగిస్తున్నారు.

# గాంధీభవన్ పేదల దేవాలయం

## ఉగాది వేడుకల్లో పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్



హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ పేదల దేవాలయం లాంటిదని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం విశ్వవసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు మహేష్‌కుమార్ అధ్యక్షతన జరుగగా ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎంపి అనిల్‌యాదవ్, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసమూర్తి ఆధ్వర్యం లో పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇతర మంత్రులు ప్రజాసంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని అన్నారు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం ముందుకు సాగుతోందని ఆయన వివరించారు.

పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని పెట్టుబడులు పెట్టేందుకు విదేశీయులు ముందుకు వస్తున్నారు. మనం పండిస్తున్న సన్నబియ్యం ఫిలిప్పిన్స్‌కు ఎగుమతి చేస్తున్నాం అని అన్నారు. మనం పండిస్తున్న సన్నబియ్యం ఫిలిప్పీన్స్‌కు ఎగమతి చేస్తున్నాం అని అన్నారు. విద్యపరంగా చాలా ఆలోచనలు చేస్తున్నాం అని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం అని వివరించారు. దేశంలో కాంగ్రెస్ మల్లికార్జున ఖర్గే, యువ నాయకులు రాహుల్‌గాంధీ సోనియాగాంధీ నేతృత్వంలో ఎంతో పటిష్ఠంగా ఉందని ఆయన అన్నారు. రాబోయే మరోపదేళ్ల తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కోసం పనిచేస్తుందని అన్నారు.

# బిసి గురుకుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ దరఖాస్తు గడువు ఏప్రిల్ 6కు పెంపు

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: రాష్ట్రంలోని మహాత్మాజ్యోతిబాఫూలే బిసి గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి గడువును పొడిగించారు. దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 31 నుంచి ఏప్రి 6 వరకు పొడిగించినట్లు ఎంజేపి కార్యదర్శి బడుగు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 6 నుంచి 9వ తరగతి వరకు మొత్తం 6832 బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 20(ఆదివారం)న నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నాం 12 గంటల వరకు జరగనుంది. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపును చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 6లోగా బిసి గురుకుల అధికారిక వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ప్రకటనలో తెలిపారు.




# హిందువుల ప్రతి పండుగలో సందేశంతోపాటు అంతర్గతంగా సైన్స్

### త్వరలో రాష్ట్ర, జాతీయ కమిటీలు ఏర్పాటు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### పార్టీ కార్యాలయంలో హోమం, పంచాంగ శ్రవణం

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: హిందువుల ప్రతి పండుగలో సందేశంతో పాటు సైన్స్ కూడా ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం జరిగిన పంచాంగ శ్రవణంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కులాలకు అతీతంగా సామూహికంగా ప్రజలందరూ కలిసి ఉండాలనే పండుగలు మనకు సూచిస్తాయన్నారు. రాష్ట్రం, దేశం మరింత సస్యశ్యామలంగా ఉండాలన్నారు. మోడీ నాయకత్వంలో భారత్ మరింత పురోగమించడంతో పాటు ప్రపంచంలో మన దేశ ఖ్యాతి మరింత పెరగాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో బిజెపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, దీనికి ఓ ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో బూత్, మండల, జిల్లా కమిటీలను పూర్తి చేసుకున్నాం అన్నారు. రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీలు త్వరలోనే ఏర్పాటు అవుతాయన్నారు. కొత్త సంవత్సరంలో అందరు బాగుండాలని, మనతోపాటు మన కుటుంబ సభ్యులు మన బంధువులు కూడా బాగుండాలని, ఆ వెంకటేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలుగు ప్రజలకు శ్రీవిశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు

### బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: శ్రీ విశ్వావాసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సోదర సోదరీమణులకు శుభా కాంక్షలు అంటూ బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా తెలుగులో ఎక్స్ వేదిగా ట్వీట్ చేశారు. ఈ నూతన సంవత్సరం మీకు మీ కుటుంబ సభ్యులకు ఆరోగ్య, ఐశ్వర్యాలను మరియు ఆనందాన్ని తెచ్చిపెట్టాలని ఆకాంక్షిస్తున్నానని, మీరందరూ సంతోషాలు, విజయాలతో కూడిన సంవత్సరాన్ని గడపాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో రంజాన్ గొప్పదం వివరిసూనత ముస్లిం పవిత్ర గ్రంధం ఖురాన్ ఆవిర్భావ మాసం అని పేర్కొన్నారు. రంజాన్‌ను ముస్లింలు అత్యంత సంప్రదాయ బద్ధంగా ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షి స్తున్నానని ఆయన



# ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందిస్తాం

### గ్రామస్తులతో డిప్యూటీ సిఎం భట్టి ఆత్మీయ పలకరింపులు

మధిర(ఎర్రుపాలెం) మార్చి 30, ప్రభాతవార్త: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని ఎరుపాలెం మండలం మాచవరం, గుంటుపల్లి గోపవరం, ఎర్రుపాలెం గ్రామాలలో ఆయన ఉగాది వేడుకలను గ్రామస్తులతో కలిసి పంచుకున్నారు. కాచవరం గ్రామానికి చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కేష నరసమ్మను ఆమె ఇంటికి వెళ్లి పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ప్రజలతో సమావేశమైన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీల లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్రమంలో. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వాడుతున్న గృహ వినియోగదారులకు జీరో బిల్ వస్తున్నదన్నారు. వీరికి సంబంధించిన డబ్బులను ప్రతినెల ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నదన్నారు.

మహాలక్ష్మి పథకం కింద వంటగ్యాసు సిలిండర్ ప్రభుత్వం 500 రూపాయలకే ఇస్తుందని, సబ్సిడీ డబ్బులు మీ బ్యాంకు ఖాతాలో పడుతున్నయా అని మహిళలను ఆరా తీశారు. పొదుపు సంఘం లో ఉన్న మహిళలకు ఇందిరమ్మ డైరీ పథకంలో సబ్సిడీపై గేదెలను ఇస్తామని భట్టి తెలిపారు. కాచవరం గ్రామంలో రేషన్ షాపు లేనందున లక్ష్మాపురం గ్రామానికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని గ్రామంలోనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కొంతమంది మహిళలు తమకు ఇల్లు లేవని ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి అయ్యిందని గ్రామంలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని వెల్లడించారు.



వివరాలను వెల్లడిస్తున్న తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి

# వృద్ధురాలి కంట్లో కారంకొట్టి నగల చోరీ.. నిందితుల అరెస్టు

చిన్నశంకరంపేట,మార్చి 29,ప్రభాతవార్త: వృద్ధురాలి కంట్లో కారంకొట్టి బంగారు నగలను ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం చిన్న శంకరంపేటలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా శివంపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన వృద్ధులు ఒగ్గు కమలమ్మ, ఆమె భర్త లస్మయ్య ఈ నెల 11న చిన్నశంకరంపేట మండల పరిధి సంగాయపల్లిలో తమ మనవరాలు ఇంటివద్ద నిర్వహిస్తున్న మల్లన్న దేవాలయ పండగకు గవ్వలపల్లి వద్ద బస్సుదిగి సంగయ్యపల్లికి నడుచుకుంటూ వెళ్తున్నారు. వారు వెళ్లే మార్గంలో ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన యువకులు మాడబోయిన బాబు, గురుచరణ్ వారిని గమనించి ద్విచక్ర వాహనంపై వారి వద్దకు వెళ్లి మేము కూడా గుడి వద్దకు వెళ్తున్నామని ఆ వృద్ధులను నమ్మించి ఒగ్గు కమలమ్మను ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని తీసుకెళ్లారు. కొద్దిదూరం వెళ్లాక గుడి సమీపంలోని పౌల్ట్రీఫామ్ వద్ద పథకం ప్రకారం ముందే తెచ్చుకున్న కారంపొడిని కమలమ్మ కళ్లలో చల్లారు. అరిస్తే చంపేస్తామని బెదరించి వృద్ధురాలీ మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు, ముక్కుపుడకను తీసుకొని అక్కడి నుండి పరారయ్యారు. ఒగ్గు కమలమ్మ కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకొని జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణగౌడ్ దర్యాప్తు చేపట్టారు.

# దొడ్డు బియ్యం నిల్వలపై ఉత్కంఠ

## ఇ పాస్ యంత్రాల్లో జీరో నిల్వలుగా నమోదు

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: ఉగాది రోజున హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకం లాంఛనంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడంతో ఏప్రిల్ 1 తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాబో తుండటంతో ఇన్నాళ్లు చౌకదరల దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డబియ్యం నిల్వలపై ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం చౌకధరల దుకాణల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను ఈపాస్ యంత్రాలతో జీరోగా మార్పుచేసింది. తెలంగాణలో ఎం ఎల్ఎస్ పాయింట్ల వద్ద ఆరేడు నెలల సరిపడ సన్న బియ్యం స్టాక్ వచ్చి చేరింది. కరీంనగర్ జిల్లాలోనే 33వేల మె.ట బియ్యం ఎల్ఎస్‌పాయింట్ల వద్ద నిల్వఉంది.

ఏడు నెలల వరకు సన్నబియ్యం సరఫ రాకు ఢోకాలేదని అక్కడి అధికారులు ధీమాతో ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా చౌకదరల దుకాణలో సన్నబియ్యం వందకు వందశాతం సరఫరాచేసి నిల్వచేసుకున్నారు. నెలవారి కోటాతోపాటుగా చౌకధరల దుకాణల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ఎంత మేరకు నిల్వ ఉన్నాయో అంతమేరకు సన్నబియ్యం కూడా అదనంగా రేషన్ డీలర్లకు ఇచ్చారు. ప్రస్తుతానికి దొడ్డుబియ్యంపై విధానపరమై నిర్ణయం తీసుకోలేదు.

ఆసిఫాబాద్ జిల్లాలోనే 2,640.96 క్వింటాళ్ల దొడ్డు బియ్యం రేషన్‌షాపుల్లో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 748 చౌకధరల దుకాణాలకు గత ఆరు రోజుల క్రితం నుంచే సన్నబియ్యం సరఫరా చేస్తున్నా దొడ్డ బియ్యం మాత్రం ఇంకా వాసస్ తీసుకొనిపోలేదు. ఖమ్మం జిల్లాలో 26,932 లబ్దిదారులు పెరగడంతో ఏప్రిల్ నెలలో 7375.868 మె.ట బియ్యం సరఫరాచేశారు. మార్చినెలలో 6222.687 మె.ట బియ్యం కేటాయించారు. ఏప్రిల్ నెల కోటపెరగడం అదే విధంగా దొడ్డు బియ్యం చౌకధరల దుకాణాల్లో ఉండటంతో రేషన్ దుకాణాలు బియ్యం నిల్వలతో కిక్కిరిసి పోయింది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 2050 చౌకధరల దుకాణాల్లో 45,656 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ దుకాణాలలో 4926మె.ట దొడ్డు బియ్యం ఉన్నట్లు లెక్కించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 71647 మె.ట దొడ్డుబియ్యం రేషన్ షాపుల్లో ఉన్నట్లు పౌరసరఫరా అధికారుల అంచనా వేశారు. స్టేజ్-1, స్టేజ్-2 గిడ్డంగుల్లో కూడా దొడ్డుబియ్యం నిల్వలు లెక్కిస్తున్నారు. మార్చి నెలలో సరుకుల పంపిణీ ఆలస్యంగా 24వరకు సాగ దీశారు. కొత్తరేషన్‌కార్డులతోపాటు కోటా కూడా మంజూరు చేయడంతో వారంతా లబ్ధిపొందాలన్న ఉద్దేశంతో గతనెల పంపిణీ గడువు పెంచారు.

# నా రాజకీయ కథను నేనే రాసుకొని నటిస్తున్నా

### విద్యార్థి దశనుంచే నాపై ఎన్నో కుట్రలు

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: నా రాజకీయ జీవిత కథను నేనే రాసు కున్నానని ఎవరో రాసిన కథల్లో హీరోలు నటిస్తారని కానీ నా కథలో నేనే 'ఏ వార్ ఆఫ్ లవ్' పేరుతో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నాని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాశ్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి అన్నారు. శ్రీ విశ్వామస నామ కొత్త సవత్సరాది ఉగాది పండుగ రోజున ఆదివారం బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో మూవీ కార్యాలయాన్ని జగ్గారెడ్డి ప్రారంభించారు. విలకర్లతో జగ్గారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి తనపై ఎన్నో కుట్రలు జరిగాయని తెలిపారు. కానీ తన నిజ జీవితంలో ఇవన్నీ తాను చేశానని గుర్తు చేసుకున్నారు. తన జీవితంలో జరిగిన అంశాలనే ఈ సిని మాలో పోలీసులను కొట్టినట్లు, వాళ్లతో ఫైట్ చేసినట్లు చూపిస్తున్నామన్నారు. ఈ సినిమాలో తన జీవితంలో కొన్ని సంఘటనలు వేరే వాళ్లతో చేస్తూనే తాను కూడా రోల్ ప్లే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సినిమా కార్యాలయమే ఇకపై తన అడ్డా అని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తాను పోషించిన పాత్ర సక్సెస్ ఫుల్ ప్రయాణం సినిమాలోనూ అదే విధంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఇందులో తన ఒరిజినల్ క్యారెక్టర్ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పోలీసులను కొట్టినట్లు హీరోలు నటిస్తారు కానీ తనవి ఒరిజినల్‌గా ఉన్నాయని వెల్లడించారు. విద్యార్థి నేతగా, కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా తాను ఎదురుకొన్న కష్టాలు, బాధలు ఇవన్నీ చూపించనున్నారని తెలిపారు. తన రాజకీయ జీవిత కథను తానే రాసుకున్నానన్నారు. స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ అన్ని తానే రాసుకున్నానని చెప్పారు. అయితే ఓ ఫంక్షన్‌లో ఈ సినిమా డైరెక్టర్ రామానుజం తనను కలిశాడని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. తాను కొన్ని సంవత్సరాల క్రితం ఒక కథను రాసు కున్నానని.. అందులో మీ పాత్ర ఉండాల నుకుంటున్నానని పేర్కొన్నాడని తెలిపారు. డైరెక్టర్ రామానుజం చెప్పిన పాత్ర తన నిజ జీవితానికి దగ్గరగా ఉండటంతో ఈ సినిమాలో నటించేందుకు ఒప్పుకున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయన చూపించిన తన పోస్టర్ తనను అట్రాక్ట్ చేసిందని.. అప్పుడే ఈ సినిమా చేయాలని నిర్ణయం తీసుకున్నానని ఆయన వివరించారు. ఈ చిత్రానికి మూలకారకుడు డైరెక్టర్ రామానుజమని జగ్గారెడ్డి అన్నారు. సినిమా టీజర్ విడుదల చేశారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి

### బిసి ఉద్యమానికి తమ సంపూర్ణ మద్ధతు

### బిసి నాయకులకు హామీ ఇచ్చిన

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా కులగణన జరపాలని.. బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు జరపాలని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో చట్టరూపంలో తేవడానికి సహకరించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ ఆదివారం సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వెస్లీని ఎంబి భవన్‌లో కలిసి మద్దతు కోరారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు సిపిఐ(ఎం) మద్దతు తెలియజేస్తుందని.. తక్షణమే కేంద్రప్రభుత్వం ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకొని, అమలు చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను వ్యతిరేకిస్తుందని.. కానీ కులగణనకు, రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్రంలో బిజేపి నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండిసంజయ్ ఇలాంటి ద్వంద్వ వైఖరితో మాట్లాడుతుండటాన్ని బలహీన వర్గాల ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నదని.. అగ్రవర్ణ ఆధిపత్యంతో, మనువాద ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించే పార్టీగా బిజెపి ఉందన్నారు. మతోన్మాద రాజకీయాలను, కులరాజకీయాలను ప్రేరేపిస్తూ వాటినే పెంచి పోషిస్తుందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో కులగణన అనేది అత్యంత అవసరమని.. ఇలాంటి అంశాలపై ఉద్యమిస్తున్న సంఘాలు, పార్టీలకు తమ పార్టీ పూర్తిగా మద్దతు తెలియజేస్తుందని జాన్‌వెస్లీ బిసి సంక్షేమ సంఘం నాయకులకి స్పష్టం చేశారు.

# రేవంత్ జనరంజక పాలన విమర్శించడం తగదు

### ప్రవీణ్‌కుమార్‌పై నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి విసుర్లు

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనరంజక పాలనను మాజీ ఐపిఎస్ ఆఫీసర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించడం తగదని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపి మల్లురవి అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిది రాక్షస పాలన, రాబందుల పరిపాలన అంటుండని ఆవేన చెందారు. రేవంత్ జైల్లో ఉండాల్సిన వ్యక్తి అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించడం ఆయన రాజకీయ అజ్ఞానం తెలుపుతోందని అన్నారు. ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నందుకు సిగ్గు పడాలని ఎద్దేవా చేశారు. బిఎస్‌పిలో ఉన్నప్పుడు కేసీఆర్ రాక్షసుడు ,కేసీఆర్ పాలన రాక్షస పాలన అని అన్నడు అని గతంలో ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలను గుర్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం కోసం గొప్ప విప్లవాన్ని తీసు కొస్తుండు అని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి క్యాస్ట్ సెన్సెస్ చేసి 85శాతం ఎసి,బిసి, మైనార్టీస్‌లు, 15శాతం ఫార్వర్డ్ ఉన్నారని లెక్కలు చూపించారని పేర్కొన్నారు. ప్రజలందరికీ సమానమైన హక్కులు ఉండాలని,సమానమైన స్వేచ్ఛ ఉండాలని ఇందిరా గాంధీ ఆలోచించారో ఆ రకంగా రేవంత్‌రెడ్డి ఆలోచించడం గొప్పదనమని ఆయన అన్నారు.

# కలియుగంలో ఆధ్యాత్మిక మార్గంతో రక్షణ

### పుష్పగిరి విద్యాశంకరభారతీ మహాస్వామి

హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 30, ప్రభాతవార్త: కలియుగంలో ధనం పని చేయదు, విద్యా పాండిత్యాలకు విలువ వుండదు, కుయుక్తులు కొంతకాలం పని చేసినా ఎక్కువ కాలం నిలబడ లేవు కేవలం ఆధ్యాత్మిక మార్గం మాత్రమే రక్షణ ఇస్తుందని పుష్పగిరి విద్యా శంకర భారతీ మహాస్వామి సందేశం ఇచ్చారు. ఆదివారంరాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ సంస్థల నిర్వహణలో విశ్వావసు నామ ఉగాది సందర్భంగా జరిగిన సభలో పుష్పగిరి విద్యా శంకర భారతీ స్వామి తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన దేవస్థానం ఆస్థాన వేద పండితులు భట్టర్ సుందర ప్రహ్లాదాచార్యులను వంశీ వేద ఉగాది పురస్కారం తో సత్కరించి మాట్లాడారు. విశ్వా వసు సంవత్సరం అందరికీ శ్రేయస్సు ఇస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతన వున్నవారికి భయాలు వుండవని, అట్టివారు ముందు ఏమీ జరుగు తుందనే చింత వుండదు కాబట్టి వారికి పంచాంగం జ్యోతిషం గురించి ఆలోచన అక్కర లేదన్నారు. ఆశా పాశములు, వల్లె, పాపము, మనిషి నీ పట్టు కొంటాయన్నారు. విశ్వావసు సంవత్సరం చూస్తాము అనుకున్న వారు చూడకుండా వెళ్లి పోయారు. అనీ చూడ లేమేమో అనుకున్నవారు వున్నారని అదే మాయ అన్నారు. వంశీ రామరాజు ఆత్మీయ వంశీయంగా ధర్మ వంశీయం గా భావి తరాలకు ఉత్తమ సంప్రదాయం అందిస్తున్నారని కొనియాడారు. వేదిక పై రాజ్య శ్రీ రచించిన లలితా సహస్ర నామ వ్యాఖ్యానం,డాక్టర్ మీనాక్షి రచించిన సాయీ త్వ మేవ శరణం మమ గ్రంథాన్ని స్వామి ఆవిష్కరించారు.



టిటిడి దేవస్థానం ఆస్థాన వేదపండితులు భట్టర్ సుందర ప్రహ్లాదాచార్యులను వంశీ వేద ఉగాది పురస్కారం అందిస్తున్న పుష్పగిరి విద్యాశంకర భారతీ మహాస్వామి

వేదిక పై దర్శకుడు రేలంగి నరసింహారావు, తిరుమల గ్రూప్స్ చంద్ర శేఖర్ విదేశీ ఆంధ్రులు బి వ్యాస కృష్ణ రాధ తదితరులు పాల్గొనగా వంశీరామరాజు కార్య క్రమం నిర్వహించారు. తొలుత రామరాజు తరం గిణి శాస్త్రీయ గానగోష్ఠి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం, చివరగా భాస్కర రావు,సురేష్ శర్మ శ్రవణ్ కుమార్ శర్మ పాండురంగ జ్యోతి నాలుగు వేద పఠనం చేశారు.



# పుష్కరకాలంగా సన్నబియ్యం పంపిణీ పట్టించుకోని బిజెపి

### ఆహార భద్రత చట్టం తెచ్చింది కాంగ్రెస్

### కేంద్రమంత్రి బండి సంజయ్‌పై సీతక్క ఫైర్

ప్రభాతవార్త, నడిగూడెం, (సూర్యాపేట): కేంద్రంలో బిజెపి పుష్కరకాలంగా పరిపాలన కొనసాగిస్తూ సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆలోచన చేయకపోగా అమలు చేస్తున్న కాంగ్రెస్పై విమర్శలు చేయటం ఎంత మేరకు సమంజసమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారము సూర్యా పేటలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఇంటికి వచ్చిన సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే బిజెపికి మింగుడు పడటం లేదన్నారు. పథకాల అమలుతో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే తట్టుకోలేక అనవసరపు విమర్శలు చేస్తున్నారన్నారు.

సన్న బియ్యం పంపిణీకి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై సీతక్క ఫైర్ అయ్యారు. ఆహార భద్రత చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ఆహార భద్రత చట్టాన్ని పేద ప్రజల సంక్షేమ దృశ్య ప్రవేశపెట్టగా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వము చర్యలు తీసుకుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను కూడా తగ్గించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామాల్లో వేసవిలో కూలీలకు పనులు కల్పించేందుకు గాను 2005 లో కాంగ్రెస్ ప్రభుత్వము ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టిన విషయాన్ని సీతక్క గుర్తు చేశారు. ప్రస్తుతం ఉపాధి పథకాన్ని కూడా నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వము అడుగులు వేయడము సరైంది కాదన్నారు.

# విభజన చట్టం హామీలు అమలు చేయండి

### పిసిసి అధికార ప్రతినిధి గౌరిసతీష్

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: బండి సంజయ్ కేంద్రమంత్రిగా కమీషన్ల గురించి మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉంది టిపిసిసి అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఆదివారం మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అవివేకంగా మాట్లాడుతుండు అని ఆగ్రహం వ్యయక్తం చేశారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండిపింక్ కలర్ అధికారంలోకి రాకుండా తెలంగాణ నుండి పారదోలినం అంటుండు అని ఎద్దేవా చేశారు. పింక్ కలర్ అధికారంలోకి రాకుండా పారదోలితే పార్లమెంట్ ఎన్నికల్లో దోస్తానా ఎందుకు చేశారు అని నిలదీశారుజ. ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడే అవకాశం ఉందని చెప్పిన పండితుల పట్ల ,పంచాంగం సంజయ్ మాట్లాడడం విడ్డూరంగా ఉంది అని అన్నారు. దమ్ముంటే విభజన చట్టంలో రాష్ట్రానికి రావలసిన అన్నిటిని తీసుకురావాలి అని సవాల్ విసిరారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధులు తీసుకురాకుండా నీటి బుడగల్లాగా మాట్లాడితే తెలంగాణ ప్రజలు ఊరుకోరు అని ఆయన అన్నారు. బండి సంజయ్ మాట్లాడేటప్పుడు ఆధారాలతో మాట్లాడాలి లేదంటే ప్రజలు మిమ్మల్ని క్షమించరు అని హెచ్చరించారు.

## ఎంఐఎంను గెలిపించడానికే కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటీ చేయడం లేదు

### హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో బిజెపి పోటీ చేస్తుంది: బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 30:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పోటీ చేస్తుందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిఇ బండి సంజయ్ స్పష్టం చేశారు. మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్,బిఆర్ఎస్ పోటీకి వెనుకంజ వేస్తున్నాయని విమర్శించారు. బిఆర్ఎస్‌కు అత్యధిక మంది కార్పొరేటర్లున్నా ఎందుకు పోటీ చేయడం లేదు? అని ప్రశ్నించారు. జిహెచ్ఎంసీలో బిజెపికి సరిపడా బలం లేకపోయినా లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నామని తెలిపారు. మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉండాలనుకుంటోందని అన్నారు. దమ్ముంటే కాంగ్రెస్,బిఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టి వేర్వేరుగా పోటీ చేయాలని బండి సంజయ్ సవాల్ విసిరారు.




## హెచ్‌సియు భూముల వేలాన్ని వెనక్కి తీసుకోవాలి: బిజెపి

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర బిజెపి నేతలు ఖండించారు. యూనివర్సిటీ భూముల రక్షించేందుకు ప్రయత్నించిన విద్యార్థులను అరెస్టు చేయడం బాధకరం అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై కర్ర విరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యార్థులు అని కూడా చూడకుండా, కనీసంగానైనా కనికరం చూప కుండా పశువులను లాక్కెళ్లినట్టుగా లాక్కెళ్లి విద్యార్థులను నిర్బం ధించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఉచిత హామీలను నెరవేర్చ డానికి హెచ్‌సియు భూములను అమ్మదలిచిందన్నారు.ఈ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## బిసి జాబితాలో కులాల మార్పుపై త్వరలో నిర్ణయం

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బిసి) జాబితాలోని కొన్ని కులాల పేర్లను మార్చాలంటూ డిమాండ్ వస్తున్న నేపథ్యంలో దీనిపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. బిసి జాబితాలో వీరముష్టి (వీరభద్రయ్య)గా ఉన్న కులం పేరును వీరభద్రయ్య (వీరముష్టి)గా మార్చాలన్న వినతి మేరకు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో ఆ సామాజికవర్గం వారు ఉంటున్న ప్రాంతాల్లో నిరంజన్ పర్యటించారు. వీరముష్టి కులస్థుల స్థితిగతులను, జీవన విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాల్లో ఉన్న దొమ్మర, వీరముష్టి, పిచ్చకుంట్ల, తమ్మిలి కులాల పేర్లను మార్చాలని పలు ప్రాంతాల నుంచి కమిషన్‌కు వినతులు వచ్చాయని తెలిపారు.

## దేశ సంస్కృతి సంప్రదాయాలకు మహావృక్షం ఆర్ఎస్ఎస్: మోడీ

**నాగ్‌పూర్, మార్చి 30:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారత సంస్కృతికి మహావృక్షం అని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. 11 ఏళ్లక్రితం ప్రధానిగా బాధ్యతలుచేపట్టిన తర్వాత తొలిసారి ఆయన నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత డా.హెడ్గేవార్ స్మృతిమందిరానికి వెళ్లిన ప్రధాని సంస్థ వ్యవస్థాపకుడు కెబి హెడ్గేవార్ రెండోసర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోల్వాల్కర్‌లకు నివాళులర్పించారు. అనంతరం 1956లో డా.బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతానిన స్వీకరించిన దీక్షభూమిని సందర్శించారు. అదేవిధంగా మాధవ్‌నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు శంకుస్థాపనచేసారు. భారత సంస్కృతి ఆధునీకరణకు ఆర్ఎస్ఎస్ మహావృక్షం లాంటిదని, ఈసంస్థ సేవకు పర్యాయపదం అని అన్నారు. సంఘ్ కార్యకర్తలు వివిధ రంగాల్లో నిస్వార్థంగా పనిచేస్తున్నారన్నారు.

# బెట్టింగ్ యాప్‌లను ఉపేక్షించేది లేదు..

### అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

### కాటారంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించిన మంత్రి

### పోలీసు అధికారులకు మంత్రి అభినందనలు

**కాటారం, మార్చి 30, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలు, బెట్టింగ్ యాప్‌లను ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం కాటారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాత సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతను పెడదోవ పట్టిస్తున్న మాదకద్రవ్యాలు, బెట్టింగ్ యాప్‌ల నియంత్రణపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాలను ప్రోత్సహించే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేదిలేదన్నారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రభుత్వపరంగానే కాకుండా ప్రజల పరంగా తమవంతు బాధ్యత పోషించాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల అనేక మంది మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారన్నారు. బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేయడంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. బెట్టింగ్ యాప్‌ల చేతిలో బలికావద్దని, పోలీస్, ఇతరత్రా శాఖల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని నియోజకవర్గంలోని పోతారంలో ఓవ్యక్తి బెట్టింగ్ యాప్ భారినపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తీవ్రంగా కలచివేసిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు మరో కుటుంబంలో జరుగకుండా చర్యలు తీసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. మాదకద్రవ్యాలను ఉపేక్షించబోమని వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్న కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను ఇట్టే శోధించవచ్చని, మంథనిలో గట్టు వామన్‌రావు దంపతుల హత్య జరిగినప్పుడు సరైన ఆధారాలు లేకపోవడంతో అనేక మంది నిందితులు తప్పించుకున్నారని మంత్రి అన్నారు. ఇసుక లారీల ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని, లేకపోతే పోలీసులు, రవాణా వాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంద న్నారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం ఇసుక రవాణా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. ఈప్రాంతంలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం జరుగుతుందని అన్నారు. సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేయడ పట్ల ఎస్పీ కిరణ్ ఖరే, డిఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, సీఐ ఈ.నాగార్జున రావు, ఎస్సై మ్యాక అభినవ్‌లను మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్ కుమార్, నరేష్, పవన్, తమాషా రెడ్డి, రమేష్, గీతా రాథోడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో ఎఐ టెక్నాలజీ

### ప్రయోగాత్మకంగా రెండు కార్యాలయాల్లో అమలు

**హైదరాబాద్, మార్చి 30,ప్రభాతవార్త:** దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఏఐని వినియోగించనుంది. ఇదే కాకుండా రిజిస్ట్రేషన్ కోసం ముందస్తు స్లాట్ నమోదు విధానాన్ని తొలిసారిగా రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. మొదటగా పైలట్ ప్రాజెక్టు కింద చంపాపేట, సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.ఇక్కడ ఫలితాలను పరిశీలించి దశలవారీగా రాష్ట్రమంతటా విస్తరించనున్నారు.చంపాపేట, సరూర్‌నగర్ కార్యాలయాల పరిధిలోకి వచ్చే ప్రాంతాలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం మార్చి 29న ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ కోసం మాన్యువల్ పద్ధతిలో కాకుండా ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకుంటే ఏ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందనే అంశాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిర్ణయిస్తుంది.ఒక్కసారి స్లాట్ నమోదైన తర్వాత తిరస్కరించే అవకాశాలు లేకపోవడం వల్ల లంచాల దందా చాలా వరకు తగ్గుతుందని ఉన్నతాధి .కారులు భావిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖలో చాలా ప్రాంతాల్లో అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నందున దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈ నూతన సాంకేతిక విధానాన్ని వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఏదైనా స్థిరాస్తి రిజిస్ట్రేషన్ చేసుకునే ముందు ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఆ వెంటనే వినియోగదారుల మొబైల్ ఫోన్‌కు సమాచారం వస్తుంది. దానిలో చంపాపేటలోనా, సరూర్‌నగర్‌లోనా ఎక్కడికెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలనే సమాచారం ఉంటుంది.ఈ రెండు కార్యాలయాల్లో ఎక్కడ తక్కువ రద్దీ ఉంటుందో అంచనా వేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగదారులను అక్కడికి పంపించేలా సమన్వయం చేస్తుంది. ఆటోమేటిక్ పద్ధతిలో రద్దీలేని కార్యాలయంలో లావాదేవీ కేటాయింపు చేసే విధానం దేశంలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమమని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.ఏ లావాదేవీ కోసం ఎవరు? ఎప్పుడు? వస్తారనే సమాచారాన్ని ముందస్తుగా ఆయా ప్రాంతాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమాచారం ఇవ్వరు. రిజిస్ట్రేషన్ అయ్యేందుకు నిర్దేశించిన తేదీన, ఆ సమయానికి ఏఐ ఆధారిత సాంకేతికతతో ఆ కార్యాలయానికి సమాచారం వెళుతుంది. ఈ ప్రక్రియను ఏఐ సాంకేతికతతో వాడనున్నారు కనీసం 15 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ పూర్తయ్యేందుకు కొత్త పద్ధతిలో సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. స్లాట్‌నమోదు ప్రక్రియ చేసుకునే సమయంలోనే డాక్యుమెంట్లలో ఏవైనా సమస్యలు, లోపాలు, ఆధారాలు,లింక్ డాక్యుమెంట్లు లేకపోతే సంబంధిత వివరాలను ఏఐ గుర్తించే అవకాశం ఉంది.ఏఐ ఆధారిత స్లాట్ రిజిస్ట్రేషన్ విధానంలో పలు కొత్త అంశాలను ప్రభుత్వం అమల్లోకి తీసుకురానుంది. డబుల్ రిజిస్ట్రేషన్లను స్లాట్ సమయంలోనే గుర్తించే విధానాన్ని ఏఐ ద్వారా చేపట్టనున్నారు. చెరువులు, కుంటలు, నాలాల పరిధిలోని బఫర్ జోన్లు, ఎఫ్టీఎల్‌ల పరిధిలోకి వచ్చే సర్వే నంబర్లు, నిషేధిత జాబితాలోనివి రిజిస్ట్రేషన్ కాకుండా కట్టడి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.సరూర్‌నగర్,చంపాపేట ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ల పరిధిని విలీనం చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ కింది ప్రాంతాలకు సంబంధించిన స్థిరాస్తి రిజిస్ట్రేషన్లను ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దేనికైనా ఒకదానికి కేటాయిస్తారు.సరూర్‌నగర్ లింగోజిగూడ, గడ్డిఅన్నారం,బహదూర్‌పుర,మన్సూరాబాద్,తుమ్మబౌలీతో పాటు సరూర్‌నగర్ మండలంలోని గ్రామాలు. బాలాపూర్, కొత్తపేట, రేణకాపూర్, వెంకటపూర్, మామిడిపల్లి, కురుమల్‌గూడ, జల్ పల్లి, పాంపాయకు మంధన్, నాదర్‌గుల్‌తోపాటు జలాపూర్ మండలంలోని గ్రామాలకు వర్తిస్తుంది.

# అప్పుల బాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** దిగుబడులు రాకపోగా, వ్యవసాయం నిమిత్తం చేసిన అప్పులు తీరే మార్గం కనిపించక రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా దేగామ గ్రామానికి చెందిన విఠల్ (54) తనకున్న మూడెకరాల్లో పత్తి వేశారు. వ్యవసాయానికి పెట్టుబడుల నిమిత్తం బ్యాంకులో, ప్రైవేటుగా కలిపి మొత్తం రూ.5 లక్షల అప్పుచేశారు.

ఏటా పంటల దిగుబడి తగ్గిపోతుండగా, మిగిలిన వాటికి గిట్టుబాటు ధరలు రాకపోవడంతో, అప్పుల భారం పెరిగినా, రుణ మాఫీ అవుతుందని భావించారు. సర్కారు బ్యాంకు రుణం మాఫీ చేస్తుందని ఆశపడ్డారు. అయితే రుణాలకు మాఫీకాక దిగులుతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అలాగే భూపాలపల్లి జిల్లా గంగారం గ్రామానికి చెందిన రైతు చల్ల రవీందర్ (43) రెండు ఎకరాల భూమితో పాటు, మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరి సాగు చేశారు.

రూ.10 లక్షల వరకు అప్పు అయ్యింది. ఈ అప్పును తీర్చే మార్గం లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఇడి వినోద్ తొలగింపు

**హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త:** దళితబంధు పథకం అమలు చేసే విషయంలో ఎస్సీ కార్పొరేషన్ ఇడిని బాధ్యతల నుండి ప్రభుత్వం తొలగించింది. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వినోద్‌ను పక్కనపెట్టి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి పవన్‌కుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. దళితుల అభ్యున్నతే లక్ష్యంగా గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకంలో భాగంగా హుజూరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి అక్కడ అమలు చేసింది. ఇందులో భాంగా 18 వేల మందికి రూ.10 లక్షల చొప్పున ఎంపిక చేసిన లబ్దిదారుల ఖాతాల్లో జమచేశారు. వీరిలో అత్యధికులు యూనిట్లు స్థాపించుకోగా, కొంతమంది ఖాతాల్లోని నిధులు డ్రా చేసుకుంటున్న క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో 7,634 మందికి చెందిన రూ.281.84 కోట్లు బ్యాంకుల్లోనే ఉండిపోయాయి. ఎన్నికల అనంతరం నిధుల విడుదలపై అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై చర్యలు తీసుకున్నారు.



## వాట్సాప్ ఇ మెయిల్స్‌పైనా ఐటి నిఘా!


**న్యూఢిల్లీ, మార్చి 30:** కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కొత్తకొత్త నిబంధనలు అమలుకు వస్తున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి ఆదాయపుపనునశాఖ అధికారులు ప్రజలకు సంబంధించిన డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారాలైన వాట్సాప్, టెలిగ్రామ్ ఇమెయిల్ అకౌంట్లపైనా నిఘా పెడుతున్నారు. ఆదాయపు పన్ను చట్టం 2025 నిబంధనలప్రకారం ప్రజలకు చెందిన ఈ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారాల ఖాతాలపై ప్రభుత్వం డేగ కన్నువేసి అక్రమ ఆర్థిక లావాదేవీల ఆటకట్టించనున్నది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న లోక్‌సభలో ఈ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చిందో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మార్చి 27న సభ్యులకు వివరించారు. ఈ చట్టంప్రకారం లెక్కల్లోచూపించని నగదు, చట్టవ్యతిరేకకార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ప్రభుత్వానికి అనుమతి ఉం టుంది. పాతచట్టంలోని అన్ని నిబందనలు కొత్తచట్టంలోకూడా ఉంటు న్నప్పటికీ భాషను సరళతరంచేయడం కొత్తచట్టంప్రధానలక్ష్యమని సీతా రామన్ తెలిపారు. డిజిటల్‌ఖాతాల్లో లభించే సాక్ష్యాలను పన్ను ఎగవేత నిరూపణకు సాక్ష్యాలుగా అధికారులు కోర్టుల్లో సమర్పించడానికి అవకాశం ఉంటుంది. ఇటీవల మొబైల్‌ఫోన్లలో ఎన్‌క్రిప్ట్ అయిన మెసేజ్‌లు రూ.250 కోట్ల లెక్కల్లోచూపనిధనం వెలికి తీసాయి. వాట్సాప్ మెసేజ్‌ద్వారా క్రిప్టో ఆస్తుల గుర్తింపుజరిగింది. రూ.200 కోట్ల లెక్కల్లోచూపని ధనం వెలికితీతకు వాట్సాప్ కమ్యూనికేషన్ తోడ్పడిందని నిర్మల అన్నారు. గూగుల్‌మ్యాప్స్ హిస్ట రీ సాయంతో నల్లధనాన్ని దాచేందుకు తరచూ సందర్శించిన ప్రదేశాలను గుర్తించడం జరిగినట్లు వెల్లడించారు. బినామా ఆస్తుల యజమానిని నిర్ధారించేందుకు టెలిగ్రామ్ ఖాతాలను విశ్లేషించామని మంత్రి వివరించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్

## స్థానికంగా ఉన్నవారికి మాత్రమే బాలామృతం

**హైదరాబాద్, మార్చి 30,ప్రభాతవార్త:** తెలంగాణలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ సమస్యను సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా చేపట్టిన లబ్ధిదారుల ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియ సత్ఫలితాలు ఇస్తోందని అధికారులు అంటున్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, బాలింతలు, గర్భిణులకు కూడా పౌష్టికాహారం అందిస్తున్నారు. లబ్ధిదారులకు అందించే బాలామృతం వంటి వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.దీంతో పాటు ముఖ గుర్తింపును కూడా చేపడుతున్నారు. ఈ యాప్‌ప్రక్రియలో భాగంగా వారి ఫొటో, ఆధార్ కార్డు నెంబరు, మొబైల్ నెంబర్ నమోదు చేస్తున్నారు. వెంటనే లబ్ధిదారుడి సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేస్తే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. అంగన్ వాడీకేంద్రాల్లో సేవలను మరింత పారదర్శకంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రోజూ పౌష్టికాహారంలో భాగంగా బియ్యం, నూనె, పప్పు, గుడ్డు, ఆకుకూరలు, బాలామృతం, కుర్‌కురే వంటివి అందిస్తున్నారు. అమలు చేస్తున్న ఫేస్‌రిగ్నైజేషన్ హాజరు ప్రక్రియతో సరకులు పక్కదారి పట్టకుండా ఉంటుంది.నేరుగా లబ్ధిదారులకే అందే అవకాశం ఉంటుంది. స్థానికంగా ఉండని లబ్ధిదారులకి అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు తీసుకునే అవకాశం ఉండదు. పిల్లలు పెరుగుతున్న సమయంలో వారికి సరైన పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం చాలా ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇదే ఉద్దేశంతో చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తోంది. ఇందుకు కోసం ప్రత్యేకంగా బాలామృతం పంపిణీ చేస్తోంది. అవగాహన లోపంతో కొందరు సరైన మోతాదులో పిల్లలకు అందించక పోవడం, మరికొంతమంది దీన్ని వినియోగించు కోవడం లేదు.

ఉమ్మడి వికారాబాద్, మెదక్ జిల్లాలోని అంగన్ వాడీలో నమోదైన చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న చిన్నారులకు ప్రత్యేకంగా పోషక విలువలు ఉండే బాలామృతం ఇస్తున్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్ అందిస్తూ సాధారణ బరువుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. చిన్నారులకు బాలామృతం తినిపిస్తే వారి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఇప్పటికే చాలా మందికి అవగాహన కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. మూడేళ్లలోపు పిల్లలకు అయితే తప్పనిసరిగా బాలామృతం తినిపించాలని తల్లులకు సూచిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బాలామృతాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. బరువు తుక్కువ ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్‌ను అందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. బాలామృతంపై అవగాహన లోపంతో బాలామృతాన్ని సరైన పద్ధతిలో చాలా మంది వినియోగించుకోవడం లేదు.100 గ్రా. బాలామృతంలో 414 కిలో కేలరీల శక్తి, 11 గ్రా. ప్రోటీన్లు ఉండగా 167 మి.గ్రా. కాల్షియం, 3.1 మి.గ్రా. ఐరన్, 2.5 మి.గ్రా. విటమిన్ ఏ, 0.3 విటమిన్ బి1, 0.2 మి.గ్రా. విటమిన్ బి2, 0.5 మి.గ్రా విటమిన్ సీ, 7.1 మి.గ్రా పోలిక్ యాసిడ్ ఉంటాయి. వీటితో పిల్లలకు సరైన ఆహారం అంది, వారిని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ విషయమై విడతల వారీగా శాఖాపరంగా శిక్షణను ఇచ్చారు. ఇప్పటికే సీడీపీవోలకు, సూపర్ వైజర్లకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి పూర్తి చేశారు. అంతా బాగానే ఉన్నా పోషణ్ అభియాన్, పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ లాంటి యాప్‌లతో పాటు తాజాగా ముఖ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతోపాటు ప్రతి ప్రక్రియ ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉంది. ఈ సందర్భంలో సామర్థం తక్కువ కలిగిన మొబైల్ సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు అంగన్‌వాడీలు చెబుతున్నారు.



## చివరి బంతివరకూ ఉత్కంఠభరితంగా మ్యాచ్


### ఆరుపరుగుల తేడాతో సీఎస్కేపై రాజస్థాన్ రాయల్స్ విక్టరీ

**గువాహతి, మార్చి 30:** ఐపిఎల్ 2025 సీజన్‌లో 11వ మ్యాచ్‌గాజరిగిన చెన్నై సూపర్‌కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ చివరి బంతివరకూ ఉత్కంఠభరితంగా సాగింది. చిట్టచివరి బంతిలో 6 పరుగులు అవసరం కాగా చెన్నై సూపర్‌కింగ్స్ చేతులెత్తేసింది. దీనితో చెన్నై ఆరుపరుగుల తేడాతో గెలిచింది. చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ శ్రమ మొత్తం వృధా అయింది. చెన్నైటీమ్‌లో గైక్వాడ్‌టాప్ స్కోరరుగా నిలిచి అద్భుతంగా ఆడాడు. 44 బంతుల్లో 63 పరుగులు చేసి అర్ధశతకంతోమెరిపించాడు. చివరిలో ఎంఎస్‌ధోని ఒక ఫోర్, ఒక సిక్స్‌కొట్టి స్టేడియంలోని ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపాడు. రాజస్థాన్ స్పిన్నర్ తీక్షణ హసరంగ స్పిన్ దెబ్బకు చెన్నై టాప్ బ్యాటర్లు మొత్తం చేతులెత్తేసారు. హసరంగ తన నాలుగు ఓవర్లలో 34 పరుగులు ఇచ్చి 4 కీలక వికెట్లు తీసాడు. తొలుత బ్యాటింగ్‌చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులుచేసింది. 182 పరుగుల లక్ష్యఛేదనలో బరిలోకి దిగినచెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 176 పరుగులు మాత్రమే చేయగలిగింది. చెన్నై ఓపెనర్లు రచిన్‌రవీంద్రడకౌట్ అయ్యాడు. మరో ఓపెనర్ రాహుల్‌త్రిపాఠి మరోసారి నిరాశపరిచాడు. ఈ సీజన్‌లో ఆడిన మొదటి రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ఆకట్టుకోని త్రిపాఠి ఈ మ్యాచ్‌లో 21 పరుగులుచేసి ఔట్ అయ్యాడు. మొదట బ్యాటింగ్‌చేసిన రాజస్థాన్ 181 పరుగులుచేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన నితీష్‌రాణా అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. నితీష్ కేవలం 36 బంతుల్లో 81 పరుగులుచేసాడు. ఇందులో ఐదు భారీ సిక్సులతోపాటు 10 ఫోర్లు బాదాడు. నితీష్‌కు తోడుగా రియాన్‌పరాగ్ రెండుఫోర్లు రెండు సిక్స్‌లతో 37 పరుగులుచేసాడు. హెట్మెయిర్ ఒక సిక్స్ ఒక ఫోర్‌తో 19 పరుగులు జోడించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులుచేసింది. రాజస్థాన్ ఓపెనర్లు యశస్విజైస్వాల్ ఐదు,సంజూశాంసన్ 21 పరుగులచేసి క్రీజు వీడారు. వన్‌డౌన్‌లో వచ్చిననితీష్ చెలరేగి ఆడటంతో టీమ్ భారీ స్కోరు సాధించింది. మిడిల్‌ఆర్డర్‌లో వచ్చిన ధృవ్ జురేల్ మూడు, హసరంగా నాలుగు తక్కువపరుగులకే ఔట్ అయ్యారు.

# శాస్త్రోక్తంగా ప్రారంభమైన శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

### మొదటిరోజు మృత్సంగ్రహణం, వాస్తుపూజతో అంకురార్పణ

### ఉగాది రోజున భద్రాద్రిలో బారులు తీరిన భక్తజనం



**భద్రాచలం, ప్రభాతవార్త :** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు.తొలుత పవిత్ర గోదావరి నది నుండి పుణ్య జలాన్ని తీర్థబిందెతో మేళతాళాల మధ్య తీసుకువచ్చారు. అదేవిధంగా శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను దేవస్థాన ఆవరణంలోని బేడా మండపానికి భక్తుల జయ జయధ్వానాల నడుమ పల్లకీలో తీసుకుని వచ్చి వేదికపై ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏప్రిల్ 6న జరిగే స్వామివారి కళ్యాణ క్రతువులో పాల్గొనే రుత్వికులకు, అర్చకులకు దీక్షా వస్త్రాలు దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి శ్రావణ్‌కుమార్ అందచేశారు.

అదేవిధంగా సాయంత్రం అనంతరం శ్రీస్వామి వారి తిరువీధి సేవలో భాగంగా ఉత్సవమూర్తులను కల్పవృక్షవాహనంపై ఆశీనులను చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ జయ ధ్వానాల నడుమ ఊరేగింపుగా తీసుకుని వెళ్ళి తాత గుడి సెంటర్‌లో ఉన్న గోవిందరాజు స్వామి గుడి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ మత్స ంగ్రహణం(పుట్ట మన్ను) సేకరించి ఆలయంలో వాస్తు పూజ,పుణ్యాహవచనం పూజా కార్యక్రమంతో అంకురార్పణ మహోత్సవాన్ని ప్రారంభించారు.

**భద్రాద్రిలో బారులు తీరిన భక్తజనం**

ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని అనేకమంది భక్తులు శ్రీస్వామి వారి దర్శనార్థం భద్రాద్రి విచ్చేసారు. వీరి రాకతో భద్రాచలం పురవీధులన్ని శ్రీరామ జయ రామ జయ జయ రామ అనేస్మరణతో మారుమ్రోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం యంత్రాంగం చర్యలు చేపట్టారు. నూతన సంవత్సరం ఎటువంటి ఆటుపోట్లు ఎదురవ్వకుండా సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విరాజిల్లాలని శ్రీసీతారామచంద్రస్వామి వారిని వేడుకున్నారు. కాగా అర్చకస్వాములు ఉదయం ఉగాది ప్రసాద వితరణ గావించారు. కాగా ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం ఎదుర్కోళ్ళు ఉత్సవం,ఏప్రిల్ 6 న శ్రీరామనవమి,ఏప్రిల్ 7 న పట్టాభిషేకం ఉత్సవాలను ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా యావన్మంది భక్త జన సందోహం నడుమ మిథిలా ప్రాంగణంలో చేయనున్నారు. ఈసారి సుమారు లక్షమంది వరకు భక్తులు రామయ్య కల్యాణానికి రానున్నారనే అంచనాతో అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు.

**ఈ యేడాది సీతమ్మ వారి ఆదాయమే ఎక్కువ**

**ఆసక్తిగా ఆలకించిన భక్తజనం**

విశ్వావసు నామ నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో పం చాంగ శ్రవణ క్రతువు ఆదివారం సాయంత్రం నేత్రపర్వంగా సాగింది. క్రతువులో భాగంగా శ్రీస్వామి వారి, అమ్మవారి ఆదాయ, వ్యయం లెక్కలను దేవస్థాన స్థానాచార్యులు కే.ఈ.స్థలశాయి లెక్కించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు వివరిస్తూ ... రామయ్య ఆదాయం 08,వ్యయం 02,రాజపూజ్యం 07,అవమానం 03 అని వెల్లడించారు. అదేవిధంగా సీతమ్మవారి ఆదాయం 14, వ్యయం 02, రాజపూజ్యం 06,అవమానం 06 అని పేర్కొన్నారు. దేవస్థానం ఆవరణంలోని బేడామండపంలో జరిగిన ఈ క్రతువును వీక్షించేందుకు, ఆలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆసక్తిగా పాల్గొన్నారు.

# ఉగాది పర్వదినాన లాంఛనంగా ప్రారంభమైన జగ్గారెడ్డి సినిమా ఆఫీస్..

మాస్ లీడర్, జననేత జగ్గారెడ్డి సినిమా ఆఫీస్ లాంఛనంగా ప్రారంభించారు ఆయన కుమార్తె జయలక్ష్మీ ్మ రెడ్డి , భరత్ సాయి రెడ్డి. ఉగాది పర్వది నాన ప్రారంభమైన ఈ సినిమా ఆఫీస్‌లో జరిగిన పూజలో పాల్గొన్నారు జగ్గారెడ్డి. విద్యార్థి నాయకుడిగా ప్రయాణం మొదలు పెట్టి అంచెలంచెలుగా రాష్ట్రనాయకుడిగా ఎదిగిన జగ్గారెడ్డి రాజకీయాల్లో అందరికీ ఆదర్శం. ఆయన సినిమా రంగంలో అడుగుపెడుతన్న కథలో టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. జగ్గారెడ్డి పేరుతో నిర్మాణం కానున్న ఈ మూవీ ప్రీపొడక్షన్ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. త్వరలో ప్రారంభంకానున్న జగ్గారెడ్డి సినిమా ఆఫీస్ ఉగాది



పర్వదినాన ఆరంభిం చారు. ఈ సందర్భంగా మూవీ గ్లింప్స్ ని రిలీజ్ చేసింది టీం. మోస్ట్ పవర్ ప్యాకడ్ మాస్ లీడర్‌గా గ్లింప్స్‌లో కనిపించారు జగ్గారెడ్డి. ఈ సందర్భంగా మాస్ లీడర్ జగ్గారెడ్డి మాట్లాడుతూ దర్శకుడు రామానుజం చూపించిన జగ్గారెడ్డి వార్ ఆఫ్ లవ్ పోస్టర్‌కి మొదట ఆకర్షితుడునయ్యాను. ఆతర్వాత ఆయన చెప్పిన కథ నాకు నచ్చింది . అందులో నా పాత్ర నాదే. ఎవరో రాసిన మాటలు పాత్రలుగా నేను ఉండను. అంతా ఒరిజినల్, మీకు తెలిసిన జెగ్గారెడ్డిని తెరమీద చూస్తారు. విద్యార్థి నాయకుడిగా మొదలైన నా ప్రయాణం రాష్ట్ర నాయకుడి వరకూ వచ్చిందంటే అందులో చాలా మలుపులున్నాయి. కుట్రలు, కుతంత్రాలు, హాత్యా ప్రయత్నాలు దాటుకోని ఇంతవరకూ చేరిన నాప్రయాణం ఈ కథలో కనపడుతుంది. సినిమా ఇండస్ట్రీలో కూడా నాప్రయాణం మొదలైంది. దీనికి అడ్డాగా ఈ ఆఫీస్ ఉంటుంది. ఇది జగ్గారెడ్డి అడ్డా అనుకోండి.. అన్నారు.. దర్శకుడు వడ్డి రామానుజం మాట్లాడుతూ సంగారెడ్డికి వెళ్లి జగ్గారెడ్డి గారి గురించి తెలుసుకున్నాను. ఇందులో జగ్గారెడ్డి గారి పాత్రతో పాటు మంచి ప్రేమకథకూడా ఉంటుంది. జగ్గారెడ్డి గారు ఎంత మాస్ లీడరో అందరికీ తెలుసు. ఆయన జీవితంలోని ముఖ్య సంఘటనలు ఈ సినిమాలోకనిపిస్తాయి. త్వరలోనే ఈ సినిమా ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు నడుస్తున్నాయి. అన్నారు. నిర్మాత జయలక్ష్మీ ్మ రెడ్డి మాట్లాడుతూ మా నాన్నగారు జగ్గారెడ్డి జీవితంలో కొన్ని సంఘట నలు విన్నాను. వాటిని తెరమీద చూడబోతున్నాం అనే ఆలోచనే

# చిరంజీవి, అనిల్ రావిపూడి చిత్రం ఘనంగా ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి మరోసారి ఎంటర్టైన్మెంట్‌ని రీడిఫైన్ చేయడానికి స్టేజ్ సెట్ అయ్యింది. ఇండియన్ సినిమాలో లెజండరీ లెగసీకి పేరుగాంచిన చిరంజీవి, యాక్షన్‌ప్యాక్డ్ ఎంటర్టైనర్ల నుంచి ఎమోషనల్ డ్రామాల వరకు దాదాపు ప్రతి జానర్‌లో అద్భుతమైన విజయాలు సాధించారు. దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో హిట్స్, లెక్కలేనన్ని అవార్డులు, తరాలను దాటిన అభిమానులని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు, మెగాస్టార్ అంచనాలను మరింత పెంచే ఎక్స యిటింగ్ ప్రాజెక్టుల కోసం సిద్ధమవుతున్నారు. సోషియోఫాంటసీ విశ్వంభర విడుదలకు రెడీ అవుతుండగా, మెగాస్టార్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడితో కలిసి ఒక ఎక్స యిటింగ్ న్యూ ఎంటర్టైనర్ కోసం చేతులు కలిపారు. 8 చిత్రాలకు 8 బ్లాక్ బస్టర్లతో అద్భుతమైన విజయ పరంపరను కొనసాగించిన అనిల్ రావిపూడి లేటెస్ట్ రిలీజ్ సంక్రాంతికి వస్తున్నాం భారీ విజయాన్ని సాధించడమే కాకుండా, రికార్డులను బద్దలు కొట్టి, 300 కోట్ల గ్రాస్‌ను దాటింది.

మోస్ట్ ఎవైటెడ్ 157ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు.మెగా 157 ప్రాజెక్ట్‌ను ఈరోజు ఉగాది పండుగ సందర్భంగా అధికారికంగా పూజా కార్యక్రమంతో లాంచ్ చేశారు. ఇది చిత్రానికి గొప్ప ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈ వేడుకకు విక్టరీ వెంకటేష్ క్లాప్ ఇచ్చారు, అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. లెజెండరీ దర్శకుడు కె. రాఘవేంద్రరావు ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. స్టార్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగ వంశీ, యువి క్రియేషన్స్ విక్రమ్, దర్శకుడు వశిష్ట, శ్రీకాంత్ ఓదెల, బాబీ, శివ నిర్వాణ, వంశీ పైడిపల్లి, మైత్రి నవీన్ రవి, శిరీష్, అశ్విని దత్, రామ్ ఆచంట, శరత్ మరార్, విజయేంద్ర ప్రసాద్, కెఎస్ రామారావు, కెఎల్ నారాయణ, సురేష్ బాబు, వెంకట సతీష్ కిలారు, జెమిని కిరణ్, చుక్కపల్లి అవినాష్, జెమిని కిరణ్, నిమకాయల ప్రసాద్ వంటి చిత్ర పరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

హిలేరియస్ కామెడీ, ఫ్యామిలీ బేస్డ్ బ్లాక్ బస్టర్‌లను రూపొందించే అనిల్ రావిపూడి, హ్యూమర్ అండ్ హై ఎనర్జీతో కూడిన యాక్షన్ కంప్లీట్ ఎంటర్ టైనర్‌ని అందించడానికి సిద్ధమైయ్యారు.

చిరంజీవిని ఫ్రెష్ అండ్ డైనమిక్ అవతార్‌లో ప్రెజెంట్ చేసే అద్భుతమైన స్క్రీన్‌ప్లేని స్వయంగా రాశారు అనిల్ రావిపూడి. నవ్వులు, భావోద్వేగాలను బ్లెండ్ చేసి మెమరబుల్ ఎంటర్ టైనర్ ని అందించబోతున్నారు. ఇందులో శంకర్ వరప్రసాద్ అనేది మెగాస్టార్ చిరంజీవి పాత్ర పేరు.

ఈ ప్రాజెక్ట్ కోసం సంక్రాంతికి వస్తున్నాం విజయం వెనుక ఉన్న ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ రైటర్స్. ఎస్ కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది.

తారాగణం: మెగాస్టార్ చిరంజీవి. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, నిర్మాతలు : సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్, సమర్పణ : అర్చన, సంగీతం : భీమ్స్ సిసిరోలియో, డీవోపీ : సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్, ఎడిటర్ : తమ్మిరాజు, రైటర్స్: ఎస్ కృష్ణ, జి. ఆది నారాయణ: ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ,సూపర్‌వైజర్ : నరేంద్ర లోగిసా, లైన్ ప్రొడ్యూసర్ : నవీన్ గారపాటి, ఎడిషనల్ డైలాగ్స్: అజ్జు మహంకాళి, తిరుమల నాగ్, చీఫ్ కో డైరెక్టర్: సత్యం బెల్లంకొండ, పీఆర్వో: వంశీ శేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.

## విజయ్ సేతుపతి, పూరి, చార్మి మోస్ట్ ప్రెస్టీజియస్
# పాన్ ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ మునుపెన్నడూ చూడని అద్భుతమైన అనుభూతిని అందించబోతోంది. యూనిక్ స్టోరీ, గ్రిప్పింగ్ కథనంతో పూరి జగన్నాథ్ తనదైన శైలిలో తెరకెక్కించనున్న ఈ చిత్రం, విజయ్ సేతుపతి చరిస్మాటిక్ ప్రెజెన్స్ సరికొత్త అనుభూతిని అందించనుంది. పూరి జగన్నాథ్, చార్మికౌర్ పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో ఈ అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రాన్ని ఘనంగా నిర్మించనున్నారు. ఈరోజు, తెలుగువారి ప్రత్యేకమైన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ చేశారు. ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్ ఫుల్ కథని రాశారు. ఇందులో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్, డిఫరెంట్ అవతార్‌లో చూడబోతున్నారు ఆడియన్స్. ఈ మూవీ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్, చార్మికౌర్ త్రయం ఆనందం, ఉత్సాహం సినిమా పట్ల వారి ఎక్స యిట్మెంట్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభమవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.



నేహా శర్మ

# మంగపతికి మెగా ప్రశంసలు



హీరో నాని నిర్మాణంలో వచ్చిన కోర్టు సినిమా తెలుగు సినిమా ప్రియులకు ఒక విభిన్నమైన అనుభవాన్ని అందించింది. జగదీష్ అనే కొత్త కుర్రాడి దర్శకత్వంలో రూపొందించిన ఈ సినిమాలో ప్రియదర్శి, రోషన్, శ్రీదేవి కీలక పాత్రలలో కనిపించారు. అలాగే సీనియర్ నటుడు శివాజీ మరో కీలక పాత్రలో మెరిశారు. ఈ చిత్రంలో శివాజీ పోషించిన మంగపతి పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచి, ఆకట్టుకుంది. నెగిటివ్ షేడ్స్ ఉన్న ఈ పాత్రలో శివాజీ కేవలం నటించలేదు ఆ పాత్రలో జీవించారు. తన కుటుంబానికి చెందిన ఒక అమ్మాయి జోలికి వచ్చాడని చందు అనే కుర్రాడిని ఇబ్బంది పెట్టే ఈ పాత్రలో ఆయన చూపించిన తీవ్రత, ఫెరోషియస్ నటన అందరి మనసులనూ ఆకర్షించింది. ఈ పాత్ర ద్వారా శివాజీ తన నటనా ప్రతిభకు మరోసారి తార్కాణం చాటారు. నిజానికి మంగపతి పాత్ర ఒక సాధారణ విలన్ పాత్ర కాదు అది ఒక సంక్లిష్టమైన, మల్టీఫేస్డ్ ఎమోషన్స్‌తో కూడిన పాత్ర. శివాజీ ఈ పాత్రకు ప్రాణం పోశారు. ఆయన చూపుల్లోని కోపం, మాటల్లోని ఆధిపత్యం, చేష్టల్లోని దౌర్జన్యం ఇవన్నీ కలిసి మంగపతిని తెరపై ఒక శక్తివంతమైన పాత్రగా నిలబెట్టాయి. చందుని ఇబ్బంది పెట్టే సన్నివేశాల్లో ఆయన చూపించిన నటన ప్రేక్షకులను ఒక్కసారిగా ఆ పాత్రను ద్వేషించేలా, అదే సమయంలో ఆ నటనను మెచ్చుకునేలా చేసింది. అది శివాజీ నటనా సామర్థ్యానికి నిదర్శనం.

చిరంజీవి అభినందనల వర్షం. కోర్టు సినిమా తాజాగా చూసిన మెగాస్టార్ చిరంజీవి, శివాజీ నటనకు పూర్తిగా ఫిదా అయ్యారు. వెంటనే ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్న మెగాస్టార్ చిరంజీవి మంగపతి పాత్రలో శివాజీ చూపించిన లోతైన నటనను మెచ్చుకుంటూ, అభినందనల వర్షం కురిపించారు. నీవు ఈ పాత్రలో నటించలేదు, జీవించావు. ఇలాంటి పాత్రలు మరిన్ని చేయాలి, అంటూ చిరంజీవి శివాజీని పొగడ్తలతో ముంచెత్తారు. ఈ ఇద్దరూ కలిసి గతంలో ఇంద్ర సినిమాలో నటించిన సంగతి అందరికీ తెలిసిందే.

# ఏప్రిల్ 18న 'శివ శంభో' విడుదల



అనంత ఆర్ట్స్ పతాకంపై బొజ్జ రాజగోపాల్, సుగుణ దోరవేటి నిర్మించిన సంగీత సాహిత్య విలువలు కలిగిన భక్తి ప్రధానమైన చిత్రం "శివ శంభో" ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ప్రకటించారు. నర్సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం భారతీయ కళలైన సంగీతం సాహిత్యం నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన సందేశాత్మక చిత్రమని ఇటువంటి చిత్రాలను ఉత్తమ అభిరుచి గల ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్లందరికీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం తెలంగాణ ప్రజలకు అన్నిరకాల శుభాలను ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు. చిత్ర నిర్మాతల్లో ఒకరు, రచయిత, సంగీత దర్శకులు దోరవేటి మాట్లాడుతూ ఉత్తమాభిరుచి గల ప్రేక్షకులు తప్పకుండా తమ చిత్రాన్ని ఆదరిస్తారన్న విశ్వాసం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బొజ్జ రాజగోపాల్, నటులు రమేశ్, బేబీ రిషిత, మేనేజర్ చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ :అనంత ఆర్ట్స్. నిర్మాతలు : బొజ్జ రాజ గోపాల్,దోరవేటి సుగుణ, శ్రీశైలం రెడ్డి, డైరెక్టర్ :నర్సింగ్ రావు, డి ఓ పి: కారె సతీశ్‌కుమార్, హీరో హీరోయిన్ :కృష్ణ ఇస్లావత్, కేశవర్ధిని బేబీ రిషిత,పాటలు మాటలు , సంగీతం: దోరవేటి, ముఖ్యపాత్రలో : తనికెళ్ళ భరణి, సుమన్, టార్జాన్, విజయ్ రంగరాజన్, చిల్లర వేణు, రామస్వామి, రజాక్, మల్లేశ్, రవిరెడ్డి, రమేష్ యాదవ్, శ్రీకర్, విగ్నేష్.

# వేసవిలో రానున్న 'ఒక బృందావనమ్'

కంటెంట్ బాగుంటే చిన్న సినిమా, పెద్ద సినిమా నూతన తారలు, క్రేజ్ ఉన్న తారలు అనే తారతమ్యాలు ఉండవు. ఈ మధ్య కాలంలో కేవలం కంటెంట్‌తోనే సూపర్‌హిట్‌గా నిలిచిన చిత్రాలు చాలా ఉన్నాయి. తాజాగా ఆ కోవలోకి చేరే చిత్రమే ఒక బృందావనమ్ నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేఖ సుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్,ఇతర సీనియర్ నటీనటులు ఈ చిత్రంలో నటించారు! బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. వినోదంతో పాటు మంచి అర్థవంతమైన సందేశాన్నికూడా ఈ చిత్రంలో జోడించాం. నిర్మాణానంతర పనులు జరుపుకుంటోన్న మా చిత్రం ఆడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే ప్రమోషన్స్‌ను కూడా మొదలుపెట్టి మీ ముందుకు ట్రైలర్‌ను తీసుకవస్తాం. తప్పకుండా కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌కు మా చిత్రం తప్పకుండా నచ్చుతుంది అన్నారు. సినిమాటోగ్రాఫర్ రాజ్ కె నల్లి, ఎడిటర్లు తమ్మిరాజు, సంతోష్ కామిరెడ్డి ప్రతి ఫ్రేమ్‌ను మెరుగుపరిచారు, సంగీత దర్శకులు సన్నీ, సాకేత్ ఆహ్లాదకరమైన సౌండ్‌ట్రాక్‌ను అందించారు. చంద్రబోస్, రామజోగ్గై శాస్త్రి, శ్యామ్ కాసర్ల, శ్రీనివాస మౌళి, కళ్యాణ్ చక్రవర్తి రాసిన సాహిత్యంతో, ఈ పాటలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి.



## యువరాణి లుక్‌లో ఆకట్టుకుంటున్న
# వైష్ణవి చైతన్య

వరుసగా అగ్ర నిర్మాణ సంస్థల్లో సినిమాలు చేస్తూ బిజీ బిజీగా గడుపుతున్న తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య. తెలుగు సినీ పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకి అవకాశాలు రావడమే పెద్ద విడ్డూరంగా భావిస్తుంటారు ప్రేక్షకులు. వాస్తవానికి అది నిజం కూడా. అందం, అభినయం ఉన్నప్పటికీ ఎందుకో చాలామంది తెలుగమ్మాయిలు హీరోయిన్లుగా రాణించలేకపోయారు. అయితే కొంతమంది తెలుగు అమ్మాయిలు కష్టపడి పనిచేసి అవకాశాలు పొందడమే కాకుండా తక్కువ సమయంలో స్టార్స్‌గా కూడా ఎదిగారు. అలాంటి అతి తక్కువ మంది హీరోయిన్లలో వైష్ణవి చైతన్య కూడా ఒకరు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కెరీర్ ప్రారంభంలో లవ్ ఇన్ 143 అవర్స్ ది సాఫ్ట్‌వేర్ డెవలపర్ అరెరె మానస మిస్సమ్మ వంటి షార్ట్ ఫిల్మ్స్‌తో నటిగా గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి... అటు తర్వాత 'అల వైకుంఠపురములో 'వరుడు కావలెను' వంటి క్రేజీ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసే అవకాశం దక్కించుకున్నారు. ఆ సినిమాల్లో చేసినవి చిన్న పాత్రలే అయినప్పటికీ వాటితో కూడా యూత్‌ను మెప్పించారు. అందువల్ల 'బేబీ' సినిమాలో వైష్ణవికి మెయిన్ హీరోయిన్ ఛాన్స్ వరించింది.

బేబీలో ఇద్దరు హీరోలు ఉన్నప్పటికీ సినిమా కథ మొత్తం హీరోయిన్ వైష్ణవి పాత్ర చుట్టూనే తిరుగుతుంది. ఆమె నటన సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచింది. ఆ సినిమా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంలో వైష్ణవి పాత్ర ఎంతో ఉంది. 'బేబీ' తో యూత్ లోనే కాదు. ఫ్యామిలీ ఆడియన్స్‌లో కూడా బోలెడంత క్రేజ్ సంపాదించుకున్నారు వైష్ణవి. ఇప్పుడు ఆమె నటిస్తున్న 'జాక్' సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇందులో ఆమె ద్విపాత్రాభినయంతో అలరించనున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్ పై అగ్ర నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. దీంతో పాటు 90 ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ వెబ్ సిరీస్‌కి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో కూడా ఆనంద దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటించనున్నారు వైష్ణవి. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ నాగవంశీ ఈ సినిమాని నిర్మించబోతున్నారు. ఇలా 2 పెద్ద బ్యానర్లలో మెయిన్ హీరోయిన్‌గా చేస్తూ బిజీగా గడుపుతున్నారు.ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో వైష్ణవి చైతన్యకి బీభత్సమైన ఫాలోయింగ్ ఉంది అనేది అందరికీ తెలిసిన విషయమే. ఆమె ఏ ఫొటో షేర్ చేసినా ఇంటర్నెట్ షేక్ అవుతూ ఉంటుంది. అలా అని అందరి హీరోయిన్లలా స్కిన్ షోని నమ్ముకుని ఫొటో షూట్లు చేయరు వైష్ణవి. ట్రెడిషనల్ వేర్లోనే ఎక్కువగా కనిపిస్తూ అందానికి సరికొత్త డెఫినిషన్ చెబుతుంటారు. ఈమెకి ఫ్యామిలీ ఆడియన్స్‌లో క్రేజ్ ఏర్పడడానికి కారణంకూడా ఇదే అనిచెప్పొచ్చు. ఇప్పుడు కూడా ఆమె ఓ స్పెషల్ ఫొటో షూట్లో పాల్గొంది. ఇందులో ఆమె యువరాణిలా మెరిసిపోతూనే.... పవర్ఫుల్‌గా కూడా కనిపిస్తున్నారు. భవిష్యత్తులో ఈమె లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లోకూడా నటించి మెప్పించే అవకాశాలు ఉన్నాయని ఈ ఫొటోలతో స్పష్టం చేసినట్లైంది.



# రంజాన్ రుచులు

## హాలీమ్



రంజాన్ మాసంలో రోజా ఉన్నవారంతా ఉపవాస దీక్ష ముగించాక, బలవర్ధక ఆహారం తీసుకుంటారు. ఇలా తీసుకునే ఆహారంలో హాలీమ్ ఒకటి. అనేక పోషకాలతో నిండిన హాలీమ్‌ను రోజా ఉన్నవారే గాక, ఇతరులు కూడా ఇష్టంగా తింటారు. మసాలా ఘాటు, డ్రై ఫ్రూట్స్‌తో ఘుమఘుమలాడే హాలీమ్‌ను ఇంట్లో ఎలా వండుకోవచ్చో చూద్దాం.

కావలసినవి: మటన్ ఖీమా ముప్పావు కేజీ, పచ్చిమిర్చి ఎనిమిది, అల్లంవెల్లుల్లి పేస్టు టేబుల్ స్పూను, పసుపు అర టేబుల్ స్పూను, దాల్చిన చెక్క రెండు ముక్క, లవంగాలు నాలుగు, యాలకులుమూడు, సోంపు టేబుల్ స్పూను,

**కావలసినవి :** మటన్ ఖీమా–ముప్పావు కేజీ, పచ్చిమర్చి–ఎనిమిది, అల్లం వెల్లుల్లి పేస్టు–టేబుల్ స్పూను, పసుపు–అర టేబుల్ స్పూను, దాల్చిన చెక్క–రెండు అంగుళాల ముక్క, లవంగాలు–నాలుగు, యాలకులు–మూడు, సోంపు–టేబుల్ స్పూను.

✦ మిరియాలు టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, గోధుమ రవ్వ అరకప్పు, మినప్పప్పు టేబుల్ స్పూను, కందిపప్పు టేబుల్ స్పూన్, పచ్చిశనగ పప్పు టేబుల్ స్పూన్, పెసరపప్పు టేబుల్ స్పూను, బియ్యం టేబుల్ స్పూను. ఆయిల్ మూడు టేబుల్ స్పూన్లు,

✦ఉల్లిపాయలు నాలుగు(సన్నగా తరుక్కోవాలి), అల్లంవెల్లుల్లి పేస్టు టేబుల్ స్పూను, కొత్తిమీర తరుగుపావుకప్పు, పుదీనా తరుగు పావు కప్పు, పచ్చిమిర్చి చీలికలురెండు, మిరియాలపొడి అర టేబుల్ స్పూను, పసుపు పావు టీస్పూను, పెరుగు ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, నెయ్యి ఆరు టేబుల్ స్పూన్లు. గార్నిషు సరిపడా,

**తయారీ:** కుకర్ గిన్నెలో మటన్ ఖీమాను శుభ్రంగా కడిగి వేయాలి. 4.

దీనిలో పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, సోంపు, మిరియాలు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు, గ్లాసు నీళ్ల పోసి కలిపి, సన్నని మంటమీద బాదారు విజిల్స్ గానివ్వాలి.

✦ మరో కుకర్ గిన్నెతీసుకుని గోధుమ రవ్వ, పప్పులు, బియ్యం వేసి శుభ్రంగా కడిగి మూడు గ్లాసులు నీళ్లపోసి నాలుగు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. ఉడికిన మటన్ ఖీమాను మిక్సీ జార్లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి.

ఊడిన పప్పులను కూడా మెత్తగా రుబ్బుకోవాలి

✦ సన్నగా తరిగిన ఉల్లిపాయ తరుగును గోల్డెన్ బ్రౌన్ కలర్లోకి వచ్చేంత వరకు వేయించాలి.

✦. ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్టు వేసి పచ్చి వాసన పోయేంత వరకు వేయించి, తరువాత కొత్తిమీర, పుదీనా తరుగు, పచ్చిమర్చి వేయాలి.

✦ ఇవనీనన వేగాక మిరియాలపొడి, పసుపు, పెరుగు ఖీమా పేస్టు, పప్పుల పేస్టు, రుచికి సరిపడా ఉప్పువేసికలపాలి. మూతపెట్టి పదిహేను నిమిషాలు ఉడికించి, నెయ్యి, డ్రైఫ్రూట్స్ వేసి సర్వ్ చేసుకోవాలి. □

# అల్లాహ్ వరాల జల్లులకు సుదినం



**రంజాన్ మాసం. ప్రపంచ దేశాల్లో భక్తి శ్రద్ధలతో కఠోర నియమనిబంధనలతో 30రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి చివరి రోజు తాము చేసిన ప్రార్థనలకు అల్లాహ్ వరాలిచ్చే పవిత్ర రోజు. నెల రోజుల పాటు దివ్యఖుర్ ఆన్‌ను పఠించి తాము తెలిసి తెలియక చేసిన తప్పులను క్షమించమని కన్నీరు మున్నీరుగా వేడుకునే దివ్య దినం రంజాన్. నెల రోజుల పాటు అల్లాహ్ ధ్యాన ముద్రలో ఉంటూ పండగ రోజు మొకరిల్లి చేతులు జోడించి వేడుకునే సుదినం.తెలుగురాష్ట్రాల్లో కుల మతాలకు అతీతంగా ఈద్‌గాహ్‌ల వద్ద శుభాకాంక్షలు తెలుపుకునే సత్ సంప్రదాయం ఉంది.నెల రోజుల దీక్షలకు అల్లాహ్ నుంచి వరాలు పొందే సుదినం.**

నెల రోజుల పాటు కఠోర నియమనిష్టలతో ఉపవాసదీక్షలు పాటించిన వారికి నేడు రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రార్థనల సందర్భంగా వారి భక్తి ప్రవర్తులకు భగవంతుడు వరాలిచ్చే సుదినం. ఏడాదిలో వచ్చే ఈ సుదినం కోసం ఎంతో నిరీక్షించిన వారికి వరాలిచ్చే సుదినం ప్రార్థనల కోసం ఈదాగాహ్‌లు ముస్తాబు చేస్తున్నారు. నిన్న రాత్రి మసీదుల్లో ముస్లిం సోదరులు లైల్‌తుల్ జాయిజా ఆచరింస్తారు. రాత్రంతా అల్లాహ్ ధ్యానంలో గడిపారు. ఈ రోజు ఉదయం ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరుపుటకు సిద్దమౌతున్నారు. కొత్త బట్టలు లేదా శుభ్రం చేసిన బట్టల్ని ధరించి కళ్ళకు సుర్‌మాను అలంకరించి, చక్కగా సుగంధ ద్రవ్యాల్ని పూసుకొని, ఒక దారి వెంట వెళుతూ మరో దారి వెంట ఇంటికి చేరటానికి ముస్లిం సోదరులు సిద్దమౌతున్నారు. నెల రోజుల పాటు నియమ నిబంధనలతో నిష్టతో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు ఈదుల్ పితర్ ప్రార్థనలు జరుపుకోనున్నారు.

**ఈదుల్ పితర్ నమాజులకు సిద్దం:** భారతదేశంలోని మూల మూలల్లో నేడు ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో రంజాన్ సందర్భంగా ఈదులు ఫితర్ నమాజ్‌ను అచరించనున్నారు. ఇందుకు ముస్లిం సోదరులు సమాయత్తమౌతున్నారు. రంజాన్ సందర్భంగా బక్రీద్ మాసంలో హాజ్‌యాత్రకు వెళ్ళలేని వారు మక్కా,మదీనాకు 'ఉమ్రా' చేయటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో పలువురు ఇక్కడ నుంచి మక్కా,మదీనాకు పయనమయ్యారు. భారత దేశం నలుమూలల నుంచే కాక ప్రపంచదేశాల నుంచి విశేష సంఖ్యలో ఉమ్రా చేయటానికి ఇటీవల కాలంలో కదలి వస్తున్నారు. షాబాన్ మాసం ముగిసిన తరువాత 'నెలవంక దర్శనంతో' రంజాన్ నెల రాత్రి వేళల్లో తరావీహ్ నమాజుల్లో దివ్యఖుర్‌ఆన్‌ను పఠించటం మొదలు పెడతారు. రంజాన్ మాసం పూర్తి అయిన తరువాత నెలవంకను చూసి తరావీహ్ నమాజుల్ని ఆపివేస్తారు. ఉదయం పండగను జరుపుకుంటారు. 30రోజుల పాటు మోమిన్ ముస్లింలు కఠోర నియమాలతో కూడిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఐదువేళల్లో తప్పని సరిగా నమాజులు ఆచరిస్తారు. సాయంత్రం మసీదుల్లో ఉపవాసదీక్షలు ముగింపు సందర్భంగా 'ఆష్ 'అనే ద్రవ పిండి పదార్థాలతో అందజేస్తారు. గతంలో ఇళ్ళ నుంచి ఉభయదారులు తయారు చేసి పంపే వారు. కానీ నేడు మసీదుల్లోనే కొంత మొత్తాన్ని ఖరారు చేసి తయారు చేసి ఉపవాసదీక్షలు పాటించే వారితో పాటు బయటి వ్యక్తులకు కూడా పంపిణి చేస్తున్నారు.



**లయల్‌తుల్ జాయజా:** రంజాన్ మాసంలోని చివరి పది రోజుల్లో ఐదు రాత్రుల్లో ఓ దివ్యరాత్రి ఉందని దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొన్నారు. ఈ రాత్రుల్ని అన్వేషిస్తూ రాత్రి జాగరణ చేయటం ఆనవాయితి. ఈ రాత్రుల్ని ఒక్కక్క మసీదుల్లో రాత్రి జాగరణ చేసారు. అర్థరాత్రి దాటిన తరువాత వేకువ జాము 3గంటలకు కన్నీరు మున్నీరుగా రోదిస్తూ అల్లాహ్ వద్ద ప్రార్థనలు చేస్తారు. రాత్రి నెలవంక దర్శనం తరువాత (పొద్దుపొడిస్తే పండగ) ఇషా నమాజు తరువాత 'లయతుల్ జాయజా' అని అంటారు. 30రోజుల పాటు ఆచరించిన నమాజులకు ఉపవాసదీక్షలకు ఫలాన్ని ఇచ్చే రాత్రి అంటారు. ఈ రాత్రంతా మేల్కొని వేకువ జామున ఉదయం ఆచరించే నమాజును ఆచరించారు.

**ఒక వ్యక్తికి ఫిత్రా రూ.100లు:** రంజాన్ సందర్భంగా ఆచరించే ముఖ్యమైన సూత్రాల్లో 'ఫిత్రా' ఒకటి. కుటుంబంలో బతికున్న ప్రతి ఒక్కరి పేర కనీసం రూ.100లు ఫిత్రా చెల్లించాల్సి ఉంది. దీనిని పేదలకు దానం చేస్తారు. నేటి ధరలననుసరించి ఈ మొత్తాన్ని ఖరారు చేసినట్లు జామియా మస్‌జిద్ మౌలాన రేహాన్ ప్రకటించారు. అరబ్ దేశాల్లో ఆదివారం ఈదుల్ పితర్ నమాజను ఆచరించారు.

**- ఎస్.రహంతుల్లా,**

## షీర్ ఖుర్మా

**కావలసినవి:** 4 కప్పులు (960 మి.లీ) పాలు (పూర్తి పాలు/పూర్తి కొవ్వు)1 కప్పు (50 గ్రాములు) సన్నని వెర్మిసెల్లి (ఫైన్ సెవియన్)1/4 కప్పు (50 గ్రాములు) ఆర్గానిక్ షుగర్ (లేదా 3 నుండి 4 టేబుల్ స్పూన్లు కండెన్స్ మిల్క్) (రుచికి అనుగుణంగా సర్దుబాటు చేయండి)8 ఖర్జూరాలు (సన్నగా తరిగినవి)2 టేబుల్ స్పూన్లు చిరోంజీ విత్తనాలు 20 గ్రాములు బాదం 20 గ్రాములు జీడిపప్పు20 (10 గ్రాములు) పిస్తాపప్పులు 3 టేబుల్ స్పూన్లు (45 మి.లీ) నెయ్యి (లేదా అవసరమైనంత)1/2 టీస్పూన్ ఏలకుల పొడి1 టీస్పూన్ (5 మి.లీ) తినదగిన రోజ్ వాటర్ 1/4 నుండి 1/2 కప్పు తియ్యని మాఅ (ఖోయా తియ్యగా ఉపయోగిస్తే, చక్కెర తగ్గించండి)



**తయారీ :** ●. 2 కప్పుల నీటిని మరిగించి, సగం నీటిని మరొక చిన్న గిన్నెలో పోయాలి. ఒక గిన్నెలో బాదం, పిస్తా మరియు జీడిపప్పులను నానబెట్టండి. మరొక గిన్నెలో చిరోంజీ గింజలను నానబెట్టండి.● 30 నిమిషాల తర్వాత, వేడి నీటిని తీసివేసి, రెండు గిన్నెలలో చల్లటి నీటిని పోయాలి. ● ఈలోగా ఖర్జూరాలను చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోండి. ● నీటిని పూర్తిగా తీసివేసి, బాదం మరియు పిస్తాపప్పుల తొక్క తీసి, తొక్క తీసి, గది ఉష్ణోగ్రత వద్ద తాజా నీటిలో కనీసం 1 నుండి 2 గంటలు నానబెట్టండి. చిరోంజి గింజల నుండి నీటిని తీసివేసి శుభ్రమైన గుడ్డకు బదిలీ చేయండి. వాటిని ఆరబెట్టి మెల్లగా రుద్దండి. తొక్క ఊడిపోవడం. తొక్కను మరియు గోధుమ రంగు గింజలు ఉంటే వాటిని తొలగించండి. విత్తనాలను ఒక చిన్న గిన్నెలో ఉంచి పక్కన పెట్టుకోండి. ● గింజలు 1 నుండి 2 గంటల తర్వాత బాగా నానబెట్టిన తర్వాత, వారి మెతగా కోసి పక్కన పెట్టుకోండి. గింజలు వేయించే ముందు పొడిగా ముందు పొడిగా ఉండేలా చూసుకోండి.

● సన్నని వర్మిసెల్లి సాధారణంగా పొడవుగా ఉంటుంది మరియు విరిగిపోదు. మీరు వాటిని కొద్దిగా విరిచి 1 కప్పు (50 గ్రాములు) కొలిచి పక్కన పెట్టుకోవాలి.

షీర్ ఖుర్మా తయారీ: ● మందపాటి అడుగున ఉన్న కుండలో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేడి చేసి, జీడిపప్పు మరియు బాదం పప్పులను వేడి నెయ్యిలో 1 నుండి 2 నిమిషాలు వేయించాలి. తరువాత పిస్తాపప్పులు మరియు చిరోంజి గింజలను వేసి వేయించాలి. వాట స్ఫుటంగా మరియు బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. గింజలు నానబెట్టడానికి 5 నుండి నిమిషాలు తీసుకున్న తర్వాత, ఒక ప్లేట్‌లోకి తీసివేయండి. అదే పాత్రలో ఖర్జూరాలు వేసి, మంచి వాసన వచ్చే వరకు వేయించి, ఒక ప్లేట్‌లోకి తీసుకోండి.1 టేబుల్ స్పూన్ నెయ్యి పోసి సెవియన్ వేసి, తక్కువ నుండి మీడియం మంట మీద బంగారు రంగు వచ్చేవరకు వేయించి, ఒక ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టు కోండి. అదే పాత్రలో, 4 కప్పుల పాలు పోసి, మీడియం నుండి తక్కువ మంట మీద మరిగించాలి. పాలు మరిగేటప్పుడు, 5 నిమిషాలు తరచుగా కలుపుతూ మరిగించాలి. తరువాత వేయించిన చిరోంజి గింజలు ఖర్జూరాలతో అలంకరించండి. □

# జెడ్‌ని పెంచేద్దామా !



పచ్చలు పొదిగినట్లుగా మెరిసిపోయే జెడ్‌ని చూసి ముచ్చటపడని వారుండరేమో! ఈ సక్యులెంట్‌ని ఇండోర్ ప్లాంట్‌గా, అర్నమెంటల్ రకంగానే కాదు..గిఫ్టింగ్ కోసమూ ఎంచుకోవచ్చు. దీన్ని పెంచు కోవడమెలాగో తెలిస్తే మరింత బాగుంటుంది కదా

**కాంతి అవసరం :** ఇవి పెరిగే వాతావరణంలో తగినంత వెలుతురు ఉండాలి. కనీసం రోజులో గంటైనా తగిలేలా చూసుకోవాలి. పశ్చిమం, దక్షిణం వైపు ఉండే కిటికీల దగ్గర వీటిని అనువుగా పెంచుకోవచ్చు. గది మరీ చీకటిగా ఉంటే ఎల్ఈడి కాంతులైనా ప్రసరించేలా చూసుకోవాలి.

**. నీళ్ల పోయాల్సిందే :** మట్టిలో తేమ నిల బడితేనే మొక్క ఆరోగ్యంగా ఉంటుంది. అలాగని మరీ బురదబురదగా ఉండ కూడదు సుమా! ఈ నీటిని నింపుకొనే ఆకులు పచ్చగా ఉంటాయి. మొక్క చుట్టూ మట్టి గట్టిపడకుండా ఎప్పటికప్పుడు వదులు చేసుకోవ డమూ ముఖ్యమే. అప్పుడే వేళ్లకూ గాలితగిలి ఆరోగ్యంగా ఎదుగుతుంది.

**పోషకాలు ఇస్తేనే :** ఎంత ఎడారి మొక్క అయినా.. తగినన్ని పోషకాలు అందిస్తేనే చక్కగా ఎదుగుతుంది. దీనికి కనీసం నెలకోసారైనా నీళ్లలో కరిగే ఎన్‌పికె ఎరువుని అందించాలి. చని పోయిన, పాడైన కొమ్మల్ని ఎప్పటికప్పుడు తీసేయాలి. ఇలా చేస్తేనే జెడ్ ఆకులతో నిండుగా కనిపిస్తుంది. □

# చిన్న చిన్న జాగ్రత్తలు అవసరం



అవసరం ఆనందంగా సాగే దాపంత్యం.. ఇదేలా ఏ జంటైనా కోరుకునేది. దీనికోసం పెద్ద పెద్ద త్యాగాలే చేయక్కర్లేదు. చిన్న చిన్న జాగ్రత్తలు చాలు ఆ ప్రయాణం సజావుగా సాగేలా చేస్తుంది అంటారు నిపుణులు. ఎలాగంటే.. ఎన్నిసార్లు చేసినా కాల్ లిఫ్ట్ చేయరు చాలమంది భార్యల నుంచి వచ్చే ఫిర్యాదే ఇది. అవతలి నుంచేమో 'బిజీగా ఉన్నా. ఆ మాత్రం అర్థం కాదా' అన్న సమాధానం వచ్చేస్తుంది. చిన్న సమస్యగానే కనిపిస్తుంది కానీ.. ఆ కొద్ది సమయంలో ఏదైనా చెడు జరిగిందేమోనన్న భయం, తమన నిర్లక్ష్యం చేసునతన్నారన్న బాధ.. ఇలా వాళ్ల మనసులో ఎన్ని నెగెటివ్ ఆలోచనలు తలెత్తుతాయో తెలుసా? అలాంటప్పుడు మీటింగ్‌లో ఉన్నాను. మళ్లీ చేస్తాను' అని చెప్పి పెట్టేయొచ్చు. లేదా మెసేజ్ చేసినా మంచిదే. నెగెటివ్ ఆలోచన లకు తావుండదు. 'పొసెసివ్ నెస్' అని అందమైన పేరు పెట్టినా.. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చెక్ చేయడం అనుమానం కిందే లెక్క. సరిగా సమయం కేటాయించట్లేదు, ఫోన్‌లోనే ఉండిపోతున్నా రనిపిస్తే సాయంత్రం ఫలానా సమయం తర్వాత నో ఫోన్, సోషల్ మీడియాకి ఇన్ని గంటలే అన్న నియమాలు పెట్టుకోండి. నిర్లక్ష్య భావన ఉండదు. పొగడ్తలు అందుకోని వారు ఎవరుంటారు చెప్పండి? కానీ మన అనుకున్న వాళ్ల నుంచి వస్తే అదిచ్చే ఆనందమే వేరు. కూర బాగున్నా, ఆయన షర్టులో అందంగా ఉన్నా చెప్పేయండి. ఇది మీ బంధంపై సానుకూల ప్రభావం చూపుతుంది. కావాలంటే ప్రయత్నించి చూడండి? ఏ బంధంలో గొడవలు, చిరుకోపాలు ఉండవు? అయితే అవి ఆ సమస్యకే పరిమితం అవ్వాలి. నువ్వెప్పుడూ అంతే', పోయినసారీ అలానే చేశావు అంటూ పాతవి తవ్వుకుంటూ వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు మరిచిపోండి. అలాకాకుండా చిట్టా పోగేసుకుంటూ వెళితే, ప్రేమపోయి.. అయిష్టం, కోపం వంటివి పేరుకుపోతాయి. అలా చిన్నవే కదూ.. కాకపోతే నిర్లక్ష్యం చేస్తుంటాం. వాటిని కాస్త పట్టించుకుంటే.. అందమైన బంధం మీ సొంతం. కావాలంటే ప్రయత్నించి చూడండి. □

# నీళ్లని నిర్లక్ష్యం చేయరాదు !

ఎండలు పెరిగే కొద్దీ ఒంట్లో నిస్సత్తువ, కళ్ల తిరగడం వంటి సమస్యలు చుట్టుముడతాయి. ఇలాంటప్పుడు చల్లగా ఓ గ్లాసు మంచినీళ్ల తాగితే చాలు.. కుదుటపడొచ్చు. అంతేకాదు, నీటిని తాగడం వల్ల మరెన్నో ప్రయోజనాలూ ఉన్నాయట. ✦ డీ హైడ్రేషన్ వల్ల శరీరంలోని శక్తి స్థాయిలు పడిపోతాయి. అప్పుడే కాదు, మరెప్పుడైనా కళ్లు తిరుగుతున్నా, అలసటగా అనిపించినా.. కడుపు నిండా తినలేదేమో అనుకోవడమే కాదు.. తగినన్ని నీళ్ల తీసుకున్నామో లేదో అని కూడా గమనించుకోండి అంటున్నారు నిపుణులు.



✦ వేళ కాని వేళ ఆకలి వేస్తుందా? వెంటనే ఓ గ్లాసు నీళ్ల తాగండి. కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎందుకంటే ఆకలి, దాహం భావనల్ని మెదడు ఒకేలా గ్రహించడమే ఇందుకు కారణం. లేదంటే బరువు పెరిగిపోయే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులు లేకుండా ఉండటానికీ, వడదెబ్బ తగలకుండానూ, కీళ్ల తేలిగ్గా కదలడానికీ, సున్నితమైన కణజాలం దెబ్బతినకుండానూ నీరెంతగానో సాయపడుతుంది. ✦ ఈ కాలమే కాదు..ఎప్పుడైనా సరే. నీళ్ల సరిగా తాగకపోతే ఆహారం సరిగా జీర్ణ కాదు. బంట్లో వ్యర్థాలు, కొవ్వులు పేరుకుపోయి బరువూ పెరిగిపోతాం. అందుకే డైటిగ్ చేసేవారు సమతులాహారం తీసుకోవడంతో పాటు తగినన్ని నీళ్లూ తీసుకోవాలంటారు నిపుణులు అలానే మూత్ర పిండాల పనితీరు, ఇతర శరీర విధులు సక్రమంగా సాగిపోవాలన్నా కూడా ఇవి ఎంతో అసవరం. ✦ ఉదయం నిద్ర లేచాక ఓ గ్లాసు నీళ్ల తాగితే రోజంతా హుషారుగా ఉండొచ్చుట. ముఖ్యంగా పెద్ద పేగులో పేరుకుపోయిన మలినాలు తొలగిపోతాయి. అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. అంతేకాదు డీ హైడ్రేషన్ వల్ల వచ్చే తలనొప్పితో పాటు మైగ్రెయిన్, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లూ తగ్గుతాయట. □

# వీటిని ఓవెన్‌లో వేడి చేయొద్దు ..



✦ పుట్ట గొడుగులను తిరిగి వేడి చేస్తే అందులో ఉన్న పోషకాలు నశించడమే కాదు, ఇన్ఫెక్షన్లు కలిగిస్తాయి.

✦ ఉడికించిన కోడిగుడ్లు, చిల్లీ పెప్పర్స్, నరబొకోలి, అవెన్‌లో వేడిచేస్తే అవి హానికరంగా తయారవుతాయి.

✦ అన్నం మిగిలితే.. రెండోరోజు అలాగే తినొచ్చు. ఒవెన్‌లోవేడి చేస్తే మాత్రం విషతుల్యమౌతుంది. ✦. నైట్రేట్లు విస్తారంగా ఉన్న బీట్‌రూట్, క్యారెట్, బచ్చలికూర లాంటివి అవెన్‌లో వేడి చేయకూడదు.

✦ ఉద్యోగినులు చనుబాలు భద్రం చేసి, బిడ్డకు ఆకలేసినప్పుడు తాగించే ఏర్పాటు చేస్తున్నారు. ఆ పాలు అవెన్‌లో వేడి చేయడం మంచిది కాదు. అవసరాన్ని బట్టి వేడినీళ్ల గిన్నెలో పాలపాత్రను ఉంచి గోరువెచ్చగా చేయొచ్చు. ✦ ఫ్రిజ్‌లో ఉంచిన పండ్లు చల్లగా ఉన్నాయని కొన్ని క్షణాలు కూడా అవెన్‌లో వేడి చేయకూడదు. ✦ కాఫీ వెంటనే తాగాలి. చల్లారిందని వేడి చేయకూడదు. ✦ ఉడికించిన బంగాళదుంపలు, ప్రాసెస్ చేసిన మాంసం, టొమాటో సాస్ అవెన్‌లో వేడి చేయకూడదు. □

# పరీక్షలవేళ అమ్మలకు పరీక్ష ..

**ఏడాదంతా చదవడం ఒక ఎత్తయితే, పరీక్ష రాయడం ఇంకో ఎత్తు. భయంతో చదివింది మర్చిపోవడం, సమర్ధంగా రాయలేకపోవడం కద్దు. ఈ సమయం పిల్లలకే కాదు అమ్మలకీ గుబులు పెట్టించేదే! అన్నింటినీ అందరినీ దూరం పెట్టేసి ధ్యాసంతా చదివించడం మీదే. ఈ నేపథ్యలో మానసిక నిపుణులు ఏమంటున్నారంటే ...**

ఇవాల్టి రోజున బాగా చదివితేనే స్థిరమైన జీవితం అనుకుంటున్నారంతా. దీంతో చదువూ వ్యాపార ధోరణిలోకి మారింది. ఆ పోటీలో నెగ్గుకురావాలనే ఆశతో తల్లిదండ్రులు. నీ కోసం మేమింత కష్టపడుతున్నాం, నువ్వు దానికి తగ్గట్టు చదివి బాగా స్థిరపడాలి అంటారు. తండ్రుల కంటే తల్లులు సున్నితం కనుక బాగా చదవమని ఒత్తిడి చేస్తారు. ప్రోత్సహించడం మంచిదే. కానీ తమ పిల్లల సామర్థ్యం గురించి ఆలోచించడం లేదు. ఎక్కువసేపు చదివితే ఎక్కువ మార్కులొస్తాయని, బొత్తిగా సేదతీరనివ్వడంలేదు. బాగా చదవమని పోరు పెడతారు. అనుక్షణం సలహాలిస్తూ భయపెడతారు. చదువుకున్న అమ్మలూ ఇందుకు మినహాయిపు కాదు. పోటీ తట్టుకవోలంటే చాలా శ్రమించాలనుకుంటారు. స్కూల్లో, ట్యూషన్లో, ఎటు చదివిస్తారు. ఇంట్లోనూ క్షణవ వృథా చేయొద్దంటే అది మామూలు ఒత్తిడి కాదు. మీ పిల్లలకూ మంచి మార్కులే రావచ్చు. కానీ ముందుగానే అంచనా లొద్దు. వాళ్లకు



చదువు ప్రాధాన్యత గురించి చెప్పి ఇక వదిలేయండి. వాళ్లు బాధ్యతగానే ఉంటారు. మార్కులు, ర్యాంకులు అంటూ ప్రమాణాలూ ఉద్వేగాలు సరికాదు. వీటి వల్ల అమ్మల పిల్లకూ కూడా ఆందోళనే. నిజానికి వాళ్లకీ బోలెడు సందేహాలు, అనుమానాలుంటాయి. అంచానాలు భయపెడుతుంటాయి. అమ్మానాన్నల ఆశలు, టీచర్లకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వీటన్నింటి మధ్య తమను నిరంతరం అమ్మ గమనిస్తూ సలహాలిస్తోంటే ఆందోళన చెందుతారు. అసలే చదవగలమా అనే సందేహం అన్నింటా స్నేహితులు మెరుగ్గా ఉంటే ఆందోళన.. చదివిన ప్రశ్నలు పరీక్షలోన వస్తాయా, భవిష్యత్తు ఏమవుతుందన్న కంగారు. పరీక్ష సరిగ్గా రాయకపోతే అంతా అవమానిస్తారన్న భయం. ఇన్ని దిగుళ్లతో పుస్తకాల ముందు కూర్చున్నా చదవలేరు. రోజులలా గడిచి పరీక్షలు వచ్చేసరికి కంగారు మరీ ఎక్కువౌతుంది. ఆ టెన్షన్‌తో చదివినవీ గుర్తురావు. ఫెయిలైపోతానని బెంబేలుపడతారు.

**పరిష్కారం ఏమిటంటే..** పిల్లల్ని మంచి విద్యాసంస్థలో చేర్పించాం. ఏడాదంతా చదివారు. నెలవారీ పరీక్షలన్నిటిలో ఉత్తీర్ణులయ్యారు. ముందే అనేక ఆందోళనలతో సతమతమౌతున్న పిల్లల్ని మనం ఇంకా ఒత్తిడి పెట్టకూడదు. ఇంత పోటీ ఉన్నందున మన పిల్లలకు ర్యాంకు వచ్చినా, రాకపోయినా అర్థం చేసుకుని అంగీకరించాలి. జీవితంలో స్థిరపడటమే ముఖ్యం కానీ ఈ లక్ష్యాలు కాదు అనుకోవాలి. వాళ్ల ఒత్తిడి తగ్గించాలేగానీ పెంచకూడదు. అందుకోసం ఆశావహంగా ఉండాలి. నువ్వు కష్టపడి చదివావు కదా! చక్కగానే రాస్తావు. ఫలతం గురించి ఆలోచించక నిశ్చింతగా ఉండు అంటూ అనునయించాలి. కొందరు పిల్లలు పరీక్షల కంగారులో అర్థంకాలేదు.మర్చిపోతున్నామంటారు.అలాంటప్పుడు విడమరిచి చెప్పండి లేదా చెప్పించండి. విన్నది గుర్తుంచుకోమని, సుదీర్ఘమైనవి తేలిగ్గా రాయమని చెప్పి నిబ్బరం కలిగించండి. అంతేకానీ మాటిమాటికీ సలహాలివ్వొద్దు. వాళ్లంతట వాళ్లు చదువుకునేలా చేయండి. అడిగతేనే ఆసరా ఇవ్వండి. అవసరమైతేనే సాయం చేయండి. పక్కనే ఉండి డిపెండెన్సీ పెంచొద్దు. ఆందోళనకూ గురిచేయొద్దు. ఇంటి వాతావరనాన్ని ఆహ్లాదంగా ఉంచండి. బిగ్గరగా మాట్లాడటం, టివి హోరూ వద్దు. ఇష్టమైనవారితో మాటలు, నచ్చిన వ్యాపకం.. అలా మధ్యలో సేత తీరుతుంటే ఒత్తిడి ఉండదు.కొందరు ముందంతా ఒత్తిడి చేసి చివర్లో పరీక్ష తప్పినా ఫర్లేదనేస్తారు. ఇలాంటి ధోరణి కూడదు. కంట్రోల్, కర్షన్, కంపేరింగ్, కమిట్‌మెంట్ ఈ నాలుగూ వద్దు. పిల్లలను విచ్చిన్నమయ్యే స్థితికి తీసెకెళ్లక స్థిమితంగా ఉంచండి. సత్ఫలితాలు తప్పకుండా వస్తాయి. □

# క్లిష్ట పరిస్థితుల్లో రోహిత్

## ఐపిఎల్‌లో పేలవ ఫామ్.. 14 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), ముంబయి ఇండియన్స్ అనగానే టక్కున గుర్తొచ్చే పేరు రోహిత్ శర్మనే. అతడే ఆ జట్టుకు మెయిన్ ఫేస్. ఒకప్పుడు నిలకడ ప్రదర్శనతో భారీగా పరుగులు చేస్తూ, జట్టుకు ఎన్నో విజయాలను అందించాడు. కెప్టెన్ గానూ జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన ఘనత అతడిది. కానీ ఇప్పుడతడు గత కొన్ని సీజన్లుగా బ్యాటుతో అంతగా ప్రభావం చూపలేకపోతున్నాడు. ఐపీఎల్ 2025 అతడి పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో 0,8 పరుగులు చేసి తీవ్రంగా నిరశపరిచాడు. పైగా ఈ రెండుమ్యాచుల్లో ముంబయి కూడా పరాజయాలను అందుకుంది. ఈ ఐపీఎల్‌లో రోహిత్ శర్మ పేలవ ఫామ్ గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మరో మ్యాచులోనూ ప్రభావంచూపలేకపోయాడు. 8పరుగులే చేసి బౌల్డయ్యాడు. అలా గత రెండు మ్యాచుల్లోనూ రోహిత్ విఫలమైన నేపథ్యంలో ముంబయి ఇండియన్స్ తుది జట్టులో అతడి స్థానంపై ప్రశ్నలు మొదలయ్యాయి. రోహిత్ ఇలా పేలవ ప్రదర్శనతో కిందకు పడిపోవడం ఒక్క రాత్రిలో జరిగిందేదీ కాదు. లీగ్‌లో అత్యధిక పరుగులు సాధించిన మూడో ఆటగాడిగా నిలిచినప్పటికీ, గత కొద్ది సీజన్లుగా అతడి ఆట తీరులో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. ఐపీఎల్ 2024లో అతడు సెంచరీ చేయడంతో పాటు, గతం కన్నా మెరుగైన స్ట్రైక్ రేట్‌తో ఆడాడు. కానీ అతడి మొత్తం గణాంకాలు పరిశీలిస్తేనే అస్థిరత కనిపిస్తోంది. గత 14 మ్యాచ్‌ల్లో అతడు కేవలం ఒక్క హాఫ్ సెంచరీ మాత్రమే చేశాడు. ప్లేయింగ్ 11లో అతడికి చోటు కల్పించాలా లేదా జట్టుకు మార్పు అవసరమా అంటూ ఆ ఫ్రాంఛైజీ తర్జన భర్జన పడుతోంది. ఇతర బ్యాటర్లు అవకాశాల కోసం ఎదురుచూస్తోన్న వేళ, రోహిత్ నిలకడలేని ప్రదప్రర్శనతో అతడిని టాప్ ఆర్డర్‌లో పంపించడం సహా తుది జట్టులో అతడి స్థానంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జట్టులో అతడి స్థానం ప్రమాదంలో పడుతుందనే చర్చ కొనసాగుతోంది. పైగా ఇప్పటికే అతడు 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీంతో అతడి ఐపీఎల్ భవిష్యత్ పైకూడా కాస్త అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే మ్యాచ్‌ల్లో రోహిత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే ఆ తర్వాత మ్యాచుల్లో ముంబయి తుది జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉంటుందనే వ్యాఖ్యలు చోటు చేసుకుంటున్నాయి.

# ఓటమితో ముగిసిన శరత్ ఆట

## 3-0 తేడాతో స్నేహిత్ విజయం



**న్యూఢిల్లీ:** భారత్ టేబుల్ టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ తన ఆటను ముగించాడు. వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నీ పురుల సింగిల్స్‌లో పరాజయంతో అతను రిటైర్ అయ్యాడు. ఈ టోర్నీ ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో తెలంగాణకు చెందిన సూరావజ్జుల స్నేహిత్ చేతిలో శరత్ 0-3తో ఓటమిపాలయ్యాడు. 25 నిముషాల పాటు సాగిన ఈ పోరులో స్నేహిత్ 11-9, 11-8, 11-9తో విజయం సాధించాడు. శరత్ కమల్ చివరి మ్యాచ్ చూడటం కోసం చైన్నెలోని నెహ్రూ స్టేడియానికి పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. మ్యాచ్ ముగిసిన తర్వాత వారందరికీ అభివాదం చేస్తూ అతను కృతజ్ఞతలు తెలిపాడు. అంతకు ముందే పురుషుల డబుల్స్ విభాగంలో స్నేహిత్‌లోనే కలిసి శరత్ డబుల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఈ పోరులో కొరియాకు చెందిన జోడి లిమ్ జొంగూన్-అన్ జీహున్ చేతిలో 11-9, 8-11, 6-11 స్కోరుతో శరత్-స్నేహిత్ ద్వయం పరాజయం చెందింది. కాగా 17 ఏళ్ల వయసులో చెన్నైలో నే జరిగిన ఆసియా జూనియర్స్ టోర్నమెంట్‌తో తొలిసారి ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ బరిలోకి దిగిన శరత్ రెండు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. అసాధారణ రీతిలో 10 సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన అతడు అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకున్నాడు. ప్రధానంగా కామన్వెల్త్ క్రీడల్లో 7 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు గెలిచిన శరత్ ఆసియా క్రీడల్లో 2 కాంస్యాలు సాధించాడు. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కూడా అతని ఖాతాలో 4 కాంస్యాలు ఉన్నాయి. 2004 నుండి 2024 మధ్య ఐదు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న శరత్ కమల్‌ను భారత్ ప్రభుత్వం పద్మశ్రీ ఖేల్‌రత్న పురస్కారాలతో గౌరవించింది.



## ఆస్ట్రేలియాకు షెఫీల్డ్ షీల్డ్ టైటిల్

**న్యూఢిల్లీ:** సౌత్ ఆస్ట్రేలియా 29 ఏండ్ల తర్వాత తొలిసారి షెఫీల్డ్ షీల్డ్ టైటిల్ను సొంతం చేసుకుంది. అడిలైడ్‌లో ముగిసిన ఫైనల్లో ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న సౌత్ ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో క్వీన్‌లాండ్‌పై గెలిచింది. క్వీన్‌లాండ్ నిర్దేశించిన 270 రన్స్ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సౌత్ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 69.1 ఓవర్లలో 270/6 స్కోరు చేసి నెగ్గింది. జాసన్ సంగా (126 నాటౌట్), అలెక్స్ క్యారీ (105) సెంచరీలతో దంచికొట్టారు. ఈ ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 202 రన్స్ పార్టనర్‌షిప్ నెలకొల్పారు. మార్క్ స్టెకిటీ 3 వికెట్లు తీశాడు. అంతకుముందు క్వీన్‌లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 136.2 ఓవర్లలో 445 రన్స్‌కు ఆలౌటైంది. జాక్ క్లెటాన్ (100), జాక్ విడెర్మత్ (111) సెంచరీలు చేయగా, మార్నస్ లబుషేన్ (61), మార్క్ స్టెకిటీ (51) హాఫ్ సెంచరీలు సాధించారు. బ్రెండన్ డాగెట్ 5, నేథన్ మెక్‌అండ్రూ 3 వికెట్లు పడగొట్టారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ గ్రాండ్ విక్టరీ

## 7 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ చిత్తు

## పాయింట్ల పట్టికలో 6కు పడిపోయిన హైదరాబాద్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, 18వ సీజన్‌లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయాన్ని సాధించినట్లయింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 164 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలో ఢిల్లీ 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైజాగ్ వేదికగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ వ్యూహ్యం విఫలమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ నిర్ణయం తప్పని తొలి ఓవర్‌లోనే నిరూపితమైంది. బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. పవర్ ప్లేలోనే హైదరాబాద్ జట్టు 4 వికెట్లు కోల్పోవడం గమనార్హం. అభిషేక్ శర్మ (0), నితీష్ కుమార్ రెడ్డి (0), ఇషాన్ కిషన్ (2 పరుగులు) సింగిల్‌డిజిట్ స్కోరుతో పెవిలియన్‌కు చేరారు. ఇలాంటి కష్ట సమయంలో అనికేత్ వర్మ స్కోరును 150కి దగ్గరగా తీసుకువచ్చాడు. అతను హెన్రిచ్ క్లాసెన్‌తో కలిసి 42 బంతుల్లో 77 పరుగుల భాగస్వామ్యాన్ని పంచు కున్నాడు. అనికేత్ 41 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఇందులో 5 ఫోర్లు, 6సిక్సర్లు ఉన్నాయి. అతనితోపాటు, హెన్రిచ్‌క్లాసెన్ 32 పరుగులు, ట్రావిస్ హెడ్ 22 పరుగులు చేశారు. దీంతో 18.4 ఓవర్లలో 163 పరుగులకే పరిమితమైంది. ఢిల్లీ బౌలర్ మిచెల్ స్టార్క్ 5 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్‌యాదవ్ 3వికెట్లు పడగొట్టాడు. మోహిత్‌శర్మ ఒక వికెట్ పడగొట్టాడు. ఒక బ్యాట్స్‌మన్ రనౌట్ అయ్యాడు. అనికేత్ వర్మ 41 బంతుల్లో 6 సిక్సర్లతో 74 పరుగులు చేశాడు. మిచెల్ స్టార్క్ 5 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు పడగొట్టాడు. ఇక 164 పరుగుల లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్లు ఆది నుండీ దూకుడును ప్రదర్శించి అలవోకగా ఛేజ్ చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ ఓపెనర్ ఫాఫ్ డు ప్లెసిస్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జాక్‌ఫేజర్ మాగార్క్38 పరుగులు సాధించాడు. డుప్లెసిస్ 27 బంతుల్లో 50పరుగులుచేసి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడగా, ఫ్రేజర్-మెక్‌గుర్క్ 38 పరుగులు చేసి రాణించాడు. ఇలా ఈ ఇద్దరు ఓపెనర్లు డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్-మెక్గుర్క్ తొలివికెట్‌కు 81పరుగులు జోడించి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. అయితే స్వల్పవ్యవధిలో వీరిద్దరూఔటయ్యారు. ఆతర్వాత కాసేపటికే సిక్స్, ఫోర్ కొట్టి మంచి టచ్‌లో కనిపించిన రాహుల్ బౌల్డయ్యాడు. మూడు వికెట్లు జీషన్ అన్సారి తీసుకోవడం విశేషం. తదుపరి క్రీజులోకి వచ్చిన అభిషేక్ పోరెల్ (34), స్టబ్స్ (21) ఎలాంటి ఒత్తిడి లేకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో పాయింట్ల పట్టికలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో స్థానానికి చేరుకుంది. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మాత్రం వరుసగా రెండో ఓటమితో 6వ స్థానానికి పడిపోయింది.




## ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్ రెజ్లర్లకు నిరాశ

**న్యూఢిల్లీ:** సీనియర్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025 ఫ్రీస్టైల్ రెజ్లింగ్ పోటీలో ఏ రెజ్లర్ కూడా పతక పోరుకు అర్హత సాధించకపోవడంతో భారత రెజ్లింగ్ బృందానికి దురదృష్టకరమైన రోజుగా నిరూపించబడింది. ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన భారత ఫ్రీస్టయిల్ టోర్నీలో రెజ్లర్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. పురుషుల 65కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుజిత్ కల్కాల్ పాలస్తీనా రెజ్లర్ అబ్దుల్లా అసఫ్‌పై గెలిచినా, తదుపరి కైజీ తనాబే (జపాన్) చేతిలో ఎదుర్కోవాల్సి వచ్చింది. తనాబే ఫైనల్ చేరినా గాయం కారణంగా సుజిత్ రెపిచేజ్‌లో ఆడే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మిగతా విభాగాల్లో విశాల్ కాళీరామన్ (65 కిలోలు), చిరాగ్ (57 కిలోలు), చంద్రమోహన్ (79 కిలోలు) ప్రత్యర్థుల చేతుల్లో ఓటములు ఎదుర్కొన్నారు. 57 కిలోల విభాగంలో, 2024 యూ23 ప్రపంచ ఛాంపియన్ అయిన చిరాగ్, కిర్గిజ్ రెజ్లర్ చేతిలో తన మొదటి మ్యాచ్‌లో ఓడిపోవడంతో ముందుగానే నిష్క్రమించాడు. కిర్గిజ్ రెజ్లర్ మంగోలియన్ ప్రత్యర్థి చేతిలో ఓడిపోవడంతో చిరాగ్ పతకం సాధించే అవకాశాలకు గాను, రిపిచేజ్ రౌండ్‌లోకి ప్రవేశించాలనే అతని ఆశలు అడియాసలయ్యాయి. 65 కిలోల విభాగంలో, సుజిత్ తన తొలి పోటీలో విజయం సాధించడం ద్వారా ప్రారంభించాడు, భారతదేశం పతక ఆశలను సజీవంగా ఉంచుకున్నాడు. అయితే, అతను తదుపరి రౌండ్‌లో జపాన్ రెజ్లర్ చేతిలో ఓడిపోయాడు. ముఖ్యంగా గాయం కారణంగా అతను పోటీ నుండి వైదొలగాల్సి వచ్చింది. ఇతర పోటీదారులలో, విశాల్ కలిరామన్ (70 కిలోలు), చంద్రమోహన్ (79 కిలోలు), మరియు జాంటీ (97 కిలోలు) కూడా వారి వారి పోటీలలో పరాజయాలను ఎదుర్కొని, వారి పతక ఆశలకు ముగింపు పలికారు.

# బులియన్ మార్కెట్లో పసిడి వర్సెస్ సిల్వర్

**న్యూఢిల్లీ, మార్చి 30:** బంగారం, వెండి రెండూ దీర్ఘకాలిక పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో భాగం కావచ్చు. అయితే, 5, 10, 15 సంవత్సరాల వ్యవధిలో ఏది మంచి రాబడిని ఇస్తుందనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. గత డేటా, మార్కెట్ ట్రెండ్‌లు, గోల్డ్‌సిల్వర్ రేషియో, రిస్క్ స్థాయిలను పరిశీలిస్తే ఈ నిర్ణయం స్పష్టమవుతుంది. బంగారం ధర ఔన్స్‌కు 3,030 (భారత్‌లో 10 గ్రాములకు రూ.88,500), వెండి ఔన్స్‌కు 33 (భారత్‌లో కిలోకు రూ.1 లక్ష). గత ఏడాది బంగారం 40శాతం పెరిగితే, వెండి 34శాతం పెరిగింది. రెండూఆకట్టుకునే రాబడిని ఇచ్చాయి, కానీ వెండి కొంత వెనుకబడింది. 2020 నుంచి 2025 వరకు బంగారం ధర 10గ్రాములకు రూ.48,000నుంచి రూ.88,500



కి పెరిగింది, అంటే సుమారు 84శాతం రాబడి (సంవత్సరానికి 13శాతం సీఏజీఆర్). వెండి ధర కిలోకు రూ.50,000 నుంచి రూ.1 లక్షకు పెరిగింది, అంటే 100శాతం రాబడి (సంవత్సరానికి 15శాతం సీఏజీఆర్). ఈ వ్యవధిలో వెండి బంగారం కంటే మెరుగైన రాబడిని ఇచ్చింది. 2015లో బంగారం ధర రూ.26,400 (10 గ్రాములు), 2025లో రూ.88,500, అంటే 235శాతం రాబడి (సంవత్సరానికి 12శాతం సీఏజీఆర్). వెండి రూ.35,000 (కిలో) నుంచి రూ.1 లక్షకు పెరిగింది, అంటే 185శాతం రాబడి (సంవత్సరానికి 11శాతం సీఏజీఆర్). ఈ వ్యవధిలో బంగారం వెండి కంటే మెరుగ్గా రాబడి ఇచ్చింది. 2010లో బంగారం ధర రూ.18,500 (10 గ్రాములు), 2025లో రూ.88,500, అంటే 378శాతం రాబడి (సంవత్సరానికి 11శాతం సీఏజీఆర్). వెండి రూ.27,000 (కిలో) నుంచి రూ.1 లక్షకు పెరిగింది, అంటే 270శాతం రాబడి (సంవత్సరానికి 9శాతం సీఏజీఆర్). ఈ వ్యవధిలో కూడా బంగారం వెండి కంటే మెరుగైన రాబడిని ఇచ్చింది. ధరల పెరుగుదలకు కారణాలు బంగారం సురక్షిత పెట్టుబడిగా పరిగణించ బడుతుంది. ఇటీవల కేంద్ర బ్యాంకులు ఏటా 1,000 టన్నులకు పైగా బంగారం కొనుగోలు చేస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ విధానాలు, ఆర్థిక అనిశ్చితి, అమెరికాలో మాంద్యం భయాలు బంగారం డిమాండ్‌ను పెంచాయి. యూఎస్ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తే డాలర్ బలహీనపడి బంగారం ధరలు మరింత పెరగవచ్చు. వెండి డిమాండ్ ఐదేళ్లుగా సరఫరాను మించిపోతోంది. 2025లో గ్లోబల్ డిమాండ్ 1.20 బిలియన్ ఔన్స్‌లుగా, సరఫరా 1.05 బిలియన్ ఔన్స్‌లుగా అంచనా. పరిశ్రమల డిమాండ్ (ఎలక్ట్రానిక్స్, సోలార్‌ప్యానెల్స్, గ్రీన్ టెక్), పెట్టుబడి ఆసక్తి వెండి ధరలను పెంచుతున్నాయి. వెండి మార్కెట్ చిన్నది (30 బిలియన్ డాలర్ల టర్నోవర్), కాబట్టి సరఫరాలో చిన్నమార్పు కూడా ధరలపై పెద్ద ప్రభావం చూపుతుంది. వెండి బంగారం కంటేఎక్కువ అస్థిరతను కలిగి ఉంటుంది.


# రూ.78,213 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు!

**ముంబై, మార్చి 30:** భారతీయ బ్యాంకుల్లో రూ.78,213 కోట్లకుపైగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. అంటే ఈ అకౌంట్ల ఎవరివో తెలియనివి. ఒకవిధంగా చెప్పాలంటే బ్యాంకులో డబ్బు జమ చేసి, దానిని విత్‌డ్రా చేసుకోలేక అలాగే ఉండిపోయింది. ఆఖాతాలకు ఎలాంటి వారసులు లేరు. అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆ డబ్బును అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ఉండిపోయాయి. ఇప్పుడు ఈ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ దాని నిజమైన యజమానులకు మాత్రమే చెందుతుంది. ఈ డబ్బును తిరిగి పొందడానికి ఆర్బీఐ ఏప్రిల్ 1, 2025 నుండి కొత్త వ్యవస్థను అమలు చేస్తోంది. దీని కింద, బ్యాంకులు తమ వెబ్‌సైట్‌లో క్లెయిమ్ చేయని డిపాజిట్ల పూర్తి వివరాలను ఉంచాలి. ఇందులో ఖాతాదారుడి పేరు, పబ్లిక్ సెర్చ్ ఫీచర్ కూడా ఉంటాయి. ప్రామాణిక ఫార్మాట్: ఇప్పుడు అన్ని బ్యాంకులు ఒకే రకమైన దరఖాస్తు ఫారమ్, పత్రాలను అడుగుతాయి. 2026 నాటికి పూర్తిగా ఆన్‌లైన్ క్లెయిమ్ వ్యవస్థ ప్రారంభించబడు తుంది. ఫారమ్ నింపిన తర్వాత, బ్యాంక్ శాఖ స్వయంగా కస్టమర్‌ను సంప్రదించి డబ్బును బదిలీ చేస్తుంది. ఇప్పటివరకు క్లెయిమ్ చేయని డిపాజిట్లను తనిఖీ చేయడానికి కస్టమర్లు ఆర్బిఐ ఉద్గామ్ పోర్టల్‌కు వెళ్లి, ఆపై వాటిని క్లెయిమ్ చేయడానికి బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. కొత్త వ్యవస్థలో ఈ ప్రక్రియ సులభతరం అవుతుంది. మార్చి 2024 వరకు ఉన్న డేటా ప్రకారం.. ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ ఫండ్ (డిఇఎ)లో రూ.78,213 కోట్లు జమ అయ్యాయి. ఈ మొత్తం గత సంవత్సరం కంటే 26 శాతం ఎక్కువ. నిలిచిపోయిన ఈ మొత్తాన్ని తిరిగి ఇవ్వడానికి ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా కంపెనీలను ఆదేశించారు. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, 2024 ప్రకారం, ఇప్పుడు ఒక ఖాతాలో 4 మంది నామినీలను కలిగి ఉండవచ్చు (గతంలో 1 మాత్రమే ఉండేది). దీనివల్ల నిష్క్రియాత్మక ఖాతాల నుండి డబ్బును తిరిగి పొందడం సులభం అవుతుంది. బ్యాంక్ వెబ్‌సైట్‌లో "అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు" విభాగాన్ని తనిఖీ చేయండి. పేరు, మొబైల్ నంబర్, చిరునామాతో ఫారమ్ నింపండి. బ్యాంక్ ధృవీకరించి మీ ఖాతాకు డబ్బును బదిలీ చేస్తుంది.



# నగదు విషయంలో ఆ తప్పు చేస్తే అంతే..

**ముంబై, మార్చి 30:** ఇటీవల వెల్లడైన పలు నివేదికల ప్రకారం ఒక వ్యక్తి ఇంట్లో ఉంచుకోగల డబ్బుమొత్తంపై ఎటువంటి చట్టపరమైన పరిమితిలేదు. అయితే ఆనగదు చట్టబద్ధమైన వనరుల నుంచి వచ్చి ఆదాయపుపన్ను దాఖలులో ప్రకటించాల్సి ఉంటుంది. అయితే అంతపెద్ద మొత్తంలో నగదుకు చెల్లుబాటు అయ్యే వివరణ ఇవ్వడంలో విఫలమైతే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పన్ను అధికారులు డబ్బును స్వాధీనం చేసుకునే అధికారం కలిగి ఉండటమే కాకుండా లెక్కకు రాని మొత్తంలో 137% వరకు జరిమానా కూడా విధించేఅవకాశం ఉంది. రసీదులు, బ్యాంక్ విత్‌డ్రా స్లిప్‌లు, లావాదేవీ రికార్డులతో సహా అన్ని నగదు నిల్వలకు సరైన డాక్యుమెంటేషన్‌ను నిర్వహించడం చాలా ముఖ్యం. 50,000 కంటే ఎక్కువ బ్యాంకు డిపాజిట్లు, ఉపసంహారణల కోసం, వ్యక్తులు తమ పాన్ వివరాలను అందించాలి. ఒక వ్యక్తి ఒక సంవత్సరంలోపు రూ. 20లక్షలు, అంతకంటే ఎక్కువ నగదుజమ చేస్తే, పాన్, ఆధార్ రెండింటినీ అధికారులకు అందిం చాలి. రూ.30 లక్షలకు మించి నగదు లావాదేవీల ద్వారా ఆస్తిని కొనడం లేదా అమ్మితే దర్యాప్తును ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకే లావాదేవీలో రూ.లక్ష దాటిన క్రెడిట్ కార్డ్ ఖర్చులు కూడా ఆదాయపు పన్ను అధికారులు పరిశీలిస్తారు. ఆదాయపు పన్ను చట్టం ఒకవ్యక్తి ఇంట్లో ఉంచుకోగల నగదు మొత్తాన్ని స్పష్టంగా పరిమితం చేయలేదు. చట్టంలోని సెక్షన్లు 68నుండి 69బీ వరకు వివరించినవిధంగా వివరించలేని ఆదాయంగా వర్గీకరించబడకుండా ఉండటానికి ఏదైనా గణనీయమైన మొత్తాన్ని సరిగ్గా నమోదు చేయాలి.



# వాణిజ్యం

# టర్మ్ లోన్స్‌తో జర జాగ్రత్త!

**ముంబై, మార్చి 30:** టర్మ్ లోన్ నిర్దిష్ట కాలానికి తీసుకునే రుణం. సాధారణంగా 1 నుంచి 10 సంవత్సరాలు, కొన్నిసార్లు ఎక్కువ కాల వ్యవధితో దీన్ని తీసుకుంటారు. రుణగ్రహీత నిర్దిష్ట వాయిదాల్లో అసలు, వడ్డీతో సహ రుణం తిరిగి చెల్లిస్తాడు. ఈ లోన్లు దీర్ఘకాల ఆర్థిక ప్రణాళిక కోసం ఉపయోగపడతాయి, సాధారణంగా ఆస్తిని హామీగా ఉంచాలి. ఒకేసారి మొత్తం రుణం పొందిన తర్వాత, నెలవారీ లేదా త్రైమాసిక వాయిదాల్లో చెల్లించాలి. వడ్డీ రేటు స్థిరంగా లేదా మారుతూ ఉండవచ్చు. రుణగ్రహీత క్రెడిట్ విశ్వసనీయత ఆధారంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ లోన్ అందిస్తాయి. సులభమైన దరఖాస్తు ప్రక్రియ, ముందస్తు నగదు చెల్లింపు, నిర్దిష్ట వాయిదాలు, తక్కువ వడ్డీ రేట్ల కారణంగా టర్మ్ లోన్లు ప్రజాదరణ పొందాయి. వ్యాపార విస్తరణ, సామగ్రి కొనుగోలు, ఆస్తి కొనుగోలు వంటి పెద్ద ఖర్చుల కోసం వ్యక్తులు, కంపెనీలు టర్మ్ లోన్ తీసుకుంటారు. ఉదాహరణకు, కంపెనీ కొత్త ఆఫీసు తెరవడానికి, వ్యాపారం విస్తరించడానికి, ఆధునిక సామగ్రి కొనడానికి టర్మ్ లోన్ తీసుకోవచ్చు. వ్యక్తులు 2030 సంవత్సరాల్లో తిరిగి చెల్లించే ఆస్తి కొనుగోలు లేదా 37సంవత్సరాల్లో చెల్లించే వాహన కొనుగోలు కోసం తీసుకుంటారు. విద్యార్థులు ట్యూషన్ ఫీజు కోసం కూడా ఈలోన్ తీసుకోవచ్చు, విద్య పూర్తయ్యాక చెల్లింపు ప్రారంభించవచ్చు. టర్మ్ లోన్ రకాలు.. కాలవ్యవధి, చెల్లింపు నిర్మాణం ఆధారంగా టర్మ్ లోన్లు మూడు రకాలు. సంవత్సరం లోపు తిరిగి చెల్లించాల్సిన లోన్. కొన్ని సందర్భాల్లో 18 నెలల వరకు కాలవ్యవధి ఉంటుంది. తక్షణ ఆర్థిక అవసరాల కోసం వ్యాపారాలు, వ్యక్తులు ఈ లోన్ తీసుకుంటారు. దీని వల్ల ఈ లోన్లు దీర్ఘకాల లోన్ల కంటే వేగంగా ఆమోదం పొందుతాయి. కాలవ్యవధి తక్కువ కావడంతో వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణలు: వర్కింగ్ క్యాపిటల్ లోన్లు, ట్రేడ్ క్రెడిట్, ఇన్వాయిస్ ఫైనాన్సింగ్, పేడే లోన్లు, వైద్య బిల్లులు. 1 నుంచి 5 సంవత్సరాల మధ్య తిరిగి చెల్లించే లోన్. నిర్దిష్ట ఈఎంఐల ద్వారా చెల్లింపు జరుగుతుంది. వడ్డీ రేటు షార్ట్ టర్మ్ కంటే తక్కువ, లాంగ్‌టర్మ్ కంటే ఎక్కువ. విస్తరణ, సామగ్రి కొనుగోలు, వ్యక్తిగత అవసరాల కోసం దీర్ఘకాల



ఆర్థిక బాధ్యత లేకుండా నిధులు కావాలనుకునే వారికి ఈ లోన్లు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, రెస్టారెంట్ యజమాని కొత్త ఔట్‌లెట్ కోసం 4 సంవత్సరాలకు రూ.20 లక్షల లోన్ తీసుకోవచ్చు, లేదా ఫ్యాక్టరీ యజమాని రూ.10 లక్షల సామగ్రి కొనుగోలు కోసం 4 సంవత్సరాల ఈఎంఐ తీసుకోవచ్చు. ఇతర ఉదాహరణలు: వాహన లోన్లు, విద్యా లోన్లు, వివాహం, ఇంటి మరమ్మతుల కోసం వ్యక్తిగత లోన్లు. ఇది 5 సంవత్సరాల కంటే ఎక్కువ ఉంటుంది. 30 సంవత్సరాల వరకు తిరిగి చెల్లించ వచ్చు. వడ్డీ రేటు షార్ట్ టర్మ్, మిడ్‌టర్మ్ లోన్ల కంటే తక్కువ, కానీ దీర్ఘకాల చెల్లింపు బాధ్యత ఉంటుంది. ఇవి పెద్ద పెట్టు బడుల కోసం అధిక నిధులు అందిస్తాయి. రుణదాతలు క్రెడిట్ చరిత్ర, ఆదాయ స్థిరత్వం, చెల్లింపు సామర్థం తనిఖీ చేస్తారు.

# మహిళా టెక్కీలకు సవాళ్లు

**ముంబై, మార్చి 30:** కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నాలజీ ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, వారు ఎక్కువగా ఎంట్రీ స్థాయికే పరిమితమవుతున్నారే తప్ప కెరీయర్‌లో పెద్దగా ముందుకెళ్లలేకపోతున్నారు. అలాగే పురుషులతో పోలిస్తే వేతనాల్లోనూ వ్యత్యాసాలు ఉంటున్నాయి. టీమ్‌లీజ్ డిజిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం డిజిటల్ మౌలిక సదుపాయలు మెరుగుపడడం, రిమోట్ వర్క్ అవకాశాలు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే 'డిఇఐ' విధానాలు గత నాలుగేళ్లలో మహిళా టెకీల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. 2020లో కాంట్రాక్టు టెక్ ఉద్యోగాల్లో మహిళల సంఖ్య 9.51 శాతంగా ఉండగా, 2024లో ఇది 27.97శాతానికి పెరిగింది. ఐటి సర్వీసుల రంగంలో మహిళా సిబ్బంది వాటా 7.8శాతం నుంచి 21.2 శాతానికి పెరిగింది. అయితే ఇది చెప్పుకోదగ్గ స్థాయిలో కెరియర్ పురోగతికి దారితీయడంలేదు. మధ్యస్థాయి ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం 4.13శాతం నుంచి 8.93శాతానికి మాత్రమే పెరగడం ఇందుకు నిదర్శనం. ఎంట్రీ స్థాయిని దాటి పురోగమించేందుకు మహిళలకు గణనీయంగా అవరోధాలు ఉండడాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నట్లు నివేదిక వివరించింది. 2020-2024 మధ్య టీమ్‌లీజ్ డిజిట్ టెక్ కాంట్రాక్ట్ సిబ్బందిలోని 13వేల మంది అసోసియేట్స్ గణాంకాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. వేతనాల విషయానికి వస్తే పురుషులు, మహిళల మధ్య ఎంట్రీ స్థాయి కొలువుల్లో 6శాతం, మధ్యస్థాయి ఉద్యోగాల్లో 19శాతం వరకు వ్యత్యాసం ఉంటోంది. అయితే సీనియర్ స్థాయిలో మాత్రం 13శాతంగా ఉంటోంది. 'కాంట్రాక్ట్ టెక్ ఉద్యోగాల్లో మహిళల సంఖ్య పెరుగుతుండడం హర్షణీయమే అయినప్పటికీ, లింగ సమానత సాధించాలంటే నియామకాల పరిధికి మించి బహుముఖ విధానాలను అమలు చేయాల్సిన అవసరంఉంది. లీడర్‌షిప్ స్థానాల్లో మహిళలకు ప్రాతినిధ్యం అంతగాలేకపోవడం, పురుషులతో పోలిస్తే వేతనాల మధ్య వ్యత్యాసాలు అలాగే కొనసాగుతుండడమనేది వ్యవస్థలో దీర్ఘకాలిక మార్పులను చేయాల్సిన ఆవశ్యకతను సూచిస్తుంది. మహిళలు ఉద్యోగాల్లో చేరడమే కాకుండా, కెరియర్‌లో పురోగమించేందుకు, సారథ్య బాధ్యతల్లో రాణించేందుకు అవసరమైన పరిస్థితులను కల్పించే దిశగా కంపెనీలు కృషి చేయాలి' అని టీమ్‌లీజ్ తెలిపింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.